www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



చేతులు లేకున్నా, కాళ్లతోనే బాణాలు సంధించి కాంస్యం సాధించిన భారత టీనేజ్ ఆర్చర్ శీతల్ దేవి

నితేశ్, సుమిత్‌కు స్వర్ణాలు

2

ఐదోరోజు బ్యాడ్మింటన్‌లో 4 పతకాలు

డిస్కస్ త్రోలో యోగేశ్‌కు రజతం

ఆర్చరీలో శీతల్ జోడీకి కాంస్యం

మంగళవారం | 3-9-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 140 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య ఉ. 7.24 తదుపరి పాడ్యమి; నక్షత్రం: పుబ్బ తె. 3.10 తదుపరి ఉత్తర; వర్జ్యం: ఉ. 9.16-11.04; దుర్ముహూర్తం: ఉ. 8.32-9.21, రా. 10.13-10.58; అమృతఘడియలు: రా. 8.00-9.48; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.23 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కష్టకాలం!

ముంపులోనే 2 లక్షల మంది

ఎక్కడికక్కడ ఊపందుకున్న సహాయక చర్యలు



బెజవాడలో వరద ముంపులో ఉన్న పాయకాపురం వద్ద ఆహారం తీసుకొచ్చిన ట్రాక్టర్ వద్ద గుమిగూడి సాయం కోసం చేతులు చాచిన బాధితులు

ఇంకా వరద గుప్పిటే విజయవాడ

బుడమేరు శాంతించడంతో తగ్గుతున్న ముంపు

ఆహారం, నీటి సరఫరాలో పెరిగిన వేగం

కృష్ణా నదికి 11.40 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

2009 వరదలను మించి పోటెత్తిన కృష్ణమ్మ

లంక గ్రామాల్లో హై అలర్ట్, ప్రజల తరలింపు

మున్నేరు శాంతించడంతో ఉపశమనం

హైదరాబాద్-విజయవాడ హైవే పునరుద్ధరణ

విజయవాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి భారీ వరద ఒకవైపు, బుడమేరు ఉగ్రరూపం మరోవైపు, ఎన్టీఆర్ జిల్లాను కన్నీటి కడలిలో ముంచేశాయి. రెండురోజులుగా వణికిస్తున్న వరద ఉధృతికి సుమారు 2.70 లక్షల మంది ముంపుబారిన పడగా, సోమవారం నాటికి 70 వేల మందిని సహాయక శిబిరాలకు తరలించారు. మరో రెండు లక్షల మంది ఇంకా ముంపులోనే ఉన్నారు. వారికి ఆహారం, తాగునీరు అందించే ప్రక్రియ నడుస్తోంది. కృష్ణానదికి 11.40 లక్షల క్యూసెక్కుల వరద రావడంతో విజయవాడ నగరంలోని భవానీపురం, బ్యారేజీ

మిగతా 2వ పేజీలో...

రాష్ట్రవ్యాప్తంగా విపత్తు!

పలు జిల్లాల్లో 19 మంది మృతి

ప్రభుత్వ చర్యలతో తగ్గిన ప్రాణనష్టం

బాధితులకు 24 గంటలూ సేవలందించేలా 112, 1070, 18004250101 నంబర్లు

మృతుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్‌గ్రేషియా

కలెక్టరేట్‌లోనే సీఎంవో!

2 రోజులుగా అక్కడే చంద్రబాబు

వరద ప్రాంతాల్లో రోజంతా తిరుగుతూ, విరామంలో కలెక్టరేట్‌లో సమీక్షలు

మంత్రులంతా విజయవాడలోనే..

అడుగడుగునా సీఎం స్వీయ పర్యవేక్షణ

ప్రజల భద్రత తమ బాధ్యత అంటూ ట్వీట్



విజయవాడ భవానీపురం ప్రాంతంలో జేసీబీ ఎక్కి, బాధితుల చెంతకు వెళ్లిన సీఎం చంద్రబాబు

శాంతించిన బుడమేరు.. ఉపశమిస్తున్న కృష్ణమ్మ

రంగంలోకి హెలికాప్టర్లు, పవర్ బోట్లు

కుదరని ప్రాంతాలకు డ్రోన్లతో ఆహారం

లక్షన్నర మందికి ఆహారం సరఫరా

21 మందిని కాపాడిన ఎన్డీఆర్ఎఫ్

వరద బాధితులందరినీ ఆదుకుంటాం

సాయమందేదాకా ఇక్కడే ఉంటా: సీఎం



నేవీ హెలికాప్టర్‌లోకి సహాయ సామగ్రిని ఎక్కిస్తున్న దృశ్యం

యాభై ఏళ్లలో ఎన్నడూ లేనంత వర్షం!

బుడమేరు చరిత్రలోనే కనీవినీ ఎరుగనంత వరద!

ప్రకాశం బ్యారేజీ కట్టిన తర్వాత ఎప్పుడూ లేనంత అతి భారీగా కృష్ణా నది ఉగ్ర రూపం!

ప్రకృతి ప్రకోపానికి బెజవాడ వణికిపోయింది. సోమవారం సాయంత్రందాకా పరిస్థితి బీభత్సంగానే ఉంది. ఆ తర్వాత.. మెల్లగా ఉపశమనం మొదలైంది. బుడమేరు వరద ప్రవాహం దాదాపుగా తగ్గిపోయింది. విజయవాడ నగరంలో జనావాసాలను చుట్టుముట్టిన వరద నీరు క్రమంగా తగ్గడం మొదలైంది. కనీవినీ ఎరుగని రీతిలో, రికార్డు స్థాయిలో పోటెత్తిన కృష్ణమ్మ కూడా మెల్లగా శాంతిస్తోంది. 2009 వరద స్థాయికి మించి.. సోమవారం 11.40 లక్షల క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. మంగళవారానికి ఇది 9 లక్షల క్యూసెక్కులకు తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో.. నగరానికి కృష్ణా ముంపు కూడా తగ్గనుంది. ఇక.. వరద బాధితులను ఆదుకునే చర్యలు సోమవారం గాడిన పడ్డాయి. రాష్ట్ర, జాతీయ విపత్తు స్పందన సిబ్బంది పూర్తిస్థాయిలో రంగంలోకి దిగారు. పెద్దసంఖ్యలో బోట్లు, పడవల్లో బాధితుల తరలింపు మొదలైంది. ఆహారం, నీటి పంపిణీ జరుగుతోంది. కానీ.. మారుమూల ప్రాంతాల్లో, పీకల్లోతు వరద ఉన్న చోటికి ఇప్పటికీ సహాయ సిబ్బంది చేరుకోలేకపోతున్నారు. మంగళవారం ముంపు మరింత తగ్గితేగానీ వీరి కష్టాలు తీరే మార్గం కనిపించడంలేదు!

'నిర్లక్ష్యపు' వరద!

అప్రమత్తం కావడంలో జిల్లా యంత్రాంగం విఫలం

బెజవాడకు ఒకేసారి 'ముప్పేట' కష్టాలు

కొండ చరియలు, కృష్ణా వరద, బుడమేరు ముంపు

బుడమేరు వరదపై అంచనా, జాగ్రత్తలు శూన్యం

విపత్తు ప్రణాళికను గాలికొదిలేసిన శాఖలు

మునిసిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖల మధ్య సమన్వయ లోపం

హెల్ప్‌లెస్‌గా మారిన జిల్లా కంట్రోల్ రూములు

అవగాహన, స్పందన లేని జిల్లాస్థాయి అధికారిణి

ముఖ్యమంత్రి రంగంలోకి దిగాకే సాయంలో వేగం

సమగ్ర కథనాలు 10, 11, 12లో



పొడిగా ఉన్న ఎమ్మెల్యే క్వార్టర్స్ ప్రాంతం

వరద తాకని రాజధాని

నిక్షేపంగా నవనగరం

వైసీపీ హయాంలో ముంచేందుకు కుట్ర

ఇప్పుడు కూడా భారీ వరదకు మునిగిపోయిందంటూ దుష్ప్రచారం



వరద ముంపుతో ఊరూవాడా ఏకమైన బెజవాడ నగరం ఏరియల్ వ్యూ

ప్రకాశం బ్యారేజీ 'కౌంటర్' కట్



విరిగిన ప్రకాశం బ్యారేజీ గేటు కౌంటర్ వెయిట్

వరద ఉధృతికి కొట్టుకు వచ్చిన బోట్లు

గేట్లకు సపోర్టుగా ఉండే కౌంటర్ వెయిట్లతో ఢీ

64, 69 నంబర్ గేట్ల వద్ద దెబ్బతిన్న దిమ్మెలు

69వ గేటు దగ్గర విరిగిన కౌంటర్ వెయిట్

మంత్రి నిమ్మల, సేఫ్టీ అధికారుల పరిశీలన

నిపుణుడు కన్నయ్యనాయుడికి కబురు

రాత్రికి హుటాహుటిన వచ్చిన కన్నయ్య

ప్రస్తుతానికి ముప్పులేదని స్పష్టీకరణ

వరద తగ్గాక వెయిట్ పెడదామని సూచన

కాల పరీక్షకు తట్టుకున్న 'ప్రకాశం'!

బ్యారేజీకి ఇదే అత్యధిక వరద

కృష్ణా కుడి కరకట్టపై గండ్లు!

ఏ క్షణంలోనైనా కట్ట తెగొచ్చని ఆందోళన

శరవేగంగా గండ్లు పూడ్చివేత పనులు

బుల్డోజర్ న్యాయం సరికాదు

నిందితుడైతే.. ఇంటిని కూల్చేస్తారా?

దోషిగా తేలినా అలా చేయకూడదు

నిబంధనల ప్రకారమే నడుచుకోవాలి

దీనిపై మార్గదర్శకాలు రూపొందిస్తాం

సమస్య దేశవ్యాప్తం..

పరిష్కారం చూపుతాం: సుప్రీం బెంచ్

2



రైతు సమస్యలపై కమిటీ

మధ్య కోస్తాకు మరో వాయు'గండం'

5న బంగాళాఖాతంలో అల్పపీడనం

వాయుగుండంగా మారుతుందని అంచనా

6, 7 తేదీల్లో పశ్చిమ నుంచి ప్రకాశం వరకు వర్షాలు

రెండు రోజుల్లో దీనిపై మరింత స్పష్టత

ఆ రెండు రోజులూ కుమ్మేసిన వాన

అందుకే ముంపులో విజయవాడ, పరిసర ప్రాంతాలు

3

ఇంత సంక్షోభంలోనూ సకాలంలో

జీతాలు, పెన్షన్లు



విజయవాడలోని వరద ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న వైసీపీ అధినేత జగన్

నా జనం ఏమయ్యారు?

పులివెందుల పర్యటనలో జగన్ విస్మయం.. 3 రోజులుగా కనిపించినవారే మళ్లీ మళ్లీ

అంతా అవినాశ్ కుటుంబ విధేయులే.. మొహం చాటేసిన సామాన్య ప్రజలు

3

ఫ్రస్టేషన్‌తో తలబాదుకుని ఆవేదన.. అసహనంతో పీఏ చెంప పగలగొట్టిన ఎంపీ

విజయవాడలో జగన్ పర్యటన

ముంపు బాధితులకు పరామర్శ

వరదలోనూ రాజకీయ విమర్శలు

12

వ్యవసాయాభివృద్ధికి.. ఏడు కొత్త పథకాలు

ఆమోదించిన కేంద్ర మంత్రివర్గం

2

రూ.14 వేల కోట్ల విడుదలకు పచ్చజెండా

రైతు ఆదాయం పెంపే లక్ష్యం: అశ్వినివైష్ణవ్

ఎస్‌బీఐ ఎండీగా రామ్మోహనరావు

కీలక పదవిలో మరో తెలుగు తేజం

9

కులగణనకు ఓకే

గణన వివరాలు సమాజ హితానికే ఉపయోగపడాలి

ఎన్నికల్లో ప్రచారాంశంగా వాడకూడదు: ఆరెస్సెస్

2



ఏలూరులో ఆహార పదార్థాలను ప్యాక్ చేస్తున్న దృశ్యం

జిల్లాల నుంచి తరలివస్తున్న ఆహారం

ఏలూరు జిల్లా నుంచి లక్షా 25 వేల ఆహార ప్యాకెట్లు

ఏలూరు సిటీ, ఒంగోలు కలెక్టరేట్, భీమవరం టౌన్, సెప్టెంబరు 2: వరదల్లో అతలాకుతలమైన ఎన్టీఆర్ జిల్లాకు ఏలూరు జిల్లా ఆపన్నహస్తం అందించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఆ జిల్లా అధికారులు లక్షా 25 వేల ఆహార ప్యాకెట్లు, లక్షా 20 వేల పాల ప్యాకెట్లు, లక్ష బిస్కట్ ప్యాకెట్లు, 30 వేల బ్రెడ్ ప్యాకెట్లు, 2 లక్షల వాటర్ ప్యాకెట్లు , 50 వేల కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలను విజయవాడకు తరలించారు. ఇక.. ఎన్టీఆర్ జిల్లాకు 25వేల ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లను ప్రకాశం జిల్లా అందించింది. పశ్చిమగోదావరి జిల్లా నుంచి 50 వేల ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్‌ను విజయవాడ తరలించారు.

1.7 లక్షలమందికి 5 రోజులపాటు ఆహారం

- దివీస్ సంస్థ ఎండీ దివి మురళీకృష్ణ

భీమునిపట్నం రూరల్, సెప్టెంబరు 2: విజయవాడ ప్రాంతంలోని 1.7 లక్షల మంది వరద బాధితులకు సోమవారం నుంచి ఐదు రోజుల పాటు ఆహార పొట్లాలు అందించనున్నట్టు దివీస్ కంపెనీ యాజమాన్యం తెలిపింది. ఈమేరకు ఆ సంస్థ ఎండీ దివి మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పలు జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవు

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వరదలు, వర్షాల ప్రభావం ఉన్న జిల్లాల్లో కలెక్టర్లు విద్యా సంస్థలకు మంగళవారం సెలవు ప్రకటించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో సెలవులు ఇచ్చినట్లు డీఈవోలు తెలిపారు.

వరద బాధితుల సేవలో మంత్రి దుర్గేష్

నిడదవోలు, సెప్టెంబరు 2: వరద బాధితుల సేవలో నేను సైతం అంటూ మంత్రి కందుల దుర్గేష్ ముందుకు కదిలారు. విజయవాడ ప్రాంత బాధితులకు ఆహారాన్ని అందించేందుకు సోమవారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో మిల్లర్స్ ఆధ్వర్యంలో ఆహారం తయారు చేశారు. ఈ పనులను పర్యవేక్షించేందుకు వచ్చిన మంత్రి కందుల దుర్గేష్ వంట పనుల్లో పాల్గొని కురుపీ తిప్పి అందరిలో ఉత్సాహం నింపారు.

సహాయక చర్యలపై మంత్రి లోకేశ్ సమీక్ష

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ విజయవాడలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వరద బాధితులకు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. వరద ఉధృతి అంచనా, బోట్ ఆపరేషన్, ఆహారం, తాగునీటి పంపిణీ, విద్యుత్తు సరఫరా తదితర సహాయక చర్యలకు సంబంధించి వివిధ ప్రభుత్వ విభాగాధిపతులకు బాధ్యతలు అప్పగించి... క్షేత్రస్థాయిలో ఆయా సేవలు ఏమేరకు బాధితులకు అందుతున్నాయనేది ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. డ్రోన్ల సహాయంతో వరద ముంపు ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. వరద ముంపులో చిక్కుకుపోయిన బాధితులకు సోమవారం 109 బోట్ల ద్వారా ఆహారం, తాగునీటిని సరఫరా చేశారు. విజయవాడ నగరంలో వరద ప్రభావిత ప్రాంతాలైన సింగ్‌నగర్, రామలింగేశ్వరనగర్ తదితర ముంపు ప్రాంతాల నుంచి 15 వేల మందికి పైగా నిరాశ్రయులను పునరావాస కేంద్రాలకు తరలించారు. వరద బాధితులకు నగరంలోని ప్రధాన కల్యాణ మండపాలు, హోటళ్లలో ఆశ్రయం కల్పించారు. భారీ వరదల వల్ల దెబ్బతిన్న సెల్ సిగ్నల్స్ పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. విజయవాడ నగరంలో 49 ప్రాంతాల్లో 1,39,815 ఇళ్లకు నిలిచిపోయిన విద్యుత్తు పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. కాగా, టీడీపీ శ్రేణులు వరద సహాయక చర్యల్లో పెద్దఎత్తున పాల్గొనాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.

ప్రభుత్వం ఏం చేయాలో అది చేస్తోంది: నారా భువనేశ్వరి

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరద పరిస్థితులు, సీఎం చంద్రబాబు అహోరాత్రులు సమీక్షిస్తూ, సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న తీరుపట్ల ఆయన సతీమణి నారా భువనేశ్వరి స్పందించారు. 'ప్రకృతి విపత్తులను ఆపడం మన చేతుల్లో ఉండదు. అలాంటి సమయాల్లో వేగంగా స్పందించి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు సహాయక చర్యలు అందిస్తే... ఆస్తి, ప్రాణ నష్టాలను తగ్గించుకోవచ్చు. బాధితులకు భరోసా కల్పించవచ్చు. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం అదే చేస్తోంది" అని భువనేశ్వరి పేర్కొన్నారు. అన్ని కార్యక్రమాల్లోనూ ఎన్టీఆర్ స్మారక ట్రస్ట్ కూడా తన వంతు సాయంగా రంగంలోకి దిగుతోందని తెలిపారు.

ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమం వాయిదా

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 5న నిర్వహించతలపెట్టిన ఉపాధ్యాయుల అవార్డుల కార్యక్రమాన్ని భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రభుత్వం వాయిదా వేసింది. మళ్లీ ఎప్పుడు నిర్వహించాలనేది ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

సహాయక చర్యల్లో పాల్గొనండి :మంత్రి సంధ్యారాణి

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):వరద బాధితుల సహాయక చర్యల్లో పాల్గొనాలని టీడీపీ, జనసేన నాయకులకు, కార్యకర్తలకు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. విజయవాడ, గుంటూరుల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం ఆమె పర్యటించారు.

అధికారులు అందుబాటులో ఉండాలి: మంత్రి మనోహర్

తెనాలి రూరల్, సెప్టెంబరు 2: వరద ముప్పు ప్రాంతాల్లో అధికార యంత్రాంగమంతా అందుబాటులో ఉండి సహాయక చర్యలు వేగవంతం చేయాలని మంత్రి మనోహర్ ఆదేశించారు. వరద ఉధృతిని ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం అంచనా వేస్తూ ముప్పు పొంచి ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తోందని మంత్రి తెలిపారు.

వరద కష్టాలపై వెంకయ్య విచారం

- రెండు రాష్ట్రాలకూ రూ.ఐదేసి లక్షల సాయం
- కుమారుడు, కుమార్తె రూ.ఐదేసి లక్షల సాయం
- ప్రధానికి మాజీ ఉపరాష్ట్రపతి ఫోన్.. సాయమందిస్తారని వెల్లడి



వెంకటాచలం, సెప్టెంబరు 2: తెలుగు రాష్ట్రాల్లో వరద కష్టాలపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుండపోత వర్షాలు, ఉధృతమైన వరదలతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వాటిల్లుతున్న నష్టం తనను తీవ్రంగా కలచి వేసినట్లు సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వరద కష్టాలపై ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేసి ప్రస్తుత పరిస్థితిని వివరించి, వెంటనే ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటికే రెండు రాష్ట్రాల సీఎంలతో తాను మాట్లాడానని, అక్కడి ప్రభుత్వ యంత్రాంగాలతో కేంద్ర అధికారులు టచ్‌లో ఉన్నారని, తగినంత ఆర్థిక సాయం రెండు రాష్ట్రాలకూ అందజేస్తామని ప్రధాని హామీ ఇచ్చారని తెలియజేశారు. రెండు రాష్ట్రాలకు తన వంతు సహకారంగా తన వ్యక్తిగత పెన్షన్ నుంచి ఆంధ్రప్రదేశ్ సీఎం సహాయనిధికి రూ.5లక్షలు, తెలంగాణ సీఎం సహాయనిధికి రూ.5లక్షల చొప్పున పంపించినట్లు తెలిపారు. అలాగే, తన కుమారుడు హర్షవర్ధన్ నిర్వహిస్తున్న ముప్పవరపు ఫౌండేషన్ తరఫున ఒక్కో రాష్ట్రానికి రూ.2.5 లక్షలు, తన కుమార్తె దీపావెంకట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ నుంచి ఒక్కో రాష్ట్రానికి రూ.2.5లక్షల చొప్పున మొత్తం పది లక్షలు అందజేసినట్లు తెలిపారు. ఈ కష్టకాలంలో ఇబ్బందుల్లో ఉన్నవారిని ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని, యువత సహాయక చర్యల్లో పాల్గొనాలని వెంకయ్య విజ్ఞప్తి చేశారు.

సెబీ చైర్‌పర్సన్ మాధవికి ఏడేళ్లుగా

ఐసీఐసీఐ నుంచీ జీతం!

2017 నుంచి రూ.16.8 కోట్లు పొందారు.. ఇది సెబీ చట్టంలోని సెక్షన్ 54 ఉల్లంఘనే

- సెబీ చైర్‌పర్సన్, సభ్యులను ప్రధాని ఆధ్వర్యంలోని కమిటీ నియమిస్తుంది
- అందుకే మోదీ స్పందించాల్సిందే: కాంగ్రెస్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: సెబీ చీఫ్ మాధవి పురీపై కాంగ్రెస్ సంచలన ఆరోపణలు చేసింది. గతంలో సెబీ సభ్యురాలి హోదాలో, ప్రస్తుతం సెబీ చైర్మన్ హోదాలోనూ ఆమె ఐసీఐసీఐ నుంచి ఏడేళ్లుగా జీతం తీసుకుంటున్నారని ఆరోపించింది. సెబీలో చేరాక 2017 నుంచి ఇప్పటిదాకా ఆమె ఐసీఐసీఐ నుంచి రూ.16.8 కోట్ల మేర పొందారని.. ఈ మొత్తం, సెబీ నుంచి ఆమె తీసుకుంటున్న జీతానికి ఐదు రెట్లు ఎక్కువ అని పేర్కొంది. ఇది సెబీ యాక్ట్ (ఎంప్లాయీ సర్వీస్)లోని 54 సెక్షన్‌ను ఉల్లంఘించినట్లేనని పేర్కొంది. 2017 ఏప్రిల్ 5న ఆమె సెబీ పూర్తి స్థాయి సభ్యురాలయ్యారని.. అప్పటి నుచి ఐసీఐసీఐ సంస్థ నుంచి కూడా ఆమె జీతం పొందుతున్నారని కాంగ్రెస్ పేర్కొంది. సెబీ చైర్‌పర్సన్, సభ్యులను ప్రధాని ఆధ్వర్యంలోని ఓ ప్రత్యేక కమిటీ నియమిస్తుందని అందుకే ఈ ఘటనపై ప్రధాని మోదీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ విషయమ్మీద కాంగ్రెస్ నేత పవన్ ఖెరా ఢిల్లీలోని ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడారు. సెబీ సభ్యురాలి హోదాలో, సెబీ చైర్‌పర్సన్ హోదాలోనూ మాధవి పురీ ఐసీఐసీఐ బ్యాంకు నుంచి 2016-2021 దాకా రూ.12.63 కోట్ల మేర జీతం తీసుకున్నారని.. 2017-24 మధ్య ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ నుంచి రూ.22.41 లక్షలను జీతంగా తీసుకున్నారని, 2021-23 మధ్య ఐసీఐసీఐ ఈఎస్‌వోపీ (ఎంప్లాయి స్టాక్ ఆప్షన్ ప్లాన్) నుంచి రూ.2.84 కోట్లు పొందారని, 2021-23 మధ్య ఐసీఐసీఐ నుంచి 1.10 కోట్ల మేర టీడీఎస్ మినహాయింపులు పొందారని ఆరోపించారు. కాగా సెబీ చైర్‌పర్సన్‌గా ఉన్న మాధవి, ఐసీఐసీఐ బ్యాంకు నుంచీ జీతం తీసుకుంటున్నారన్న విషయం ప్రధాని మోదీకి తెలుసా? అని కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి జైరామ్ రమేశ్ ట్విటర్ వేదికగా ప్రశ్నించారు. అదానీ గ్రూప్ సంస్థల మీద సెక్యూరిటీల చట్టం ఉల్లంఘన ఆరోపణలపై దర్యాప్తును సుప్రీంకోర్టు సెబీకి అప్పగించడంతో సెబీ చైర్‌పర్సన్‌గా మాధవి పురీ పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు పాల్పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు.. కాగా కాంగ్రెస్ ఆరోపణలను ఐసీఐసీఐ ఖండించింది. మాధవి 2013 అక్టోబరు 31న ఉద్యోగ విరమణ చేశాక ఆమెకు ఎలాంటి జీతం గానీ, ఈఎస్‌ఓపీ ప్రయోజనాలు గానీ ఇవ్వలేదని స్పష్టం చేసింది.



వ్యవసాయాభివృద్ధికి ఏడు కొత్త పథకాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: దేశంలో వ్యవసాయాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఏడు కొత్త పథకాలను ప్రకటించింది. వీటిల్లో డిజిటల్ అగ్రికల్చర్ మిషన్(రూ.2,817 కోట్లు), క్రాప్ సైన్స్ స్కీమ్(రూ.3,979 కోట్లు) ఉన్నాయి. సోమవారం ప్రధాని మోదీ నేతృత్వంలో భేటీ అయిన కేంద్ర క్యాబినెట్.. ఈ పథకాలకు రూ.14 వేల కోట్లను విడుదల చేయడానికి ఆమోదం తెలిపింది. కేంద్ర మంత్రి అశ్వినివైష్ణవ్ వివరాలను వెల్లడించారు. ఏడు కొత్త పథకాలతో రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు. "ఆహారం, పోషకాల భద్రతను దృష్టిలో పెట్టుకుని క్రాప్ సైన్స్ పథకాన్ని ప్రకటించాం" అని ఆయన వ్యాఖ్యానించారు. దీంతోపాటు.. కృషి విజ్ఞాన కేంద్రాల అభివృద్ధికి రూ.1,202 కోట్లను కేటాయించినట్లు వివరించారు. కాగా, ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ముంబై-ఇండోర్ మధ్య రైల్వే లైన్‌కు ఆమోద ముద్ర వేసింది. 309 కిలోమీటర్ల ఈ రైల్వేలైన్ నిర్మాణ వ్యయం రూ.18వేల కోట్లుగా పేర్కొన్న మంత్రి.. 2028-29 లోగా ఈ మార్గంలో రైళ్లు పరుగులు పెడతాయన్నారు. సుఖోయ్ యుద్ధ విమానాల కోసం హెచ్ఏఎల్ ద్వారా 240 ఏరో ఇంజన్లను సమకూర్చుకొనేందుకు క్యాబినెట్ కమిటీ ఆమోదించింది.

'బుల్డోజర్ న్యాయం' సరికాదు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: క్రిమినల్ కేసుల్లో నిందితులైనంత మాత్రాన వారి ఇళ్లను ఎలా కూల్చివేస్తారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ప్రస్తుతం నిందితుల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. అక్రమ కట్టడాలన్న ఆరోపణలతో వాటిని కూల్చేస్తున్నారు. ఈ కూల్చివేతలు వివాదాస్పదంగా మారుతున్నాయి. బుల్డోజర్ న్యాయం పేరిట జరుగుతున్న ఈ కూల్చివేతలను అడ్డుకోవాలంటూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. కేవలం నిందితులన్న కారణంతో వారి ఇంటిని ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించింది. ఒకవేళ దోషిగా నిర్ధారణ అయినా.. చట్టంలోని నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అదేసమయంలో అక్రమ నిర్మాణాలు లేదా రహదారులను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తాము రక్షించబోమని తేల్చిచెప్పింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ.. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇప్పటికే అఫిడవిట్ దాఖలు చేసినట్లు చెప్పారు. కేవలం నిందితులైనంత మాత్రాన వారి ఇళ్లను కూల్చివేయడం లేదని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలిన వారి ఇళ్లను.. అదికూడా స్థానిక సంస్థలు లేదా స్థానిక అభివృద్ధి సంస్థల నిబంధనల ప్రకారమే కూల్చివేస్తున్నట్లు స్పష్టం చేశారు. స్పందించిన ధర్మాసనం.. ఈ అంశంపై దేశమంతటా వర్తించేలా మార్గదర్శకాలను రూపొందిస్తామని తెలిపింది. కూల్చివేతల విషయంపై రాష్ట్రాలతో చర్చించి పరిష్కార మార్గాలను కనుగొంటామని మెహతా చెప్పారు. కొందరు నేరాలు చేసినంత మాత్రానే, వారి ఇళ్లను కూల్చేస్తున్నట్లుగా పిటిషనర్లు పేర్కొంటున్నారని.. అది సరికాదని తెలిపారు. కూల్చివేతల కంటే చాలా ముందే అధికారులు నోటీసులు జారీ చేశారని.. కావాలంటే ధర్మాసనానికి వాటిని చూపుతానని మెహతా అన్నారు. స్పందించిన ధర్మాసనం.. వ్యక్తులు లేదా అధికారులు ఎవరూ చట్టాల్లోని లొసుగులను అవకాశంగా చేసుకోరాదని పేర్కొంది. ఈ కూల్చివేతల అంశంపై దేశవ్యాప్తంగా అమలు చేసేలా మార్గదర్శకాలను రూపొందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. కాగా, ఈ విషయమై సలహాలు, సూచనలు అందజేయాలని ధర్మాసనం ఇరుపక్షాలను ఆదేశించింది.

రైతు సమస్యలపై సుప్రీం కమిటీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: పంట ఉత్పత్తుల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌తో శంభూ సరిహద్దులో ఏడాది కాలంగా ఆందోళనలు నిర్వహిస్తున్న రైతులతో చర్చల కోసం సుప్రీంకోర్టు ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. పంజాబ్-హరియాణా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నవాబ్ సింగ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వారం రోజుల్లోగా శంభూలోని రైతులతో సమావేశం కావాలని ఆదేశించింది. రైతులతో చర్చించి వారు హైవేపై అడ్డుగా పెట్టిన ట్రాక్టర్లు, ట్రాలీలను తొలగించేలా ఒప్పించాలని సూచించింది. రైతులు రాజకీయాల నుంచి దూరంగా ఉండాలని, నిరసన ప్రదర్శనలను రాజకీయం చేయవద్దని వ్యాఖ్యానించింది. కమిటీలో రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ బీఎస్ సంధూ, ప్రొఫెసర్ రంజిత్ సింగ్, పంజాబ్ వ్యవసాయ వర్సిటీ ఆర్థికవేత్త సుఖ్‌పాల్ సింగ్, మొహాలీకి చెందిన ప్రొఫెసర్ దేవీందర్ శర్మ ఉన్నారు. హరియాణా అగ్రికల్చర్ వర్సిటీ వీసీ కాంబోజ్‌ను ప్రత్యేక ఆహ్వానితుడిగా పరిగణిస్తూ అవసరమైతే ఆయన సూచనలు కూడా తీసుకోవాలని కోర్టు ఆదేశించింది.



కులగణనకు ఓకే


తిరువనంతపురం, సెప్టెంబరు 2: జాతీయ కులగణనకు అనుకూలంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కీలక ప్రకటన చేసింది. అయితే కులగణన ప్రక్రియ అనేది సమాజ హితానికి, కులాల ఉన్నతికి ఉపయోగపడాలే తప్ప 'రాజకీయాంశం' ఎంతమాత్రం కాకూడదని హితవు పలికింది. ఎన్నికల ప్రచారాంశం కోసమో, రాజకీయ ప్రయోజనాల కోసమో కులగణన వివరాలు (డేటా) ఉపయోగించకూడదని స్పష్టం చేసింది. కులగణన అనేది సున్నితమైన అంశమని, అయితే జాతీయ ఏకీకరణ పరంగా ప్రధానమైనదని సంఘ్ అఖిల భారత ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేడ్కర్ పేర్కొన్నారు. కేరళలోని పాలక్కడ్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సమన్వయ సమావేశాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జాతీయ కులగణనపై సునీల్ అంబేడ్కర్ మాట్లాడారు. 'హిందూ సమాజంలో కులం, కుల ఆధార సంబంధాలు అనేవి చాలా సున్నితమైన అంశాలు. ఇవి జాతీయ ఐక్యత, సమగ్రతలో అంతర్భాగం. కులగణన వివరాల (డేటా)ను ప్రాథమికంగా సంక్షేమ కార్యకలాపాల కోసం వినియోగించాలే తప్ప రాజకీయాస్త్రం ఎంతమాత్రం కాకూడదు' అని వ్యాఖ్యానించారు. ఇటీవల సంఘ్ నేత శ్రీధర్ గడ్డే కులగణన ప్రక్రియ ఓ నిరుపయోగమైన కసరత్తుగా కొట్టిపారేశారు. ఈ నేపథ్యంలో కులగణన ప్రక్రియకు జాతీయ స్థాయి సమన్వయ సమావేశాల వేదికగా సంఘ్ మద్దతు పలకడం గమనార్హం. కాగా రాజ్యాంగపరమైన రిజర్వేషన్లకు ఎప్పుడూ మద్దతిస్తామని సంఘ్ పేర్కొంది. బీజేపీతో కొన్ని సమస్యలున్నాయని అంగీకరించిన సంఘ్, అవి అంతర్గతమైనవేనని, పరిష్కరించుకుంటామని స్పష్టం చేసింది.

ఒక్కడే 41 మందిని గాయపర్చాడా?

- బెంగాల్ సర్కారుపై సుప్రీంకోర్టు ఫైర్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: పశ్చిమ్ బంగా ఛాత్ర సమాజ్ నాయకుడు సయాన్ లాహిరి బెయిల్‌ను సవాల్ చేస్తూ బెంగాల్ సర్కారు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆందోళనలకు సంబంధించి ఆయన ఒక్కడినే ఎందుకు అరెస్టు చేశారని.. '41 మంది పోలీసులను ఆయనే గాయపరిచారా' అంటూ నిలదీసింది. కోల్‌కతా హత్యాచార ఘటనపై బెంగాల్ సర్కారు తీరును నిరసిస్తూ ఛాత్ర సమాజ్ గత నెల 27న చేపట్టిన 'నబన్నా అభియాన్' ర్యాలీ హింసాత్మకంగా మారి నిరసనకారులతో పాటు పోలీసులు గాయపడ్డారు.

ప్రాణాలు 'తోడేలా'..



- యూపీలో తోడేళ్ల దాడులతో దడ
- నెలన్నరలోనే ఏడుగురు పిల్లల మృతి
- బంధించడానికి "ఆపరేషన్ భేడియా"
- 4 పట్టివేత.. రెండింటి కోసం గాలింపు

బహ్రాయిచ్, సెప్టెంబరు 2: పులులో.. చిరుతలో కాదు..! ఉత్తరప్రదేశ్‌లోని ఓ జిల్లా ప్రజలను తోడేళ్లు వణికిస్తున్నాయి. రాత్రిళ్లు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నెలన్నరలోనే ఎనిమిది మందిని పొట్టన పెట్టుకున్నాయి.. వీరిలో ఏడుగురు చిన్నారులే కావడంతో స్థానికుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. బహ్రాయిచ్ జిల్లాలోని మహసి ప్రాంతంలోకి ఎక్కడినుంచి వచ్చాయో కానీ.. ఆరు నెలల్లో కిందట ఆరు తోడేళ్లు ప్రవేశించాయి. ప్రజలపై దాడి చేస్తూ పరిసర వంద గ్రామాలను హడలెత్తిస్తున్నాయి. ప్రతి నాలుగైదు రోజులకు ఒక కొత్త గ్రామాన్ని ఎంచుకుంటున్నాయి. ప్రతిఘటించలేని వారు కావడంతో ముఖ్యంగా పిల్లలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. రాత్రివేళ 'వేట' పూర్తిచేసుకుని.. తెల్లారేసరికి గుహకు చేరిపోతున్నాయి. అంతేగాక ఎప్పటికప్పుడు స్థావరాలను మారుస్తున్నాయి. కాగా, ఆదివారం రాత్రి రెండేళ్ల గరేటి గురుదత్ సింగ్ గ్రామంలో తల్లిపక్కన నిద్రిస్తున్న అంజలిని లాక్కెళ్లాయి. సోమవారం మౌజా కొటియా గ్రామంలో ఇద్దరు మహిళలను గాయపరిచాయి. హర్ది ప్రాంతంలో తెల్లవారుజామున ఐదేళ్ల పరాస్‌పై మెడ పట్టుకుని లాక్కెళ్తుండగా అతడి తల్లి గుడియా వీరోచితంగా పోరాడి తరిమేసింది.

ఆపరేషన్ భేడియా..

మహసిలో తోడేళ్ల బెడదపై యూపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. 'ఆపరేషన్ భేడియా' చేపట్టింది. వాటి జాడ తెలుసుకునేందుకు డ్రోన్లు ఉపయోగించింది. ఉచ్చులు, బోన్లు పెట్టి నాలుగింటిని పట్టుకుంది. మిగతా రెండు మాత్రం ముప్పు తిప్పలు పెడుతున్నాయి. దీంతో.. మనిషి వాసనకు ఆకర్షితమై ఉచ్చులో చిక్కేందుకు.. ఆట బొమ్మలను పిల్లల మూత్రంతో తడిపి తోడేళ్లు సంచరించే దగ్గర ఉంచుతున్నారు. కాగా, బహ్రాయిచ్‌తో పాటు పొరుగునున్న సీతాపూర్ జిల్లాలోనూ తోడేళ్లు కలకలం రేపుతున్నాయి. యూపీ సీఎం యోగి సోమవారం పరిస్థితిని సమీక్షించారు. అటవీ శాఖ అధికారుల ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ తోడేళ్ల పనిపట్టాలని ఆదేశించారు.

రంగంలోకి పవర్ బోట్లు, హెలికాప్టర్లు

- ఇతర రాష్ట్రాల నుంచి 25 బోట్లు పంపిన కేంద్రం
- ఆర్మీ నుంచి 6, నేవీ నుంచి 3 హెలికాప్టర్లు

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు కృష్ణమ్మ ఉగ్రరూపం మరోవైపు బుడమేరు కన్నెర్రతో బెజవాడ బెంబేలెత్తింది. కనుచూపు మేర ఎటూ చూసినా వరదనీరు చుట్టుముట్టింది. దీంతో లక్షలాది మంది వరద బాధితులుగా మిగిలారు. ప్రభుత్వం సహాయక చర్యల్లో నిమగ్నమైంది. కేంద్రం నుంచి 25 పవర్ బోట్లు, తొమ్మిది హెలికాప్టర్లతో పాటు వంద మంది ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కూడా రంగంలోకి దిగి సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. ఆదివారం భారీ వర్షంతో ఇబ్బంది పడిన బృందాలు సోమవారం వరుణుడు శాంతించడంతో సహాయక చర్యలను వేగవంతం చేశాయి. దీంతో విజయవాడ కాస్త కోలుకుంటున్నట్టు కనిపించింది. సముద్ర తీర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి బోట్లు, హెలికాప్టర్లు తీసుకొచ్చి బాధితులకు ఆహార పదార్థాలు, మందులు, పాలు, నీళ్లు సరఫరా చేశారు. పిల్లలు, వృద్ధులు, రోగులకు అవసరమైన సహాయాన్ని అందజేశారు. వరద నీటిలో చిక్కుకున్న వారిని రక్షించారు. సింగ్ నగర్, రాజరాజేశ్వరి పేట, కృష్ణలంక తదితర ప్రాంతాల నుంచి వరద బాధితుల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కేంద్రం స్పీడ్ బోట్లు, హెలికాప్టర్లతోపాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపింది. రాష్ట్రంలోని ఎన్డీఆర్ఎఫ్, పోలీసు, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ యంత్రాంగమంతా సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. వర్షం తగ్గడంతో సహాయక చర్యలు వేగం పుంజుకున్నాయి. అయితే నీటి ప్రవాహం పూర్తిగా తగ్గుముఖం పట్టక పోవడంతో కాలనీల్లో రాకపోకలకు ఇబ్బందిగానే ఉంది. ఆదివారం ఐదు అడుగుల మేర ఉన్న నీరు సోమవారం మూడు అడుగులకు చేరిందని కృష్ణలంకలోని పోలీసు కాలనీ వాసులు చెప్పారు. నగర శివార్లలోని పలుప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తంగానే ఉంది.

లక్షన్నర మందికి ఆహారం సరఫరా

బాధితులు ఆకలితో అలమటించకుండా దుర్గగుడి, అక్షయపాత్ర, బెజవాడ ప్రైవేటు హోటల్స్ అసోసియేషన్ లక్షన్నర మందికి ఆహారం అందజేశాయి. కృష్ణా మిల్క్ డైరీ లక్షలాది లీటర్ల పాలు సరఫరా చేసింది. ఇదిలా ఉండగా ఆర్టీసీ వందలాది సర్వీసులను రద్దు చేసింది.

ఇతర రాష్ట్రాల నుంచి...

వరద సహాయ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇతర రాష్ట్రాల నుంచి పాతిక పవర్ బోట్లు, ఆరు హెలికాప్టర్లు విజయవాడకు చేరుకొన్నాయి. అలాగే వంద మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కూడా వచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి మేరకు కేంద్రం తక్షణమే స్పందించి పవర్ బోట్లు, హెలికాప్టర్లతో పాటు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పంపించింది. సోమవారం ఉదయానికి ఇవి అందుబాటులోకి వచ్చాయి.

21 మందిని కాపాడిన ఎన్డీఆర్ఎఫ్

వరద ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్న వారికి కాపాడేందుకు సోమవారం సాయంత్రానికి మూడు నేవీ హెలికాప్టర్లు కూడా విజయవాడకు చేరుకున్నాయి. హకీమ్‌పేట ఎయిర్‌బేస్ నుంచి మరో నాలుగు అందుబాటులోకి రానున్నాయి. కొటికలపూడి వద్ద కృష్ణానది వరదలో చిక్కుకున్న 21 మందిని ఏఎల్‌హెచ్ 717 హెలికాప్టర్ ద్వారా ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడి, సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. ఆహారాన్ని బాధితులకు చేరవేసే బాధ్యతను సీనియర్ ఐఏఎస్ అధికారి జి.వీరపాండియన్‌కు అప్పగించారు. కాగా, వరద బాధితులకు డ్రోన్ల ద్వారా ఆహారం పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాటుచేశారు. వరద ముంపు ప్రాంతాల్లో 3.9 లక్షల ఆహార పొట్లాను పంపిణీ చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు.



ఆహారాన్ని డ్రోన్లకు కట్టి...

బహుళ అంతస్తుల మిద్దెలపై చిక్కుకుపోయిన వరద బాధితులకు డ్రోన్ల సాయంతో ఆహార పొట్లాలు అందిస్తున్న దృశ్యం

పురందేశ్వరికి జేపీ నడ్డా ఫోన్

విజయవాడలో వరద ముంపు, ప్రజలు పడుతున్న ఇబ్బందులపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరా తీశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీజేపీ, అనుబంధ సంఘాల శ్రేణులు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆదేశించారు. కాగా, విజయవాడ కలెక్టరేట్‌లో మంత్రి కొల్లు రవీంద్ర అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి నారా లోకేశ్‌తో కలిసి వరద సహాయ కార్యక్రమాలపై ఆరాతీశారు. సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో వరద బాధితులకు ఆహారం అందడంలేదనే ఫిర్యాదుల నేపథ్యంలో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

చచ్చిపోవాలని ఉంది తిండి కూడా పెట్టడం లేదు

- బెహ్రాయిన్‌లో చిక్కుకున్న కోనసీమ మహిళ ఆవేదన
- ఏజెంట్ మోసం చేశాడని వెల్లడి
- కుటుంబ సభ్యులకు సెల్ఫీ వీడియో



పావని

అమలాపురం రూరల్, సెప్టెంబరు 2: ఏజెంట్ మోసానికి బలైన మరో మహిళ గల్ఫ్ దేశంలో చిక్కుకున్నారు. అక్కడ కష్టాలు భరించలేక బోరున విలపిస్తున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం నడిపూడి గ్రామానికి చెందిన దుక్కిపాటి పావని(21) ఆగస్టు 25న గల్ఫ్ దేశం బెహ్రాయిన్‌కు వెళ్లి పడరాని పాట్లు పడుతున్నారు. తన వద్దనున్న ఒకే ఒక ఆధారం సెల్‌ఫోన్ అని, అది కూడా తీసేసుకుంటామని ఇప్పటికే ఇంటి యజమాని బెదిరిస్తున్నట్టు సెల్ఫీ వీడియోలో బోరున విలపిస్తూ సోమవారం భర్తకు ఆమె వీడియో పంపారు. బెహ్రాయిన్‌లోని ఓ షేక్ ఇంట్లో ఉండి బిడ్డ ఆలనా పాలనా చూసుకుంటే నెలకు వేలకు వేలు జీతం వస్తుందని కాట్రేనికోన మండలం పల్లంకుర్రుకు చెందిన గల్ఫ్ ఏజెంట్ పాలెపు శ్రీనివాస్ నమ్మించాడు. అయితే.. అక్కడకు వెళ్లిన వారం రోజుల్లోనే నరకం అంటే ఏమిటో చవి చూపించారు. రేయింబవళ్లు పనిచేస్తున్నా తిండి కూడా పెట్టడంలేదు అని పావని తన సెల్ఫీ వీడియోలో వాపోయారు. ఈ వీడియోను కుటుంబ సభ్యులకు పంపించారు. దీంతో ఆమె భర్త దుక్కిపాటి దుర్గాప్రసాద్ పిల్లలతో సోమవారం అమలాపురం కలెక్టరేట్‌కు వచ్చి తన భార్యను క్షేమంగా తీసుకువచ్చేలా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.



హైకోర్టుకు వెళ్లే దారి

వరద తాకని రాజధాని!

నిక్షేపంగా నవనగరం.. వైసీపీ హయాంలో ముంచేందుకు కుట్ర
ఇప్పుడు కూడా భారీ వరదకు మునిగిపోయిందంటూ దుష్ప్రచారం

అమరావతి/గుంటూరు/తుళ్లూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతి కాల పరీక్షను ఎదుర్కొని దీటుగా నిలిచింది. నవ నగరం నీట మునిగిందంటూ దుష్ప్రచారానికి దిగినవారికి గట్టిగా సమాధానమిచ్చింది. ప్రకృతి పెట్టిన కాల పరీక్షల్లో అత్యధిక మార్కులతో పాసై ప్రజా రాజధానిగా నిలిచింది.. 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక పర్యటనలో.. రాజధానికి అత్యంత అనువైన, సురక్షితమైన ప్రాంతంగా మరోమారు నిరూపించుకుంది. నవ్యాంధ్ర రాజధానిని విచ్ఛిన్నం చేయాలని ఎన్నో శక్తులు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లు అమరావతి స్థల మహత్యమో, ప్రకృతి వరమో తెలియదుగానీ అమరావతి మునిగిపోవాలన్న కొందరి కలలు కల్లలుగానే మిగిలిపోతున్నాయి. మానవ నాగరికతలన్నీ నదీ పరివాహక నాగరికతలేనన్న చారిత్రక సత్యాన్ని తెలుసుకోలేని గత వైసీపీ ప్రభుత్వం.. రాజధానిని వరదల్లో ముంచాలని గతంలో ప్రయత్నించిందని రాజధానివాసులు ఆక్షేపిస్తున్నారు. 'కృష్ణానదిని ఆనుకుని ఉన్న రాజధాని వరదల బారిన పడి మునిగి పోతుందని ప్రచారం చేయాలని చూసింది. అందుకోసం ప్రకాశం బ్యారేజీ నుంచి వరదను దిగువకు వదలకుండా బలవంతంగా నిల్వ ఉంచింది. వరద ముంపునకు గురైతే ఆ కారణం చూపి విశాఖకు రాజధానిని తరలించుకోవాలని ప్రయత్నించింది. కానీ ఒక్క చుక్క నీరు కూడా రాజధాని దరి చేరలేదు. తాజా రికార్డు వరద సమయంలోనూ అదే దుష్ప్రచారానికి వైసీపీ తెరలేపింది. రాజధాని నగరం మొత్తం మునిగిపోయిందని జగన్ నీలి మీడియా తప్పుడు వార్తలు వండివార్చింది. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' రాజధాని గ్రామాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయి పరిస్థితులను చిత్రీకరించింది.

సురక్షిత నగరంగా అమరావతి

అమరావతికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న విజయవాడ మహానగరం వరద ముంపునకు గురయింది. గుంటూరులోనూ భారీవర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో వైసీపీ అమరావతి మునిగిపోయిందంటూ ప్రచారం మొదలుపెట్టింది. సోషల్ మీడియాలో తప్పుడు వీడియోలు పోస్టుచేసింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరేలా ఉంది. హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ భవనాలను నిర్మించే కోర్ క్యాపిటల్ ప్రాంతం అత్యంత సురక్షితంగా ఉంది. రాజధాని గ్రామాల్లో వర్షం కారణంగా నిలిచిన నీరు తప్ప ఎక్కడా వరద ఆనవాలు లేదు. హైకోర్టుకు వెళ్లే దారులు, శాసన సభ్యులు, మండలి సభ్యుల భవనాలకు వెళ్లే దారులు, సీడ్ యాక్సిస్ రోడ్డు, ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల భవన సముదాయాలు, గ్రూప్-డీ ఉద్యోగుల భవనాల పరిసరాల్లోచుక్క నీరు కూడా నిలిచి లేదు. తుఫాను ప్రభావాన్ని దాటి, అతి భారీ వర్షాల ధాటిని అధిగమించి ఆ ఆకాశ హర్మ్యాలు దర్జాగా నిలిచి ఉన్నాయి.



ఆలిండియా సర్వీసెస్ ఉద్యోగుల భవన సముదాయానికి వెళ్లే దారి



గ్రూప్- డీ ఉద్యోగుల సముదాయం వద్ద చుక్క నీరులేని వైనం



జడ్జిల భవనాల వద్ద పరిస్థితి

మాస్టర్ ప్లాన్‌తో ముందుచూపు..

రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్ రూపొందించే సమయంలోనే అప్పటి టీడీపీ ప్రభుత్వం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంది. రాజధాని గ్రామాల్లో ముంపునకు కారణమయ్యే ఏకైక అవకాశం కొండవీటి వాగుగా గుర్తించింది. దాని ముంపు నుంచి రాజధానిని రక్షించేందుకు అప్పుడే చర్యలు చేపట్టింది. ఆ వాగు వరద నీరు సాధారణంగా కృష్ణా నదిలో కలిసే అవకాశం ఉన్నా, అత్యధిక వరద వచ్చినప్పుడు సమస్య తలెత్తకుండా లిఫ్టులను ఏర్పాటు చేసింది. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ లిఫ్టులను వాడకుండా కొండవీటి వాగు వరద నీటితో అమరావతిని ముంపు బారిన పడేలా చేయాలని ప్రయత్నించిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు అవే లిఫ్టులు కొండవీటి వాగు వరద ముంపు నుంచి అమరావతిని రక్షించడానికి దోహదపడ్డాయి. రాజధాని ప్రాంతానికి, నదికి మధ్యలో పెద్ద కరకట్ట అడ్డుగా ఉంది. వరద నీరు దాని వరకూ వచ్చి ఆగిపోయింది. ఆ రెంటి మధ్యలో ఉన్న కొన్ని భవనాలు మాత్రం కొంత మేర ముంపునకు గురయ్యాయి. మంతెన సత్యనారాయణ రాజు ప్రకృతి ఆశ్రమం నది ఒడ్డునే ఉంది. దానిలోకి నీళ్లు వచ్చాయి. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తుతం నివాసం ఉంటున్న అద్దె ఇల్లు కూడా నదిని ఆనుకునే ఉంటుంది. ఆ ఇంటి ప్రహరీ గోడను తాకుతూ నది ప్రవహిస్తూ ఉంటుంది. ఆ ఇంటి ఆవరణలోకి కూడా స్వల్పంగా నీళ్లు వచ్చాయి. కానీ కరకట్టను దాటి మాత్రం ప్రవేశించలేదు. మంతెన ఆశ్రమం వద్ద కరకట్ట వద్ద ఒక తూమును గతంలో మూసివేయకుండా వదిలేశారు. ఆ తూము వద్ద వరద నీరు లీక్ అవుతుండడంతో ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. ఈ ఆశ్రమం నుంచి రాష్ట్ర సచివాలయం ఐదు కిలోమీటర్ల దూరంలో. హైకోర్టు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. వాటి దరిదాపుల్లో కూడా వరద ప్రభావం కనిపించలేదు. రాజధానికి భూ సేకరణకు ముందు ఆ ప్రాంతంలో కొండవీటి వాగు వరద సమస్య సృష్టిస్తూ ఉండేది. కానీ టీడీపీ ప్రభుత్వం దాని వరద కోసం ప్రత్యేకంగా ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయడంతో ఈసారి ఆ వాగు ప్రవాహం సాఫీగా వెళ్లిపోయింది. అమరావతి పేరుతో ఒక మండల కేంద్రం రాజధాని ప్రాంతానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. అది పెదకూరపాడు నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. ఆ అమరావతి గ్రామంలోని పల్లపు ప్రాంతాల్లోకి మాత్రం వరద కొంతమేర వచ్చింది.

అమరావతిలో గ్లోబల్ మెడిసిటీ

- ప్రతి నియోజకవర్గంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
- ప్రవాస వైద్యులు చేయూతనివ్వాలి: మంత్రి సత్యకుమార్



మంత్రి సత్యకుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కామినేని శ్రీనివాస్

అమరావతి/గుంటూరు (మెడికల్), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉండేలా అత్యంత అధునాతన రీతిలో గ్లోబల్ మెడిసిటీ నిర్మాణం చేపడుతున్నట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. అమెరికాలోని ఓర్లాండో నగరంలో జరుగుతున్న గుంటూరు వైద్య కళాశాల, కాకినాడ రంగరాయ వైద్య కళాశాల, విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ద్వైవార్షిక సంయుక్త సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం జరిగిన ఈ సమావేశంలో సత్యకుమార్ తొలుత ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ.. ఏపీలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొత్తగా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మించనున్నట్టు తెలిపారు. అమరావతిలో నిర్మించే గ్లోబల్ మెడిసిటీకి ఎన్ఆర్ఐ వైద్యులు వచ్చి తమ వంతు వైద్యసేవలు అందించాలని మంత్రి పిలుపునిచ్చారు. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో రూ.100 కోట్ల భారీ వ్యయంతో అత్యాధునిక రీతిలో మాతా శిశు సంరక్షణ కేంద్రం నిర్మించడం జీఎంసీ పూర్వ విద్యార్థుల సంఘం (జింకానా) దాతృత్వానికి నిదర్శనమని ఆయన కొనియాడారు. రాష్ట్రంలో ప్రసిద్ధ వైద్య కళాశాల్లో చదివి ఏళ్ల తరబడి అమెరికా తదితర దేశాల్లో స్థిరపడిన ప్రవాస భారతీయ వైద్యులు తాము నివసిస్తున్న దేశంతో పాటు మాతృ భూమికి అందిస్తున్న సేవలు అమూల్యమైనవని ఆయన ప్రశంసించారు. గత ఐదేళ్ల జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని విధాల నష్టపోయినట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి ఎన్‌డీఏ ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రతువులో ప్రవాసాంధ్రులు భాగస్వాములుకావాలని, అవసరమైన సాయం అందించేందుకు ముందుకు రావాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, నాట్కో వైస్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ సెక్టార్) నన్నపనేని సదాశివరావుతో పాటు ఆయా వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నేతలు పాల్గొన్నారు.



విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేస్తున్న పద్మభూషణ్ గోపాలకృష్ణన్, ఎస్ఆర్ఎం ప్రతినిధులు

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- పద్మభూషణ్ సేనాపతి క్రిస్ గోపాలకృష్ణన్
- ఘనంగా ఏపీ ఎస్ఆర్ఎం 4వ స్నాతకోత్సవం
- 1,018 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 2: ఇంజనీరింగ్ విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని దేశాభివృద్ధికి తోడ్పాటును అందించాలని పద్మభూషణ్ సేనాపతి క్రిస్ గోపాలకృష్ణన్ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం నాల్గవ స్నాతకోత్సవ సోమవారం ఘనంగా జరిగింది. వర్సిటీ ఉపకులపతి ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో గోపాలకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరై డిగ్రీలు అందుకున్న విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. నేటితరం విద్యార్థుల భాగస్వామ్యం కోసం ప్రపంచం ఎదురు చూస్తుందన్నారు. రాబోయే 80 ఏళ్లలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని చెప్పారు. స్విగ్గీ సంస్థ సీఈవో రోహిత్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టాలని సూచించారు. ఎస్ఆర్ఎం వ్యవస్థాపక చాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్ మాట్లాడుతూ మానవ జీవితం సవాళ్లతో ముడిపడి వుంటుందని, ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ విజయ శిఖరాలను చేరుకోవాలని సూచించారు. వర్సిటీ కులపతి డాక్టర్ వీ.సత్యనారాయణన్ మాట్లాడుతూ పట్టభద్రులుగా పట్టాలు పొందడం విద్యార్థులకు జీవితంలో మరిచిపోలేని మైలురాయి వంటిదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, డీన్‌లు డాక్టర్ వినాయక్, ప్రొఫెసర్ విష్ణుపథ్ ప్రొఫెసర్ సీవీ టామీ డాక్టర్ భరద్వాజ్, డైరెక్టర్లు అనూప్‌సింగ్, రేవతీ బాలకృష్ణన్, పంకజ్, రాయ్ ఫెర్నాండేజ్, సీఎఫ్ఏవో సుమ, అరుంధతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మొత్తం 1,018 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేసింది. ప్రతిభ కనబర్చిన 28 మంది విద్యార్థులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలను అందుకున్నారు. అకడమిక్స్ డీన్ డాక్టర్ కల్లూరి వినాయక్ ఆధ్వర్యంలో 18 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, ఐదుగురికి రజత, మరో ఐదుగురికి కాంస్య పతకాలను ప్రదానం చేశారు. 24 మంది పీహెచ్‌డీ విద్యార్థులు, మరో 26 మంది ఎంటెక్ విద్యార్థులు, 835 మంది ఇంజనీరింగ్, 11 మంది సైన్సెస్, 60 మంది ఎంబీఏ, 29 మంది బీబీఏ, ముగ్గురు బీకాం చదువులు పూర్తి చేసుకుని డిగ్రీలు అందుకున్నారు. వీరితోపాటు ఈశ్వరీ స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ నుంచి 30 మంది విద్యార్థులకు డిగ్రీలను అందజేశారు.

చంద్రబాబు అరెస్టు.. జగన్ చేసిన అతిపెద్ద తప్పు

- జైలుకు పంపేంత తీవ్రమైన అభియోగాలు ఆ కేసులో లేవు
- మీడియాతో ఉండవల్లి అరుణ్‌కుమార్



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 2: చంద్రబాబు నాయుడును జైలుకు పంపడం జగన్ జీవితంలో చేసిన పెద్ద తప్పు అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. జగన్ చేసిన ఆ ఒక్క తప్పు వల్లే ఓటమి పాలయ్యాడన్నారు. చంద్రబాబును జైలుకు పంపేంత తీవ్రమైన అభియోగాలు ఆ కేసులో లేవని భావిస్తున్నానన్నారు. మనీ ట్రయల్‌లో ఆయన దాకా డబ్బు వచ్చిందని ఎక్కడా చూపించలేదని స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక ఆఫీసర్‌పై కేసు పెట్టేటప్పుడు ఏ తప్పులైతే గత ప్రభుత్వాలు చేశాయో ఆ తప్పులు చంద్రబాబు ప్రభుత్వం కూడా చేయొద్దని చెబుతున్నానని అన్నారు. అధికారులను వేధించాలంటే ప్రొసీజర్ ప్రకారం వెళ్లాలని, కంప్లయింట్ ఇచ్చిన మనిషి ఎవరనేది చూడాలన్నారు. 'ముంబయి హీరోయిన్ కేసు చాలా కాంప్లికేటెడ్‌గా ఉంది. హనీట్రాప్ పరిస్థితిలా ఉంది. అందుకే కొంచెం జాగ్రత్తగా వెళ్లాలి. లేకపోతే మైనస్ అవుతుంది' అని ఉండవల్లి అన్నారు. తాను ఆటోబయోగ్రఫీ రాస్తున్నానని, అందులో చంద్రబాబుకు 30,40 పేజీలు కేటాయిస్తానని ఉండవల్లి తెలిపారు.

నా జనం ఏమయ్యారు?

పులివెందుల పర్యటనలో జగన్ విస్మయం

- ఎంపీ, పార్టీ నేతలపై జగన్ ఆగ్రహం

కడప, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో మూడు రోజుల పర్యటనలో ప్రజాదర్బార్ నిర్వహించారు. రెండు రోజుల పాటు ప్రజలను, నాయకులను కలిశారు. అయితే ఆయన గత మూడు పర్యటనల్లో ఎవరైతే వచ్చారో ఈసారి కూడా అదేజనం కనిపించారు. వారంతా వైఎస్ భాస్కరరెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డి కుటుంబానికి విధేయులు. కానీ పులివెందులకు చెందిన సామాన్య జనం మాత్రం మొహం చాటేశారు. తన కుటుంబానికి కంచుకోటగా భావించే పులివెందులలో తనను కలిసేందుకు స్థానిక ప్రజలు రాకపోవడం చూసి జగన్ ఆందోళనకు గురయ్యారంటున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. శనివారం రాత్రి పులివెందులలో తన ఇంటికి జగన్ చేరుకునే సమయానికి అక్కడ ప్రజలు ఎవరూ లేరు. ఆదివారం ఆయన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనాలైతే వచ్చారు కానీ పులివెందుల నియోజకవర్గంలోని ప్రజలు కనిపించలేదు. వైఎస్ భాస్కర్ రెడ్డి, అవినాశ్‌రెడ్డి కుటుంబం ఎవరిని చేరదీసిందో వారే అక్కడ కనిపించడం జగన్‌కు నచ్చలేదు. అవినాశ్‌రెడ్డి చిన్నాన్న, మున్సిపల్ వైస్‌చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి వచ్చిన సందర్భంలో ఓ ఐదారుగురు కౌన్సిలర్లు, చోటామోటా నాయకులు ఆయన వెంట వచ్చారని తెలిసింది. వెంటనే జగన్.. 'నీకు వీరు తప్ప ఇంకెవరూ లేరా? ప్రజలు ఎవరినీ పట్టించుకోవా' అని ఆయన ముఖంమీదే అడిగినట్టు తెలిసింది. ఆదివారం రాత్రి ప్రజాదర్బార్ ముగిసిన తర్వాత ఇంట్లో తన సతీమణి భారతి, అవినాశ్‌రెడ్డి, మరో ఒకరిద్దరు నాయకులు ఉన్న సమయంలో.. 'పులివెందులలో ఏం జరుగుతోంది? గత మూడు పర్యటనలలో కనిపిస్తున్న వారే ఈ రోజూ కనిపించారు తప్ప సామాన్య ప్రజలు ఎవరూ ఎందుకు రావడం లేదు' అని జగన్ ప్రశ్నించారని తెలిసింది. అవినాశ్‌రెడ్డిపై జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని, ఫ్రస్ట్రేషన్‌తో తల బాదుకున్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అసహనానికి గురైన ఎంపీ అవినాశ్ రెడ్డి.. బయటికి రాగానే ఎదురొచ్చిన తన పీఏ చెంపపై కొట్టినట్లు తెలిసింది.





ఇడుపులపాయ ఘాట్‌లో వైఎస్‌కు వేర్వేరుగా నివాళి అర్పిస్తున్న జగన్, షర్మిల

వైఎస్‌కు జగన్, షర్మిల వేర్వేరుగా నివాళి

- ఉదయం 7.30 గంటలకు అన్న వెళ్లిన 15 నిమిషాలకు చెల్లెలు
- ఒకరికొకరు ఎదురుపడని వైనం

పులివెందుల, సెప్టెంబరు 2: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా అన్నాచెల్లెలు జగన్, షర్మిల వేర్వేరుగా తండ్రికి నివాళులు అర్పించారు. వైఎస్ సతీమణి విజయమ్మ అటు కొడుకుతోను, ఇటు కూతురుతోను వైఎస్‌కు నివాళులు అర్పించారు. సోమవారం ఇడుపులపాయలో వైఎస్ ఘాట్ వద్ద ఆయన 15వ వర్ధంతి కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి జగన్ ఉదయం 7.30 గంటల ప్రాంతంలో వైఎస్ ఘాట్‌కు చేరుకుని నివాళులు అర్పించారు. ఆయనతో పాటు సతీమణి భారతి, తల్లి విజయమ్మ, ఎంపీలు అవినాశ్‌రెడ్డి, గురుమూర్తి, ఎమ్మెల్యేలు అమర్‌నాథ్‌రెడ్డి, డాక్టర్ సుధ, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజాద్‌బాషా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కడప మేయర్ సురేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జగన్ 8 గంటల ప్రాంతంలో అక్కడి నుంచి బయలుదేరి కడపకు వెళ్లి విమానంలో గన్నవరం వెళ్లారు. జగన్ వెళ్లిన 15 నిమిషాలకు ఆయన సోదరి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వైఎస్ ఘాట్‌కు చేరుకుని తండ్రికి నివాళులు అర్పించారు. తల్లి విజయమ్మ, కుటుంబ సభ్యులు సుధీకర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. జగన్, షర్మిల ఒకరికొకరు ఎక్కడా ఎదురుపడకుండా తమ షెడ్యూల్ ప్రకారం నివాళులు అర్పించి వెళ్లిపోయారు.

విడదల రజినీ మరో దందా!

- వైసీపీ ప్రభుత్వంలో సెటిల్‌మెంట్లు
- స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి రూ.2 కోట్లు వసూలు చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు
- నేరుగా బేరాలాడిన మాజీ మంత్రి

గుంటూరు, సెప్టెంబరు 2: వైసీపీ ప్రభుత్వంలో నాటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినీ సాగించిన దందాలు, సెటిల్‌మెంట్లు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తనను బెదిరించి రూ.2.20 కోట్లు వసూలు చేసినట్టు పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలోని యడ్లపాడుకు చెందిన శ్రీలక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ యజమాని సోమవారం ఏసీబీ డీజీ కార్యాలయంలోనూ, గుంటూరులోని ఏసీబీ అదనపు ఎస్పీ మత్తె మహేంద్రకు రాతపూర్వకంగా ఫిర్యాదుచేశారు. స్టోన్ క్రషర్ యజమాని నల్లపనేని చలపతిరావు ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీ లక్ష్మీబాలాజీ స్టోన్ క్రషర్‌ను చలపతిరావు మరో ముగ్గురితో కలిసి 2010 నుంచి నడుపుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక.. 2020 సెప్టెంబరు 4న విడదల రజినీ తనను కలవాలంటూ పీఏ రామకృష్ణ ద్వారా క్రషర్ యజమానులకు కబురుపెట్టారు. దీంతో చలపతిరావు, వ్యాపారంలో మరో భాగస్వామి అయిన నంబూరు శ్రీనివాసరావు రజినీ ఆఫీసుకు వెళ్లి ఆమెను కలిశారు. ఈ సందర్భంగా.. వ్యాపారం చేసుకొనే వారు ఎమ్మెల్యేకి డబ్బులివ్వాలి కదా? మీరు క్రషర్ నడుపుతున్నందుకు రూ.5 కోట్లు ఇవ్వాలి' అని రుబాబు చేశారు. అయితే, తాము అన్ని అనుమతులతోనే సంస్థను నడుపుతున్నామని, అంత డబ్బు ఇచ్చుకోలేమని రజినీ పీఏకు చెప్పినా వినిపించుకోలేదు. ఆ తర్వాత సెప్టెంబరు 11న విజిలెన్స్ ఎస్పీ జాషువా కనీసం నోటీసులు లేకుండా క్రషర్‌ను సందర్శించి క్రషర్ నిర్వహణలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు తమకు సమాచారం వచ్చిందని, రూ.50 కోట్లు జరిమానా కట్టవలసి ఉంటుందని చలపతిరావును బెదిరించారు. మార్చి 2021లో జాషువా.. మరోసారి ఫోన్ చేసి.. వారం రోజుల్లో సెటిల్ చేసుకోకపోతే రూ.50 కోట్లు ఫైన్ రాసి క్రిమినల్ కేసు కూడా నమోదు చేస్తానని బెదిరించారు. అనంతరం రజినీ మరిది విడుదల గోపీని కలిసి ప్రాథేయపడగా.. బేరం కొంత తగ్గించారు. డబ్బు ఇచ్చే ముందు రజినీకి ఫోన్ చేయగా.. మొత్తం రూ.2.20 కోట్లు గోపీ చేతికి ఇవ్వాలని చెప్పడంతో.. 2021 ఏప్రిల్ 4న చిలకలూరుపేట టౌన్‌లోని పురుషోత్తపట్నంలోని ఆయన ఇంటి వద్ద రాత్రి 11 గంటలకు అందించినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇంత సంక్షోభంలోనూ సకాలంలో జీతాలు, పెన్షన్లు

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో ప్రభుత్వం తలమునకలై ఉన్నప్పటికీ ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు అందించడంలో అలసత్వం చూపలేదు. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో, రెండో తేదీ సోమవారం ఉదయం నుంచే ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఖాతాల్లో జమ అయ్యాయి. ఒకటో తేదీ ఆదివారం రావడంతో సామాజిక పెన్షన్లను చంద్రబాబు ప్రభుత్వం ఒక రోజు ముందుగానే అర్హులకు అందజేసింది. సాధారణంగా ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు కలిపి నెలకు రూ.6,000 కోట్లు ఖర్చవుతుంది. సామాజిక పెన్షన్లు నెలకి రూ.2,800 కోట్లు ఖర్చవుతాయి. ప్రతి నెలలో మొదటి వారంలో జీతాలు, పెన్షన్లు, సామాజిక పెన్షన్ల కోసం ప్రభుత్వం దాదాపు రూ.8,800 కోట్లు సిద్ధంగా ఉంచుకోవాలి. జగన్ హయాంలో ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు అందేసరికి ప్రతి నెలలో మూడో వారం వచ్చేది.

మధ్య కోస్తాకు మరో వాయు'గండం'

విశాఖపట్నం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మధ్య కోస్తా జిల్లాలకు మరో వాయు'గండం' పొంచి ఉంది. ఈ నెల 5న పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ సోమవారం ప్రకటించింది. అయితే.. అంతర్జాతీయ మోడల్స్ ప్రకారం ఈ నెల 5న ఏర్పడనున్న అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా తీరాలకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో 5న ఏర్పడే అల్పపీడనం ఆరో తేదీకల్లా వాయుగుండంగా మారుతుందని అంటున్నారు. తర్వాత ఇది వాయవ్యంగా పయనిస్తుందని, దీని ప్రభావంతో ఈ నెల 6, 7 తేదీల్లో మధ్య కోస్తాలోని పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని విశ్లేషిస్తున్నారు. 7న ఉమ్మడి తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించారు.

ఆ రెండు రోజులూ కుమ్మేసిన వాన

4 నుంచి 6 మి.మీ. వర్షపాతం కురవాల్సినచోట ఏకంగా 100 మి.మీ. కురిస్తే రోడ్లు, కాల్వలు, పొలాలు మొత్తం జలమయమవుతాయి. రెండు రోజుల క్రితం గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో అదే జరిగిందని వాతావరణ నిపుణుడొకరు విశ్లేషించారు. గత నెల 30,31 తేదీల్లో గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, పల్నాడు జిల్లాల్లో వాన కుమ్మేసిందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి పలు విషయాలను ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. వాయుగుండం ప్రభావంతో గత నెల 30న తెల్లవారుజాము నుంచి 31వ తేదీ అర్ధరాత్రి వరకూ.. కుండపోతగా కురిసిన వర్షాలకు ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలు బాగా దెబ్బతిన్నాయి. 30,31 తేదీల్లో గుంటూరు జిల్లాలో సగటున 314.7 మి.మీ, కృష్ణా జిల్లాలో 214.9, ఎన్టీఆర్ జిల్లాలో 265.7 మి.మీ., పల్నాడులో 200.9, బాపట్లలో 168.2, ఏలూరు జిల్లాలో 151.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెల మొత్తమ్మీద అమరావతిలో 292.7 మి.మీ. వర్షపాతం కురిస్తే.. ఆ రెండు రోజుల్లోనే 131 మి.మీటర్లు నమోదైంది.

తెలుగు ప్రజలను కేంద్రం ఆదుకోవాలి: రాహుల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఎడతెరిపిలేని వర్షాలు, వరదలతో నష్టపోయి ఇబ్బందులలో ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల గురించి తాను ఆలోచిస్తున్నట్లు సోమవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సహాయక చర్యలలో పాల్గొనాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను కోరారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి: కౌలు రైతు సంఘం

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా పెద్ద ఎత్తున నష్టం జరిగింది. దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలి' అని ఏపీ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి జమలయ్య డిమాండ్ చేశారు.

వరద ప్రాంతాల్లో పశువైద్య శిబిరాలు: అచ్చెన్న

వరద ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పశువులకు వైద్య సేవలందించాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. విజయవాడలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించి, సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రి సోమవారం వ్యవసాయ, అధికారులతో సమీక్షించారు. వరద నీరు తగ్గేవరకు రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు.

జగన్ ప్రాణాలు తీశాడు.. బాబు రక్షకుడిగా నిలిచాడు: మర్రెడ్డి

'జగన్‌రెడ్డికి అసలు సిగ్గుందా? కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాల్సింది పోయి... తోక పత్రిక, బ్లూ మీడియాతో తప్పుడు ప్రచారం చేయిస్తారా?' అంటూ తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడమే వైసీపీ అబద్ధపు పత్రిక, బ్లూ మీడియా పనిగా పెట్టుకున్నాయి. బుడమేరును ఐదేళ్లలో బాగు చేయని కారణంగానే బెజవాడ ముంపు బారినపడింది. జగన్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేకుండా వ్యవహరిస్తున్నాడు' అని మర్రెడ్డి మండిపడ్డారు.

సీఎం పర్యటిస్తుంటే జగన్ విమర్శలా: పల్లా

విశాఖపట్నం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రెండు రోజుల నుంచి వరద పరిస్థితిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, బాధితులకు భరోసా కల్పిస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. దీనిపై మాజీ సీఎం జగన్ విమర్శలు చేయడం విచారకరమన్నారు.

రైతు పథకాల పేర్లు మార్పు

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అమలు చేసిన పథకాల పేర్లను మారుస్తూ కూటమి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈక్రాప్‌యాప్‌ను ఈ-పంటగా, వైఎస్సార్ రైతుభరోసా-పీఎంకిసాన్‌ను అన్నదాత సుఖీభవగా, వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలను వడ్డీలేని రుణాలుగా, వైఎస్సార్ ఫ్రీక్రాప్ ఇన్సూరెన్స్‌ను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనగా, వైఎస్సార్ యంత్రసేవా పథకాన్ని ఫామ్ మెకనైజేషన్ స్కీంగా, వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ లేబోరేటరీస్‌ను ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లుగా, వైఎస్సార్ యంత్రసేవా కేంద్రాలను విలేజ్, క్లస్టర్ సీహెచ్‌సీలుగా, వైఎస్సార్ యాప్‌ను వీఏఏ పెర్ఫామెన్స్ మానటరింగ్ యాప్‌గా, రైతుభరోసా కేంద్రాన్ని రైతుసేవా కేంద్రంగా, ఆర్బీకే చానల్, స్టూడియోను పాడి పంటలు చానల్, స్టూడియోగా, డాక్టర్ వైఎస్సార్ భరోసా మంత్లీ మ్యాగజైన్‌ను పాడి పంటలు మ్యాగజైన్‌గా మార్చారు.

సివిల్ సప్లయిస్ కమిషనర్‌గా వీరపాండియన్

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్ అఫీషియో సెక్రటరీగా జి.వీరపాండియన్ నియమితులయ్యారు. ప్రస్తుత కమిషనర్ సిద్ధార్థజైన్ కేంద్ర సర్వీసుకు వెళ్తున్నారు.

ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ పుట్టిన రోజు వేడుకలు

ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమాన సంఘాలు పెద్ద ఎత్తున సేవా కార్యాక్రమాల్లో పాల్గొన్నారు. జనసేన కార్యకర్తలతో పాటు కూటమిలోని పార్టీలైన టీడీపీ, బీజేపీ నాయకులు కూడా పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం పిలుపునిచ్చిన విధంగా భారీ వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలకు ఆహారం, తాగునీరు, మందులు అందించారు. మంత్రి నాదెండ్ల మనోహర్, వరద ప్రాంతాల్లో పర్యటించి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు ఘటనపై సీఎస్, డీజీపీలకు నోటీసులు

న్యూఢిల్లీ: గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలపై మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి నోటీసులు జారీ చేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జల విలయం

తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదలు సృష్టిస్తున్న బీభత్సం ఊహకు అందనంతగా ఉంది. జనజీవనాన్ని ఆ కుండపోత అతలాకుతలం చేసింది. తెలుగు రాష్ట్రాలు తడిసిముద్దయినాయి, కొన్ని ప్రాంతాలు తీవ్ర విధ్వంసాన్ని చవిచూశాయి. వర్షబీభత్సానికి పంటపొలాలు, నివాస స్థలాలు చెరువులైనాయి. వరద ప్రభావం తీవ్రంగా ఉండగానే, రెండు రాష్ట్రాలూ మరో 24 గంటలపాటు కాస్తంత హెచ్చుతగ్గులతో వర్షాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. విపరీతమైన ఆస్తినష్టంతో పాటు, ఈ ప్రకృతి విలయంలో తెలుగు రాష్ట్రాలు రెండూ ప్రాణనష్టాన్ని కూడా చవిచూడాల్సిరావడం విషాదం.

దాదాపు పదిలక్షల క్యూసెక్కుల వరద తీవ్రతను చవిచూసిన ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాలు తడిసిముద్దయినాయి. రాయలసీమలో వర్ష, వరద బీభత్సం కాస్తంత తక్కువగా ఉన్నా మిగతా ప్రాంతాలన్నీ వొణికిపోయాయి. బుడమేరు వరద విజయవాడ నగరాన్ని అతలాకుతలం చేసింది. ఇటీవలి దశాబ్దాల్లో ఈ ప్రాంతం ఇంతటి భారీ వర్షాన్ని, వరద తీవ్రతను ఎదుర్కోలేదని అంటున్నారు. ఒక్కరోజులో ముప్పైఏడు సెంటీమీటర్ల వర్షం కురిసి తీవ్ర విధ్వంసానికి, ప్రాణనష్టానికి కారణమైంది. బుడమేరుకు వరద ఎక్కువగా రావడంతో పాటు, కొల్లేరుకు నీరుపోయే మార్గం నిర్వహణ గత ఐదేళ్ళుగా సక్రమంగా లేకపోవడంతో విజయవాడకు నీరువచ్చి ఇంతటి తీవ్రస్థితిని చవిచూడాల్సివచ్చిందని కొందరి వాదన. నగరంలోని లోతట్టు ప్రాంతాలన్నీ మునిగి, మోకాలిలోతు నీటిలో నానుతున్న నేపథ్యంలో, ఆహార సరఫరాలు, సహాయక చర్యలు నిరవధికంగా సాగుతున్నాయి. కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో వరదప్రవాహంలో చిక్కుకున్నవారిని సహాయక బృందాలు రక్షించాయి.

తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో కొద్దిగంటల్లోనే యాభైసెంటీమీటర్ల వరకూ రికార్డుస్థాయి వర్షాలు కురిసి వరదలు పోటెత్తాయి. కాల్వలు తెగిపోయాయి, చెరువుల కట్టలు కొట్టుకుపోయాయి. కాలనీలు, బస్తీలు నీటమునిగాయి. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వాగులు, వంకలూ పొంగి గ్రామాలు, కాలనీలు జలమయమైనాయి. మున్నేరు వాగు వరదలతో ఖమ్మాన్ని ముంచింది. జిల్లాలో వందలాది గ్రామాలు నీటమునిగితే, నగరంలో కొన్ని భవనాల రెండో అంతస్తువరకూ నీరు చేరడం వరద ఉధృతికి నిదర్శనం.

తెలుగు రాష్ట్రాల్లో చెరువులు, కాల్వలు, వాగులు పొంగిపొర్లుతూ జాతీయ రహదారులను జలదిగ్బంధంలోకి నెట్టివేశాయి. మొదట్లో ట్రాఫిక్ మళ్ళింపులతో గమ్యానికి చేరుతున్నామన్న భ్రమలు కలిగినా, కొద్దిగంటల్లోనే దారులన్నీ మూసుకుపోయాయి. వరదనీరు నిలువునా కోసేసిన రహదారులను తాత్కాలిక మరమ్మత్తులతో తిరిగి దారికి తేవడం ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. తెలుగు రాష్ట్రాల మధ్యనే కాక, పొరుగు రాష్ట్రాలకు పోయే బస్సులు కూడా కదలని పరిస్థితి ఏర్పడింది. వందలాది రైళ్ళు రద్దుకావడం, ట్రాకుల కిందనుంచి భూమి కోసుకుపోయి అవి గాలిలో వేలాడుతుండటం జరిగిన బీభత్సానికి నిదర్శనం.

తెలుగు రాష్ట్రాల్లో సంభవించిన అపారనష్టాన్ని కేంద్రప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా ముఖ్యమంత్రులతో మాట్లాడి తగిన సహకారానికి హామీ ఇచ్చారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపడం అటుంచితే, జరిగిన ఆస్తినష్టాన్ని కొంతమేరకైనా పూడ్చేందుకు కేంద్రం తనవంతు ప్రయత్నం చేయాలి. వాణిజ్యపంటలతో సహా లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. పేదలు తమ పశువులను కోల్పోయారు. జరిగిన నష్టం ఏపాటిదో, మరమ్మతులు పూర్తిచేసుకొని వ్యవస్థలన్నీ గాడిన పడేది ఎప్పటికో ఇప్పుడే కచ్చితంగా చెప్పలేనిస్థితి. ఢిల్లీ పెద్దల పర్యటనలు, కేంద్రబృందాల రాకపోకలు, అధ్యయనాలు, ఓదార్పుల అనంతరమైనా కేంద్రసాయం దండిగా దక్కాలని తెలుగు రాష్ట్రాలు కోరుకుంటున్నాయి.

హైదరాబాద్‌లో వికసిస్తున్న ఎఐ విప్లవం

మానవ కార్యకలాపాలను వినూత్నంగా మార్చివేస్తున్న అధునాతన సాంకేతికత కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఎఐ). ప్రపంచ దేశాలు ఎఐ సామర్థ్య విస్తృతిని అన్వేషించడంలో పోటీపడుతున్నాయి. ఆ శక్తిని ఉపయోగించుకుంటూ అందులో మరింత నైపుణ్యాన్ని సముపార్జిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'గ్లోబల్ ఎఐ సమ్మిట్–2024' ఆ సమూల పరివర్తన సాధక సాంకేతికతలో అతినూతన పోకడలపై వెలుగులు ప్రసరించనున్నది. ఆరోగ్య భద్రత, జీవశాస్త్రాలు, విద్య, వ్యవసాయం, న్యాయవ్యవస్థ, తయారీ రంగం, పౌర సేవలు ఇత్యాది రంగాలలో ఎఐ ఆధారిత నవీకరణల ప్రగాఢ, విస్తార ప్రభావ ప్రాబల్యాలను అధ్యయనం చేసి, సంబంధిత మార్పులపై మన అవగాహనను మరింతగా మెరుగుపరచుకునేందుకు ఆ సమ్మిట్ దోహదం చేయనున్నది.



మానవ కార్యకలాపాలను వినూత్నంగా మార్చివేస్తున్న అధునాతన సాంకేతికత కృత్రిమ మేధ (ఎఐ). భారతదేశ సైబర్ సిటీగా ప్రసిద్ధికెక్కిన హైదరాబాద్‌లో సాటిలేని రీతిలో పెరుగుతూ, ప్రభావదాయకంగా ఉన్న నవీన సాంకేతికతల వ్యవస్థలు ఎఐ విప్లవ పురోగమనానికి సానుకూల పరిస్థితులను సమృద్ధంగా సృష్టిస్తున్నాయి. ఈ ఉత్తేజకర విప్లవ ప్రస్థానంలో ప్రతి ఒక్కరూ భాగస్వామి అయ్యేందుకు సరైన పరిస్థితులను, సబబైన భావాలను, సవ్యమైన సంధానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న 'గ్లోబల్ ఎఐ సమ్మిట్ – 2024' సమకూర్చనున్నది.

ట్రాఫిక్ జామ్‌లను తగ్గించడం నుంచి అధిక దిగుబడులు సాధించడంలో రైతులకు తోడ్పడడం వరకు ప్రభుత్వాలు తమ పౌరులకు అందిస్తున్న సేవల తీరుతెన్నులను ఎఐ సాంకేతికత కొత్త పుంతలు తొక్కిస్తోన్నది. గ్లోబల్ టెక్నాలజీ కేంద్రంగా శీఘ్రగతిన వినుతికెక్కుతున్న హైదరాబాద్ ఎఐ ఆధారిత భవిష్యత్తు కల్పించే అవకాశాలను సమగ్రంగా ఉపయోగించుకునేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నది. ప్రెడిక్టివ్ ఎనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్, ఆటోమేషన్ తదితర వ్యవస్థాపిత ఎఐ సాంకేతికతలు ప్రభవిస్తోన్న జెనరేటివ్ ఎఐతో కలిసి ఒక కొత్త పారిశ్రామిక విప్లవానికి దారితీస్తున్నాయి. నిన్న ఒక స్వప్నంగా, భవిష్యద్దర్శనంగా మాత్రమే ఉన్న (సకల పారిశ్రామిక కార్యకలాపాలలోనూ) ఎఐను ఉపయోగించుకోవడమనేది నేడు ఒక యథార్థంగా ఉన్నది. తెలంగాణలో సంప్రదాయక వ్యవసాయక సవాళ్లు అధిగమించేందుకు ఎఐని ఫలప్రదంగా ఉపయోగిస్తున్నారు. పంట సమాచారం, సాగు భూముల పరిస్థితులను విశ్లేషించడం ద్వారా ఎఐ, రైతుల వైయక్తిక అవసరాలకు అనుగుణమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తూ దిగుబడులను అధికం చేస్తోంది. ఎఐని ఉపయోగించుకున్న రైతులు ఎకరాకు సగటున 21 శాతం అధిక దిగుబడిని సాధించారు. పంటల సాగులో వారు ఉపయోగించే క్రిమిసంహారక మందుల వినియోగం 9 శాతం, ఎరువుల వాడకం 5 శాతం తగ్గిపోగా దిగుబడుల విక్రయ ధరలు 8 శాతం మేరకు పెరిగాయి. హైదరాబాద్‌లోను, ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాలలోను రోడ్లపై వాహనాల రాకపోకలను మరింత సమర్థంగా క్రమబద్ధం చేసేందుకు ఎఐ తోడ్పడుతున్నది. ఎఐ శక్తిదాయక వ్యవస్థలు వాహనాల రాకపోకల తీరుతెన్నులను వాస్తవ సమయం (రియల్ టైమ్)లో విశ్లేషిస్తూ, ట్రాఫిక్ లైట్లను నియంత్రించడం ద్వారా ట్రాఫిక్ రద్దీని కూడళ్లలో 30 శాతం మేరకు, కాలుష్యకారక ఉద్గారాలను 10 శాతం మేరకు తగ్గించగలుగుతున్నాయి.

అంటువ్యాధుల విజృంభణను ముందస్తుగా మదింపు వేయడం, నిధులు అధికంగా, అత్యవసరమైన వ్యాధి నిరోధక కార్యకలాపాలకు కేటాయింపులు చేయడంలో సహాయపడడం ద్వారా ఆరోగ్య భద్రతలో ఎఐ కీలకపాత్ర వహిస్తోంది. కొవిడ్ మహమ్మారి కాలంలో ఆ అనారోగ్య హానికి గురయ్యేందుకు ఎక్కువ అవకాశమున్న ప్రజా సమూహాలను గుర్తించేందుకు ప్రెడిక్టివ్ ఎనలిటిక్స్‌ను ఉపయోగించి మంచి ఫలితాలను సాధించారు. ఎఐ ఆధారిత ఆరోగ్య భద్రతా పద్ధతులు మారుమూల గ్రామాల ప్రజలకు సైతం అత్యవసర వైద్య సలహాలు సత్వరమే, సుగమంగా సమకూరేందుకు విశేషంగా తోడ్పడుతున్నాయి.

ప్రభుత్వాల పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు ఎఐ ఆధారిత సాధనాలు, దోహదం చేస్తున్నాయి. భారీ పరిమాణంలో ఉన్న సమాచారాన్ని విద్యుత్ వేగంతో మథించి, ప్రభుత్వ వ్యయాలలో అవకతవకలను కనుగొని వనరులను మరింత వివేకవంతంగా వినియోగించేందుకు ఎఐ తోడ్పడుతున్నది విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఎఐని ఉపయోగించి వారి అభ్యసన అనుభవాలను సమున్నతం చేసేందుకు ఎఐని ఉపయోగిస్తున్నారు. ఎఐ ఆధారిత విద్యా వేదికలు వైయక్తిక అభ్యసన శైలిని మదింపు చేసి, అందుకు అనుగుణంగా పాఠ్యాంశాలను మార్చి ప్రతి విద్యార్థికి వైయక్తికమైన విద్యాబోధన చేయడంలో ఎఐ విశేష పాత్ర వహిస్తోంది. అలాగే విద్యాసంస్థల దైనందిన పాలనా ప్రక్రియలను ఆటోమేట్ చేయడం ద్వారా ఉపాధ్యాయులు తమ దృష్టిని పూర్తిగా బోధన విధులపై కేంద్రీకరించేందుకు ఎఐ తోడ్పడుతున్నది.

పారిశ్రామిక రంగంలో వివిధ సంస్థలు తమ యూనిక్ డేటా నుంచి గరిష్ఠ ప్రయోజనం పొందేందుకు, సమస్త వేల్యూ చైన్స్ (ముడిపదార్థాల సేకరణ, ఉత్పత్తి వినియోగం, త్యజించడం, రీసైక్లింగ్ ప్రక్రియతో సహా ఒక ఉత్పత్తి సంపూర్ణ జీవితచక్రాన్ని ఉద్దేశించిన భావన)ను తిరిగి ఊహించేందుకు, తమ సిబ్బంది, యంత్రాల పనితీరును విస్తారంగా మెరుగుపరచుకునేందుకు, కొత్త కల్పనలను ప్రోత్సహించేందుకు ఎఐ విశేషంగా తోడ్పడుతున్నది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బీమా రంగంలో అపార సమాచారాన్ని తరచిచూసి దూరదృష్టితో కూడిన నిర్ణయాలు తీసుకునేందుకు ఎఐ సహాయపడుతున్నది. తద్వారా ముందస్తు అంచనా సామర్థ్యాన్ని మెరుగుపరిచి వాస్తవ సమయంలో మోసాలు, అక్రమాలను గుర్తించి నిరోధించడం సాధ్యమవుతోంది.

మన సమస్త జీవిత పార్శ్వాలను విప్లవీకరించే శక్తి ఎఐకి ఉన్నది. ఈ అధునాతన సాంకేతికతను ఉపయోగించుకోవడం అంతకంతకూ పెరుగుతున్నందున తత్ఫలితంగా ఉత్పన్నమవుతున్న పలు క్లిష్ట విషయాలనూ నిశితంగా పరిశీలించి వాటిని పరిష్కరించుకోవడంపై దృష్టిపెట్టాల్సిన అవసరమున్నది. వ్యక్తిగత గోప్యత, పారదర్శకత, వివరణీయత, నిష్పాక్షికత, జవాబుదారీతనం, అనువర్తన, భద్రత, రక్షణ మొదలైన వ్యవహారాలలో ఎఐ మూలంగా పలు సమస్యలు నెలకొంటున్నాయి. ఎఐ మూలంగా తలెత్తే సమస్యలు, ఇక్కట్లను జరూరుగా గుర్తించి, సకాలంలో సంపూర్ణంగా పరిష్కరించుకోవాలి. ఎఐ వ్యవస్థలు సేకరిస్తున్న సమాచారం గోప్యత భంగానికి, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగానికి దారితీసే ప్రమాదమున్నది. ఎఐ వ్యూహాలు, ప్రణాళికలతో ముందుకుసాగుతున్న సంస్థలు అనేకం అపాయాలు, అవకాశాల మధ్య సమతుల్యతను ఎలా సాధించాలనే విషయమై శ్రద్ధ చూపుతున్నయని మా (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) సొంత అనుభవాలతో పాటు టిసిఎస్ ఎఐ ఫర్ బిజినెస్ స్టడీ కనుగొన్న విషయాలూ స్పష్టం చేస్తున్నాయి.

భారతదేశ సైబర్ సిటీగా ప్రసిద్ధికెక్కిన హైదరాబాద్ ఎఐ విప్లవాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు అన్ని విధాల సర్వసన్నద్ధంగా ఉన్నది. నగరంలో సాటిలేని రీతిలో పెరుగుతూ, ప్రభావదాయకంగా ఉన్న నవీన సాంకేతికతల వ్యవస్థలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో ఎఐ విప్లవ పురోగమనానికి సానుకూల పరిస్థితులను సమృద్ధంగా సృష్టిస్తున్నాయి. హైదరాబాద్ ఒక ఉన్నతస్థాయి విద్యాకేంద్రం. నగరంలోని ఇంజినీరింగ్ కళాశాలలు ఏటా వేలాది ఇంజినీరింగ్ పట్టభద్రులను రూపొందిస్తున్నాయి. ఎఐ విప్లవాన్ని నగరంలోనే కాకుండా విశాల భారతదేశమంతటా ఎఐ విప్లవాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడంలో ఆ ప్రతిభావంతుల పాత్ర కీలకమైనది.

ఎఐ మూలంగా లక్షలాది ఉద్యోగాలు మటుమాయమవుతున్న మాట నిజం. అయితే 2025 సంవత్సరం నాటికి ఎఐ, తన మూలంగా మాయమవుతున్న ఉద్యోగాల కంటే 12 మిలియన్ ఉద్యోగాలను అధికంగా సృష్టించనున్నదని అంచనా. ఒక్క భారతదేశంలోనే రాబోయే కొద్ది సంవత్సరాలలో దాదాపు 4 లక్షల కొత్త ఉద్యోగాలు ఎఐ మూలంగా సృష్టి కానున్నాయి. ఒక్క హైదరాబాద్ నగరంలోనే వేలాది ఇంజినీరింగ్ నిపుణులు ఎఐలోను, ఎఐ సంబంధిత సాంకేతికతలలోను శిక్షణ పొందుతున్నారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్, తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఇందుకు విశేషంగా దోహదం చేస్తున్నాయి. వీటికి తోడు కొత్తగా తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ రాబోతున్నది. శీఘ్రగతిన ఆవిర్భవిస్తున్న జాబ్ మార్కెట్ డిమాండ్లను తీర్చేందుకు అవసరమైన నిపుణులను ఆ శిక్షణా కార్యక్రమాలు తీర్చిదిద్దుతున్నాయి. హైదరాబాద్‌లోని టిసిఎస్ సెంటర్ ఎఐ సంబంధిత సాంకేతికతలలో 67 వేల మందికి శిక్షణ ఇచ్చింది. హైదరాబాద్‌లో స్టార్టప్‌లకు నూతన సాంకేతికతల సృష్టికి అద్వితీయమైన అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఈ మహానగరంలో 6000కి పైగా స్టార్టప్‌లు ఉన్నాయి. వీటిలో అత్యధిక సంస్థలు ఎఐ, మెషీన్ లెర్నింగ్ ఇన్నోవేషన్‌లో అగ్రగాములుగా ఉన్నాయి. ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకువెళ్లే వ్యోమనౌకలను నిర్మించడమే కాకుండా సంబంధిత ఇతర సాంకేతికతలనూ సృష్టించే స్టార్టప్ ఒకటి హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తోంది. భద్రత, నిఘా ఏర్పాట్లకు అవసరమైన ఎఐ శక్తిదాయక రోబోలను మరొక స్టార్టప్ తయారు చేస్తోంది. దేశవ్యాప్తంగా ప్రతి స్మార్ట్ సిటీలోను ఇవి త్వరలోనే అంతర్భాగం కానున్నాయి. హైదరాబాద్ ఎఐ రంగంలో మదుపులూ పెరుగుతున్నాయి. ఈ నగరంలోని స్టార్టప్‌లు ఏటా 0.54 బిలియన్ డాలర్ల నిధులను సమకూర్చుకోగలుగుతున్నాయి.

గ్లోబల్ టెక్ కంపెనీలు, సెమికండక్టర్ కంపెనీలు, హైపర్ స్కేలర్స్, వివిధ రంగాలలోని బహుళ జాతి కంపెనీలు హైదరాబాద్‌లో విశేషంగా ఉన్నాయి. వీటి భాగస్వామ్యంతో ఎఐ విప్లవాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. అధునాతన సాంకేతికతలకు నెలవుగా ఉండడమే కాకుండా వాటి వికాసానికి అవసరమైన సమస్త అనుకూలతలకు సంగమ స్థలంగా ఉన్న హైదరాబాద్ ఎఐ ఆధారిత భవిష్యత్ నిర్మాణానికి సరైన నెలవు. ప్రతి ఒక్క పౌరుని శ్రేయస్సు, రక్షణకు ఉపయోగపడే ఫలప్రదమైన ఎఐ ఆధారిత భవిష్యత్ నిర్మాణానికి హైదరాబాద్ అభయమిస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'గ్లోబల్ ఎఐ సమ్మిట్–2024' ఆ సమున్నత, వినూత్న భవిష్యత్తును దర్శించే అవకాశాన్ని సమకూర్చుతోంది. ఈ ఉత్తేజకర ప్రస్థానంలో ప్రతి ఒక్కరూ భాగస్వామి అయ్యేందుకు సరైన పరిస్థితులను, సబబైన భావాలను, సవ్యమైన సంధానాన్ని ఆ ప్రపంచ సదస్సు స్థిరపరచనున్నది.



◆ వి.రాజన్న
టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్

(సెప్టెంబరు 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో 'గ్లోబల్ ఏఐ సమ్మిట్')

రిజర్వేషన్ల సుడిలో భారత ప్రజాస్వామ్యం

ప్రజాస్వామిక రాజకీయాలలో దిగువ సామాజిక వర్గాల అభ్యున్నతికి ఒక ప్రధాన ఆలంబన రిజర్వేషన్లు. రిజర్వేషన్ల ద్వారా మాత్రమే అధికారాన్ని సాధించుకోవాలని రిజర్వేషన్ సదుపాయం ఉన్న కులాలు అభిలషిస్తున్నాయి. భారత రాజ్యాంగం ఆశించిన విధంగా ప్రత్యామ్నాయ న్యాయరాజకీయాలను అభివృద్ధిపరిచేందుకుగాను ఆ కులాలవారు తమకు తాము విశాల సమాజ అంతర్భాగాలుగా సంఘటితం కావడం లేదు. తత్కారణంగా ఆ సామాజిక సమూహాలు సరైన రాజకీయదృక్పథాన్ని పెంపొందించుకోలేకపోతున్నాయి. రాజకీయదృష్టి లేకుండా పోవడంతో కీలుబొమ్మ రాజకీయవేత్తలుగా మిగిలిపోతున్నాయి. రిజర్వేషన్ల భావన జ్యోతిబా పూలే స్ఫూర్తితో ప్రభవించిందని అంటారు. అయితే ఆయన ఎప్పుడూ రిజర్వేషన్లను కోరలేదు.

భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించిన సందర్భంలో మహాత్మా పూలే కోరిందేమిటి? తన గురువు మహదేవ్ గోవింద్ రణడేను ఆయన వ్యతిరేకించారు, కాంగ్రెస్ ఆవిర్భావ కారణాలు, దాని లక్ష్యాలను విమర్శించారు. వలసపాలన ప్రవేశపెడుతున్న ఆధునికత బ్రాహ్మణీకరణ అవడాన్ని తొట్టతొలుతనే గుర్తించిన మేధావి పూలే. దిగువ నుంచి ప్రజల (శూద్ర, అతి–శూద్ర, గులాం) అనుకూల, ప్రభావిత ఆధునికతను ఆయన ఆశించారు. వలసపాలకులు అమలుపరుస్తున్న ఆధునికీకరణకు ఆ సామాజిక వర్గాలు లబ్ధిదారులు కావాలనేది పూలే ఆకాంక్ష. బ్రిటిష్ పాలకులు కల్పిస్తున్న ఆధునిక విద్యావకాశాలను వినియోగించుకుని ఆ సామాజికులు పాలనావ్యవస్థలో ఉద్యోగులు కావాలని పూలే అభిలషించారు. కాంగ్రెస్ భారత్ భావనకు ఒక సమాంతర భారతీయ సమాజాన్ని రూపొందించాలనేది పూలే ధ్యేయంగా ఉండేది. ఆ అణగారిన సామాజిక వర్గాల భారతదేశాన్ని ఆయన నిరంతరం బ్రిటిష్ అధికార వర్గం దృష్టికి తీసుకువెళ్లేవారు. నిజానికి ఆంగ్లేయులు ఆయన నుంచే నిజమైన భారతదేశం గురించి తెలుసుకున్నారు.

కాంగ్రెస్ అచిర కాలంలోనే ఒక అఖిల భారత సంస్థగా రూపొందింది. బ్రిటిష్ పాలన ఆర్థిక పర్యవసానాల విశ్లేషణ ప్రాతిపదికన తన రాజకీయ వ్యూహాన్ని రూపొందించుకుంది. తొలినాటి కాంగ్రెస్ ఆర్థిక జాతీయవాదాన్ని ఎలుగెత్తి చాటింది. ఇది అంతిమంగా భారత జాతీయవాదంగా పరిణమించింది. భారత్‌ను ఒక జాతిగా అభివృద్ధిపరచడమే జాతీయ రాజకీయాల లక్ష్యమని ఆ భావజాలం ప్రకటించింది. అణగారిన వర్గాల వారిని తన జాతీయవాద స్రవంతిలో భాగం చేసుకుంది. ఉదాహరణకు కింది కులాల వారి మతపరమైన హక్కుల– దేవాలయ ప్రవేశం మొదలైనవి– విషయాలలో నారాయణ గురు ఉద్యమ లక్ష్యాలను కాంగ్రెస్ తన కార్యక్రమంలో భాగంగా చేసుకున్నది. సమస్త భారతీయులను ఒకే జాతి ప్రజలుగా కాంగ్రెస్ సంఘటిత పరుస్తున్నప్పుడు కాంగ్రెస్ ఉద్యమాన్ని పెరియార్ రామస్వామి సవాల్ చేశారు. రాజకీయాలలో బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని కాంగ్రెస్ లక్ష్యాలు, కార్యక్రమాలు కాపాడతాయని విమర్శించారు. మూలవాసులయిన ద్రావిడులు ఎల్లప్పటికీ అప్రధానంగా ఉండిపోతారని ఆయన భావించారు. ఈ కారణంగా బ్రాహ్మణుల ఆధిపత్యం నుంచి బయటపడేందుకు దిగువ కులాలకు ప్రాధాన్యముండే ద్రావిడోద్యమాన్ని ఆయన నిర్మించారు.



స్వాతంత్ర్య సాధకులు, రిపబ్లిక్ నిర్మాతలు ఆశించిన మార్పును మన ప్రజాస్వామ్యం తీసుకురాలేదు. ప్రజల ప్రజాస్వామ్యాన్ని నిర్మించేందుకు దోహదం చేసే ప్రత్యామ్నాయ రాజకీయాలను రిజర్వేషన్ వాదులు అభివృద్ధిపరచలేదు.


ఈ భిన్న భావజాలాల ఘర్షణ నేపథ్యంలో భారతీయులు అంతా ఒకే జాతి అన్న జాగృతిని అడ్డుకునేందుకు బ్రిటిష్ పాలకులు తొలుత నిర్దిష్ట మత వర్గాలకు రిజర్వేషన్లను ప్రవేశపెట్టారు. భారత్‌లో తమ ఆధిత్యాన్ని సుస్థిరపరచుకోవడానికి తమకు పూర్వం దేశ పాలకులుగా ఉన్న ముస్లింలకు 1909 చట్టం ద్వారా చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించారు. 1857 తిరుగుబాటు అనంతరం తాము అధికారాన్ని కోల్పోయామనే భావన ముస్లింలలో తీవ్రంగా ఉండేది. తదనంతరం సిక్కులు, ఆంగ్లో ఇండియన్లు, ఆ తరువాత భూస్వాములు, సంస్థానాధీశుల కుటుంబాల వారికి కూడా రిజర్వేషన్లు కల్పించారు.

పూలే ఆలోచనా క్రమాన్ని మరింత ముందుకు తీసుకుపోయే రీతిలో భారత చరిత్రను నిర్మించేందుకు అంబేడ్కర్ తొలుత కృషి చేశారు. అదే సమయంలో ఆయన జాతీయవాదులతో ఎడతెగని రాజకీయ, సైద్ధాంతిక పోరాటాలు కూడా చేశారు. భారతీయ సమాజం ప్రధానంగా కులాల సమాజమని, అట్టడుగు కులాలవారు తమ ప్రాథమిక అవసరాలను కూడా తీర్చుకోలేని విధంగా అణచివేయబడ్డారనేది అంబేడ్కర్ వాదన. 1920వ దశకంలో కాంగ్రెస్ పూర్తిగా గాంధీ ఆధిపత్యంలోకి వెళ్లిన తరువాత అణగారిన వర్గాల అభ్యున్నతికై ఆయన రిజర్వేషన్ల మార్గాన్ని అనుసరించారు. ఆ విధంగా కుల రిజర్వేషన్ల భావనకు ఆయనే ఆద్యుడు. సమాజంలోని దిగువ స్థాయి సామాజిక వర్గాల అభివృద్ధి రిజర్వేషన్ల లక్ష్యంగా ఉండాలని ఆయన ఆశించారు. అణగారిన వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించాలన్న అంబేడ్కర్ డిమండ్ జాతీయవాద రాజకీయాలకు సవాల్‌గా పరిణమించింది. అంబేడ్కర్ అప్పటివరకు కులాల ప్రత్యామ్నాయ చరిత్రను, పర్యవసాన ఘర్షణలను భారతదేశ చరిత్రగా నిర్మించేందుకు కృషి చేశారు. రిజర్వేషన్ల అంశాన్ని ఆయన కాంగ్రెస్ వ్యతిరేక రాజకీయాలుగా మార్చారు. కులపరమైన రిజర్వేషన్లే ప్రాదేశిక రిజర్వేషన్లకు ప్రధాన కారణం. రాజ్యాంగ సభలో ఆయన సభ్యుడు కావడంతో రిజర్వేషన్ల అంశానికి ఎనలేని ప్రాధాన్యం లభించింది. రాజ్యాంగ నిర్మాతలు అందరూ ఆ అంశానికి ప్రాధాన్యమిచ్చారు. దీంతో రిజర్వేషన్ల సాధన అణగారిన సామాజిక వర్గాల ప్రధాన లక్ష్యమయింది.

ప్రభుత్వంలో అప్రధాన పౌరులుగా భాగమయ్యేందుకు దిగువ కులాలవారికి రిజర్వేషన్లు ప్రేరణ అయ్యాయి. అవి కీలుబొమ్మ రాజకీయవేత్తలను మాత్రమే సృష్టించాయి. స్వాతంత్ర్యానంతరం అణగారిన కుల సమూహాలు రాజకీయ దృష్టిని కోల్పోయాయి. తమ సమస్యలు అన్నిటికీ రిజర్వేషన్లే సమగ్ర పరిష్కారమనే భావన వారిలో నెలకొన్నది. రిజర్వేషన్ల ఉద్యమం దిగువ స్థాయి కులాలవారిని విధేయ సమూహాలుగా మార్చివేశాయి. ఈ పరిణామాన్ని అంబేడ్కర్ 1955లోనే గుర్తించారు. పూలే, పెరియార్ ఆశించిన ప్రత్యామ్నాయ జాతీయవాదాన్ని పెంపొందించడానికి కీలుబొమ్మ రాజకీయవేత్తలు కృషిచేయలేదు. రిజర్వుడు కులాల నాయకులు ప్రాబల్య కులాల అధికార రాజకీయాలలో భాగమయ్యారు. నిజమైన ప్రజల ప్రజాస్వామ్యం ఆవిర్భావాన్ని వ్యవస్థాపిత ప్రజాస్వామ్యం అడ్డుకున్నది. పర్యవసానంగా ప్రాబల్య కులాలే అధికారాన్ని స్వాయత్తం చేసుకున్నాయి. గత 70 ఏళ్లుగా సమాజంలో ఆర్థిక అసమానతలు బాగా పెరిగిపోయాయి. స్వాతంత్ర్య సాధకులు, రిపబ్లిక్ నిర్మాతలు ఆశించిన మార్పును మన ప్రజాస్వామ్యం తీసుకురాలేదు. ప్రజల ప్రజాస్వామ్యాన్ని నిర్మించేందుకు దోహదం చేసే ప్రత్యామ్నాయ రాజకీయాలను రిజర్వేషన్‌వాదులు అభివృద్ధిపరచలేదు.

ఆ వైఫల్యమే మతరాజకీయాలను తీసుకువచ్చింది. ఆ సంకుచిత రాజకీయాలు హైందవీకరణ అయ్యాయి. అసమానతలను స్థిరపరిచాయి. అవి సహజ సిద్ధాలన్న భావనను ప్రజల మనస్సుల్లో పాదుకొల్పాయి. రాజ్యాంగంలో పొందుపరిచిన సామాజిక న్యాయం అన్న ఆదర్శం ప్రాతిపదికన ప్రజాస్వామ్యం మనాలని 21వ శతాబ్ది రాజకీయాలు డిమాండ్ చేస్తున్నాయి. కుల అంతరాలు, ఆర్థిక అసమానతలు మొదలైన సమస్యల పరిష్కారానికి ఆ మహోన్నత లక్ష్య ప్రేరిత రాజకీయాలు తప్పనిసరి. రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన కొత్త ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పేందుకు రాజకీయ అధికారాన్ని, పాలనను ప్రజాస్వామ్యీకరించాల్సి ఉన్నది.

• ఇనుకొండ తిరుమలి
చరిత్రకారుడు



తీరం దాటిన ప్రళయం!

అయ్యో ఎంత ఘోరం
ఈ తుపాను విధ్వంసకాండ...

తెలుగునేల గుండెల్లో
ప్రకృతి విసిరిన జలఖడ్గం

సుజలాం... సుఫలాం..
ముక్కలైన వాక్యాలు
నేడు ఖండిత హృదయమై...
భరతమాత

కనుచూపు మేరా నీటి ఎడారి
కనువిప్పు లేని మనిషి బికారి

కన్నీటి వరదలో
మునిగిన పేదరికం
నేలరాలిన చేలు
వెన్ను విరిగిన రైతన్నలు

తినే తిండి ఉండే గుడిసె
కట్టుకునే బట్ట గొడ్డు గోదా
సర్వం గంగార్పణం
రామ్ తేరి గంగా మైలీ

ఆకుపచ్చని సముద్రంలో
అల్పపీడన ద్రోణి
కన్నీటి ద్వీపంలో గ్రామాలు
నీటి మంటల్లో కాలుతూ...

ఆకలి ఎలుగెత్తి పిలుస్తూంటే
ఆకాశంనుంచి రాలే
ఆహారపొట్లాలకై
ఎదురుచూస్తూ... సామాన్య జనం

మనిషితనమే ముంపుకు గురై..
అడవులను నరికేస్తూ
చెరువుల దురాక్రమణలో
చెరుపు చేసిన అధికారం
ఈ నీతితప్పిన స్వార్థ జగాన
నెపం ఎవరిపైన వేద్దాం?

ఏ నీటి సంగ్రామంలో నైనా
బలయ్యేది బడుగుజీవులే కదా

లోకమే కాదు కాలమూ
కలుషితమైన నేపథ్యంలో.
విషతుల్యమైన పర్యావరణం
నెత్తుటి జెండా ఎగురేస్తూ...

నీరైనా కన్నీరైనా
తీరం దాటితే ప్రళయమే!!

ఇప్పుడిక్కడ
నీట మునిగిన నేలతల్లికి
చేయూత నిచ్చేందుకు
ఆపన్న హస్తాలు కావాలి

మనిషిభాష తెలిసిన వారెవరైనా
దయచేసి అనువదించండి
అందరం మానవహారమై
కలసికట్టుగా కదలిరావాలి అని

ఎలుగెత్తి చాటండి
ఎగిరే జాతీయ జెండాలుగా...

–సరికొండ నరసింహరాజు

గోదావరి–కావేరి అనుసంధానం ఎలా సాధ్యం?

గోదావరి–కావేరి అనుసంధానం అమలుకు పట్టు వీడని విక్రమార్కునిలాగా గత కొన్నేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. గోదావరి నదీలోయలోని తత్సంబంధిత భాగస్వామ్య రాష్ట్రాలు ఒక్కొక్కటి ఒక్కోరకంగా అనుసంధానం అమలుకు పలుషరతులు పెడుతూ స్థూలంగా అంగీకారం తెలుపడంలేదు. అయినా ఏ విధంగానైనా అనుసంధానం ద్వారా దక్షిణాదికి చెందిన తమిళనాడు కేరళ రాష్ట్రాల్లో పాగా వేసేందుకు బీజేపీ ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. ఈ సందర్భంగా కేంద్రం సహజ న్యాయసూత్రాలను గాలికి వదిలేసి కేవలం రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వ్యవహరిస్తోంది. ఏ నదీ లోయ నుండైనా మరొక నదీ లోయ ప్రాంతానికి నదీ జలాలను తరలించాలంటే ఆ నదీ లోయ ప్రాంత ప్రజల అవసరాలు పూర్తిగా తీరిన తరువాతనే అమలుచేయాలి. నెహ్రూ హయాంలో డాక్టర్ కెయల్ రావు గంగా–కావేరి అనుసంధానం ప్రతిపాదన తెచ్చినపుడు ఈ సూత్రంమేరకే ఆగిపోయింది. ముందుగా ఆయా నదీ లోయల్లో ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించారు. దీనికి తోడు భాగస్వామ్య రాష్ట్రాల మధ్య వాటాల అంశంలో పేచీ ఉండకూడదు. నికర జలాలు మిగులు వుండాలి. గమనార్హమైన అంశమేమంటే కేంద్ర జలవనరుల శాఖ ఆధ్వర్యంలో పనిచేసే కేంద్ర జలసంఘమే గోదావరిలో నికర జలాలు మిగిలి లేవని స్పష్టం చేసింది. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నీటి వాటాలు పరిష్కారం కాలేదు. అయినా కేంద్ర ప్రభుత్వం డొంకదారులు వెతుకుతూ ఛత్తీస్‌గఢ్ ఇంకా ఉపయోగించుకోని 141 టియంసిలు తరలిస్తామని చెప్పడంలోనే ద్రోహబుద్ధి ఇమిడి ఉంది. మున్ముందు తరలింపు 141 టియంసిలకే పరిమితం కాకపోవచ్చు. ఈ పరిస్థితుల్లో దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నీటి ఎద్దడి సంవత్సరాల్లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వుంటుంది. మబ్బులను చూసి కుండలో నీళ్ల పారబోసుకున్న చందం కాకూడదు. ఇంద్రావతి నదిపై ఉన్న చిత్రకూటం జలపాత ప్రాంతం పర్యావరణం కింద నిషేధించినందున ఛత్తీస్‌గఢ్‌కు మిగులు ఏర్పడింది. భవిష్యత్తులో ఛత్తీస్‌గఢ్‌కు నీటి అవసరాలు ఏర్పడితే ఆ రాష్ట్ర పరిస్థితి ఏమికాను? ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం ఉన్నా ఇందుకు అంగీకరించడం లేదు.

మరొక రాష్ట్రం తెలంగాణ. ఈ అనుసంధానం తెరమీదకు వచ్చినప్పటి నుండి కేసీఆర్ అడ్డం తిరిగినందున అనుసంధానం ఇప్పటికీ దస్త్రాలకే పరిమితమై ఉంది. లేకుంటే కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో అమలు జరిపేది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అనుసంధానానికి ససేమిరా అంటూ పలు షరతులు పెడుతోంది. గత నెలలో జాతీయ జల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ భోపాల్ సింగ్ గోదావరి–కావేరి అనుసంధానం గురించి తెలంగాణను ఒప్పించేందుకు ఢిల్లీ నుండి హైదరాబాదు వచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తెలంగాణ పలు షరతులు పెట్టింది. ఇచ్చంపల్లి నుండి కాకుండా సమ్మక్క (తుపాకులగూడెం) బ్యారేజీ నుండి అనుసంధానం చేపట్టాలని అయితే బ్యారేజీలో నీటిని నిల్వచేయకుండా నల్లగొండ జిల్లాలో ప్రత్యేకంగా రెండు రిజర్వాయర్‌లు నిర్మించాలని కోరింది. ఈ రిజర్వాయర్‌ల నిర్మాణ వ్యయం కేంద్రమే భరించాలంది. అంతవరకైతే ఫర్వాలేదు. ప్రస్తుతం విచారణ సాగిస్తున్న కృష్ణ ట్రిబ్యునల్ తీర్పు వెలువడే వరకు సాగర్‌లో నీటిని నిల్వచేసేందుకు అంగీకరించబోమని డైరెక్టర్ జనరల్ భోపాల్‌సింగ్‌కు తెలంగాణ అధికారులు తేల్చి చెప్పారు. కాగా గోదావరి నుండి తరలించే నీటిలో 50 శాతం తెలంగాణకు కేటాయించాలని కూడా డిమాండ్ చేశారు. తెలంగాణ పరిస్థితి ఇలా వుంటే ఛత్తీస్‌గఢ్ తన వాటా నీళ్లు ఇచ్చేందుకు అంగీకరించకపోవడమే కాకుండా సమ్మక్క బ్యారేజీలో నీటి నిల్వ చేస్తే తమ భూభాగంలో ఎక్కువ ముంపు ఉంటుందని ఇందుకు తాము అంగీకరించబోమని ఇదివరకే తెగేసి చెప్పి వుంది. ప్రస్తుతం సమ్మక్క బ్యారేజీ 83 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్నారు. ఈ పరిధిలో తమ ప్రాజెక్టులకు నీళ్లు సరిపోతాయని కావేరికి తరలించాలంటే 87 మీటర్ల ఎత్తుకు పెంచి నిర్మించాలని తెలంగాణ కోరుతుంటే మరోవైపు ఛత్తీస్‌గఢ్ 83 మీటర్ల ఎత్తు నిర్మాణానికే అడ్డుచెబుతోంది. మరి 87 మీటర్ల ఎత్తు నిర్మాణానికి ఛత్తీస్‌గఢ్ అంగీకరిస్తుందా?

గోదావరి–కావేరి అనుసంధానం జరిగితే గరిష్ఠంగా ఆంధ్రప్రదేశ్‌కు 80 టియంసిలకు మించి రావు. అదే సమయంలో గోదావరి ట్రిబ్యునల్ తీర్పు మేరకు పోలవరం నుండి వచ్చే 80 టియంసిలు ఎగువ రాష్ట్రాలకు వెళతాయి. ఆంధ్రప్రదేశ్‌కు మిగిలేదెంత? ఈ పరిస్థితుల్లో పోలవరం నుండి గోదావరి జలాలను గొంతెండుతున్న రాయలసీమకు ఏ మేరకు తరలించగలరు? ఈ లోపు ప్రస్తుతం విచారణ జరుపుతున్న కృష్ణా ట్రిబ్యునల్ ఏం తీర్పు ఇస్తుందో?




ఇదిలా వుండగా తెలంగాణ నిర్మిస్తున్న సీతారామ ఎత్తిపోతల సీతమ్మసాగర్ ప్రాజెక్టు డిపిఆర్‌ను ఇటీవల జరిగిన గోదావరి యాజమాన్యం బోర్డు సమావేశంలో సమర్పించినపుడు గోదావరి నదీ జలాల్లో రెండు తెలుగు రాష్ట్రాల వాటా తగాదా తిరిగి తెర మీదకు ప్రముఖంగా వచ్చింది. సీతమ్మసాగర్ కింది భాగం గోదావరిలో ఆంధ్రప్రదేశ్ వాటా కేవలం 530 టియంసిలేనని తెలంగాణ తేల్చి చెప్పడంతో ఆంధ్రప్రదేశ్ అధికారులు విస్తుపోవలసి వచ్చింది. అసలు సీతమ్మసాగర్ పథకం ఉనికినే ఆంధ్రప్రదేశ్ అధికారులు ప్రశ్నించారు. గోదావరిలో ఎంత నీటి లభ్యత వుందో తేల్చాలని ఆ తర్వాతనే డిపిఆర్ ఆమోదించాలని వాదించారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లవుతున్నా గోదావరి జలాల్లో ఎవరి వాటా ఎంతో ఇంతవరకు తేలలేదు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం గోదావరి–కావేరి అనుసంధానాన్ని ఎలా అమలు జరుపుతుంది? నదీలోయలో ముఖ్యమైన రెండు రాష్ట్రాల వాటా తేలకనే మరొక నదీ లోయకు నీటిని ఏలా తరలిస్తారు? పైగా గోదావరిలో నీటి లభ్యతపై స్థిరమైన గణాంకాలు లేవు. ఒక్కో సమయంలో ఒక్కో విధంగా కేంద్ర జలశక్తి శాఖకు చెందిన సంస్థలు గణాంకాలు ఇస్తున్నాయి. ఇందుకూ ప్రాతిపదిక లేకపోలేదు. తెలంగాణ ప్రభుత్వం గోదావరిపై పలు పథకాలు నిర్మించుతోంది. చాలా పథకాలకు కేంద్ర జల సంఘం అనుమతులు లేవు. ఇవన్నీ పరిగణనలోనికి తీసుకొంటే ఎప్పటికప్పుడు ఆయా రాష్ట్రాల వినియోగం పెరగడంతో నికర జలాల మిగులు గణాంకాలు మారిపోతున్నాయి. పైగా ఎగువ గోదావరిలో వరద తక్కువగా వుంటుంది. ప్రాణహిత ఇంద్రావతి శబరి ఉపనదుల నుండి వరద వస్తేనే గోదావరిలో నీళ్లు ఉంటాయి.

గోదావరి ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 1486.15 టియంసిల్లో తమ వాటా 957.85 టియంసిలని ఆంధ్రప్రదేశ్ వాటా 518.85 టియంసిలని తెలంగాణ వాదిస్తుంటే ఆంధ్రప్రదేశ్ తమ వాటా 776 టియంసిలని తెలంగాణ వాటా 650 టియంసిలని పలు సమావేశాల్లో ఉభయ రాష్ట్రాల అధికారులు వాదులాడుకొని ఉన్నారు. జగన్మోహన్‌రెడ్డి హయాంలో కృష్ణ ట్రిబ్యునల్‌కు తెలంగాణ కృషి చేసినట్లు గోదావరి ట్రిబ్యునల్ నియామకానికి ఆంధ్రప్రదేశ్ నుండి కించిత్తు ప్రయత్నం జరగలేదు. జగన్మోహన్‌రెడ్డి సర్కారు మిగిల్చిపోయిన భారం ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై పడింది.

మరోవైపు జగన్మోహన్‌రెడ్డి సర్కారు హయాంలోనే పోలవరం నుండి గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టాలని కోరారు. కాని అప్పట్లోనే నదుల అనుసంధానం టాస్క్‌ఫోర్స్ కమిటీ ఛైర్మన్ వెదిరె శ్రీరాం త్రోసిపుచ్చారు. ఎందుకంటే పోలవరం వద్ద నికర జలాలు మిగిలిలేవు. ఇంత భారీ స్థాయిలో చేపట్టే పథకాన్ని కేంద్ర జలసంఘం ఆమోదించే సమయంలో నీటి కేటాయింపులు తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకొంటుంది. ఈ గండం నుండి బయటపడేందుకే ఛత్తీస్‌గఢ్ వాడుకోని నికర జలాలను ఎరగా జాతీయ జల అభివృద్ధి సంస్థ చూపుతున్నది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా ఆ దిశగా ఆలోచించుతున్నదనే వార్తలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గోదావరి కృష్ణ పెన్నా అనుసంధానానికి ఎప్పటినుండో అమలుకు సిద్ధమై ఉన్నారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న అనుసంధానం అమలుకు వస్తే గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అంతర్గతంగా నదుల అనుసంధానానికి తయారు చేసిన లెక్కలు పూర్తిగా మారిపోతాయి. గోదావరి–కావేరి అనుసంధానం జరిగితే గరిష్ఠంగా ఆంధ్రప్రదేశ్‌కు 80 టియంసిలకు మించి రావు. ఈ లెక్కలు కూడా ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. అదే సమయంలో గోదావరి ట్రిబ్యునల్ తీర్పు మేరకు పోలవరం నుండి వచ్చే 80 టియంసిలు ఎగువ రాష్ట్రాలకు వెళతాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌కు మిగిలేదెంత? ఈ పరిస్థితుల్లో పోలవరం నుండి గోదావరి జలాలను గొంతెండుతున్న రాయలసీమకు ఏ మేరకు తరలించగలరు? ఈ లోపు ప్రస్తుతం విచారణ జరుపుతున్న కృష్ణా ట్రిబ్యునల్ ఏం తీర్పు ఇస్తుందో? పోలవరం వద్ద నికర జలాలు మిగిలిలేవు కాబట్టి సరిపోయింది లేకుంటే పోలవరం నుండే గోదావరి జలాలు తమిళనాడుకు జగన్మోహన్‌రెడ్డి హయాంలోనే తరలిపోయేవి. ఇన్ని వివాదాల మధ్య గోదావరి–కావేరి అనుసంధానం ఏ రూపు తీసుకుంటుందో ఏ ప్రతిపాదనతో కేంద్ర ప్రభుత్వం వస్తుందో వేచి చూడాలి.

■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు



భవానీపురంలో వరద బాధితులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



మిమ్మల్ని కాపాడే వరకు బెజవాడలోనే

• వరద ముంపు ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు పర్యటన • బాధితులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకుని భరోసా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/వన్‌టౌన్): అన్ని విపత్తులూ ఒక్కసారే వచ్చాయి. బెజవాడపై ముప్పేట దాడి చేస్తున్నాయి. అన్నింటినీ ఎదుర్కొంటున్నాం. మీ ఇబ్బందులన్నీ స్వయంగా చూస్తున్నాను. మీ పరిస్థితి చూసి నాకు బాధ వేస్తోంది. మిమ్మల్ని కాపాడే వరకు నేను బెజవాడలోనే ఉంటా. మీ అందరినీ కాపాడిన తర్వాతే నేను నగరం విడిచి వెళతాను. మిమ్మల్ని పూర్తిగా కాపాడే బాధ్యత మాది ' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వరద బాధితులకు భరోసా నిచ్చారు. విజయవాడ కలెక్టరేట్‌లో ఉంటున్న చంద్రబాబు సోమవారం విజయవాడలోని సింగ్‌నగర్, రామలింగేశ్వరనగర్, భవానీపురంలలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ రాజశేఖర్ బాబులతో కలిసి ఎన్‌డీఆర్‌ఎఫ్ బోట్‌లో పర్యటించారు. పలువురు బాధితులు తమకు ఆహారం అందటం లేదని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. రామలింగేశ్వరనగర్‌లో స్థానిక ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ రావుతో కలిసి కాలినడకన పర్యటించి బాధితులను పరామర్శించారు. భవానీపురం, విద్యాధరపురం ప్రాంతాల్లోని శివాలయం సెంటర్, హెచ్‌బీ కాలనీ, ఊర్మిళా నగర్, తదితర ప్రాంతాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు. వరద బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.



మహోగ్రంగా..

కరకట్ట అంచులను తాకుతూ వరద | కట్టపైకి చేరిన బాధితులు

• బిక్కుబిక్కుమంటున్న ప్రజలు • వాణిజ్య పంటలు కృష్ణార్పణం • శాంతించాలంటూ కృష్ణమ్మకు పూజలు

కృష్ణమ్మ మున్నెన్నడూ లేని విధంగా కృష్ణాకరకట్ట అంచులను తాకుతూ పొంగి ప్రవహిస్తోంది. ప్రకాశ బ్యారేజీనుంచి సముద్రంలోకి సోమవారం ఉదయం 6గంటల నుంచి 11.42లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండటంతో యనమలకుదురు నుంచి కోడూరు, నాగాయలంక మండలాల వరకు కృష్ణానది భీకరరూపం దాల్చి ప్రవహిస్తోంది. కరకట్ట అంచుల వరకు నీరు చేరి ప్రవహిస్తుండటంతో ఏ క్షణంలో ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని, కరకట్టకు ఎక్కడగండి పడుతుందో, ఎలాంటి ఉపద్రవం ముంచుకొస్తుందో అనే భయంతో కృష్ణానదీ పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు.



మోపిదేవి మండలం కె.కొత్తపాలెంలో కరకట్టపైనే ఆశ్రయం



గన్నవరంలో సురక్షిత ప్రాంతాలకు బాధితుల తరలింపు

మచిలీపట్నం/చల్లపల్లి, సెప్టెంబరు 2 : కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. 110 సంవత్సరాల తర్వాత కృష్ణానదికి భారీగా వరద పోటెత్తింది. ప్రకాశం బ్యారేజీ నుంచి 11.42 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. కరకట్టను తాకుతూ వరదనీరు ప్రవహిస్తుం డటంతో కృష్ణానదీ పరీవాహక గ్రామాల ప్రజలు ఏక్షణంలో ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. కలెక్టర్ బాలాజీ నేతృత్వంలో రెవెన్యూ, పోలీసు అధికారులు నదీతీర గ్రామాల వెంబడి పహారా కాస్తున్నారు. లంక గ్రామాల్లో చిక్కుకుపోయిన వారిని ప్రత్యేక పడవల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో వారికి భోజనం, తాగునీటి సదుపాయం, వైద్యసేవలు అందిస్తున్నారు. కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చటంతో శాంతించాలంటూ మహిళలు పసుపు, కుంకుమలు, పూలు సమర్పించి పూజలు చేస్తున్నారు. పెనమలూరు మండలం యనమలకుదురు, పెదపులిపాక ప్రాంతాల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కలెక్టర్ డికె.బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ ప్రత్యేక పడవలు ఏర్పాటు చేసి నీటిలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. కంకిపాడు మండలం మద్దూరులోనూ అపార్టమెంట్‌లలో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.. యనమలకుదురు, పెదపులిపాకల వద్ద వరదనీరు కరకట్ట అంచుల వరకు చేరింది. . ఉత్తర చిరువోల్లంక వద్ద, కోడూరు మండలం ఉల్లిపాలెం వద్ద కృష్ణా కరకట్ట బలహీనంగా ఉండటంతో ఇసుక బస్తాలు, మట్టి వేసి బలోపేతం చేశారు. ఈ పనులను ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ పరిశీలించారు.

వాణిజ్య పంటలు వరదార్పణం

కృష్ణా కరకట్ట దిగువన సుమారుగా 50 వేల ఎకరాల్లో అరటి, కంద, పసుపు, చెరకు, మొక్కజొన్న, కూరగాయలు, పూలతోటలు, నిమ్మ, తమలపాకుల తోటలు నీటమునిగిపోయాయి. పంటలన్నీ నీటిలోనే కుళ్లిపోతాయని రైతులు వాపోతున్నారు. పసుపు, మొక్కజొన్న తదితర పంటలకు ఎకరానికి ముందస్తుగానే రూ.50వేలు కౌలు చెల్లించామని ఈ నగదు మొత్తం నీటిలో పోసినట్లయిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. చల్లపల్లి మండలం వెలివోలులో మల్బరీ తోటలు, రెండు రోజుల్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న పట్టు గూళ్ల మునిగిపోయాయని రైతులు ఆవేదన చెందారు. కోళ్లఫారాలు, రొయ్య పిల్లలను ఉత్పత్తిచేసే హేచరీలు నీటమునిగాయి.

కృష్ణా కరకట్టపైనే నివాసం

మోపిదేవి మండలం కె.కొత్తపాలెం, బొబ్బర్లంక, చల్లపల్లి మండలం ఆముదార్లంక గ్రామాల్లోకి పెద్దఎత్తున వరదనీరు చేరింది. తాటాకు ఇళ్లు, రేకులషెడ్లు మునిగిపోయేంతగా నీరు చేరింది. పాఠశాలలు, ఆలయాలు, చర్చిల భవనాలు నీటమునిగాయి. కె.కొత్తపాలెంలో పాఠశాల భవనం సన్‌షైడ్ వరకు నీరుచేరింది. గ్రామస్థులంతా పిల్లలు, పశువులతో సహా కరకట్టపైనే తాత్కాలిక నివాసాలు ఏర్పాటుచేసుకుని ఉండాల్సిన స్థితి నెలకొంది. లంక గ్రామాల్లోకి ఎవరూ వెళ్లకుండా శ్రీకాకుళం, నడకుదురు, రాముడుపాలెం, బొబ్బర్లంక, కె.కొత్తపాలెం వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. రావిలంక తదితర లంకల నుంచి వరదలో చిక్కుకుపోయిన పశువులను లాంచీలకు కట్టి కరకట్టపైకి చేర్చారు. గొర్రెల కాపరులు ముందస్తుగానే జీవాలను కరకట్టపైకి చేర్చారు. చల్లపల్లి మండలం ఆముదార్లంకలో ఆదివారం నుండే అధికారుల బృందం మకాం వేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

యుద్ధప్రాతిపదికన..

ముమ్మరంగా సహాయ చర్యలు

వందలాది బోట్లతో బాధితుల తరలింపు

» ముంపు ప్రాంతాలకు ఆహారం, నీరు, మందులు చేరవేత

» హెలికాప్టర్లు, డ్రోన్ల సాయంతోనూ ఆహారం అందజేత





సింగ్‌నగర్ ఫ్లైవోవర్ వద్దకు చేరిన ఆహారం, నీరు, మందులను పడవల్లో పంపుతున్న అధికారులు







(ఆంధ్రజ్యోతి, విజయవాడ /వన్‌టౌన్): వరద బాధితులను రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన సహాయకచర్యలు చేపట్టింది. ముంపులో ఉన్న బాధితుల తరలింపుతో పాటు వారికి ఆహారం అందించే అంశాలపై దృష్టి పెట్టి సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టరేట్‌లోనే ఉండి యావత్ యంత్రాంగాన్ని ఆదివారం రాత్రి అప్రమత్తం చేయటంతో సోమవారం తెల్లవారేసరికి రాష్ట్రం నలుమూలల నుంచి వందలాది సంఖ్యలో బోట్లు వచ్చాయి. పాలు, అల్పాహారం, ఆహారం, పెరుగు, మంచినీళ్ల బాటిల్స్‌తో కూడిన ఆహార పొట్లాలను సింగనగర్ ఫ్లై ఓవర్ వద్ద బోట్లలోకి చేర్చి వరద ప్రభావిత ప్రాంతాలకు పంపించారు. సింగ్‌నగర్, దేవీనగర్, పటేల్ నగర్, నందమూరినగర్, లూనా సెంటర్, ఎల్‌బీఎస్ నగర్, ఆంధ్రప్రభ కాలనీ, పాత - కొత్త రాజరాజేశ్వరిపేట, రామకృష్ణాపురం, ఇందిరానాయక్ కాలనీ, ఉడా కాలనీలకు బోట్లలో ఆహారాన్ని పంపారు. ప్రాంతాల వారీగా బోట్లు పంపించినప్పటికీ వరద బాధితులు తమ కుటుంబ సభ్యులు నీళ్లలో ఉన్నారంటూ ప్రాధేయపడటం, బలవంతం చేయటంతో బోట్లు డైవర్షన్ అయ్యాయి. బోట్ల వస్తుండటంతో వరదలో ఉన్న జనాలు సాహసం చేసి మెడలోతు నీళ్లను కూడా లెక్కచేయకుండా బయటకు వస్తున్నారు. అర్ధంతరంగా బయటకు రావటంతో బాధితులు మునిగిపోతారేమోనన్న ఉద్దేశ్యంతో గజ ఈతగాళ్లు వరదలోకి దిగి వారిని బోట్లలోకి ఎక్కించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఒక మహాయజ్ఞంలా వరద బాధితులను బయటకు తీసుకువచ్చారు. చంటిబిడ్డతో బాలింతను సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీంతో సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ వరద బాధితులతో పోటెత్తింది. సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ చేరిన తర్వాత వీరంతా నడుచుకుని బుడమేరు బ్రిడ్జి దాటి ఆటోలలో తమ బంధువుల ఇళ్లకు వెళ్లారు.

హెలికాప్టర్లలో ఆహారం పంపిణీ

బుడమేరు వరద బాధితులకు ఆహారాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం హెలికాప్టర్లను వినియోగించింది. బుడమమేరు వరద తీవ్రత ఉన్న సింగ్‌నగర్ శివారు ప్రాంతాలలో రెండు హెలికాప్టర్లలో ఆహార ప్యాకెట్లను బాధితుకు జారవిడిచారు. స్థానికంగా ఉన్న పేదలతో పాటు, డాబాలు, అపార్ట్‌మెంట్ల పైకి చేరిన బాధితులు హెలికాప్టర్లకు చేతులు ఊపడంతో ఆహార పొట్లాలను కిందకు జారవిడిచారు.

డ్రోన్లతోనూ ఆహారం పంపిణీ

వరద బాధితులు ఏ ఒక్కరూ ఆహారంతో అలమటించకూడదన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఏడు భారీ డ్రోన్లను ఏర్పాటు చేసింది. ఎన్‌టీఆర్ కలెక్టరేట్ ఆవరణలో వీటిని పరీక్షించారు. ఆ తర్వాత ఈ డ్రోన్ల సాయంతో బుడమమేరు ప్రాంతంలో బాధితులకు ఆహారాన్ని అందించారు.

ప్రభుత్వం బతికించింది

ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోట్ల పై సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ మీదకు చేరుకున్న బాధితులతో ఆంధ్రజ్యోతి మాట్లాడగా వరద కారణంగా తాము పడిన తీవ్ర ఇబ్బందులను పంచుకున్నారు. ప్రభుత్వం శరవేగంగా వరద సహాయక చర్యలు చేపట్టటంతో తాము బతికి బట్టగలిగామని ఆంధ్రజ్యోతితో చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం అందించిన ఆహారపు ప్యాకెట్లను తీసుకుని ఆబగా భుజించారు. కొంతమంది కుటుంబ సభ్యులు సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ ఫుట్‌పాత్ మీద కూర్చొని భోజనాలు చేశారు. సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ మీదకు చేరుకున్న వికలాంగులతో ఆంధ్రజ్యోతి ముచ్చటించగా వైకల్యం కలిగిన తాము ఈ వరదలో నుంచి బయటకు రాలేమేమోనని, మృతిచెందుతామేమోనని భయం వేసిందని చెప్పారు. ప్రభుత్వం తమను సకాలంలో రక్షించటంతో బయట పడ్డామని, రెండు రోజుల పాటు ఆకలిని భరించలేకపోయామని తెలిపారు.ఇంకా వరద నీటిలో ఉన్న భారీ సంఖ్యలో కుటుంబాల్లోని యజమానులు ధైర్యం చేసి ఆహారం కోసం బయటకు వచ్చారు.



చంటి పాపతో బంధువుల ఇంటికి వెళుతున్నాం

నేను కరెంటు పనులు చేసుకుంటూ సింగ్‌నగర్ ఏరియాలో నివశిస్తూ ఉంటాను. ఇంత భారీ వరద వస్తుందని అసలు ఊహించలేదు. క్రమక్రమంగా వరద పెరుగుతూ ఇంటిలోకి నీరు వచ్చేసింది. చూస్తుండగానే ప్రమాదకర పరిస్థితిలో వరద వచ్చింది. ఇంటిలో మాకు చంటిబిడ్డ ఉంది. ప్రభుత్వం బోటు పంపించటంతో ప్రాణం లేచి వచ్చింది. చంటి బిడ్డను తీసుకుని వచ్చాం.



గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాలు



పాయకాపురంలో బోట్లలో బాధితుల తరలింపు

విరుచుకుపడిన మునేరు



ఐతవరం వద్ద జాతీయ రహదారిపై పొంగుతున్న మునేరు

కంచికచర్ల, సెప్టెంబరు 2: కంచికచర్ల మండలంలో కృష్ణానది తీర గ్రామాల ప్రజలు భయంతో గజగజ వణికిపోతున్నారు. ఒకవైపు కృష్ణానదికి భారీగా వరద వస్తుండటంతో మరోవైపు ఉగ్రరూపం దాల్చిన మునేరతీర గ్రామాలపై విరుచుకుపడింది. పెండ్యాల, వేములపల్లి, మోగులూరు, మున్న లూరు, కునికినపాడు, చెవిటికల్లు, కొత్తపేట, గనిఆత్కూరు తదితర గ్రామాల్లోకి ఆదివారం రాత్రి పది గంటల సమయంలో ఒక్కసారి వరద ప్రవేశించింది. లోతట్టు, పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లు ముంపుకు గురయ్యాయి. ఐదారు అడుగుల ఎత్తున వరద నీరు చేరటంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. రాత్రంతా పిల్లలు, పెద్దలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. కంటిమీద కునుకు కరువైంది. ఆయా గ్రామాలను నుంచి బయటకు వచ్చేందుకు వీలు లేని పరిస్థితి. వరద నీరు చుట్టిముట్టటంతో ఆయా గ్రామాలు ద్వీపాలుగా మారాయి. భోజనం లేదు. కనీసం తాగునీరు కూడా లేక అల్లాడిపోయారు. బయట నుంచి కూడా ఆయా గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడటంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి ఏర్పడింది. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. పంటలు దెబ్బతినటంతో పాటుగా ఇళ్లల్లోని ధాన్యం, విలువైన సామాగ్రి, ఇతర వస్తువులు నీట మునగటం వల్ల భారీ ఎత్తున ఆస్తి నష్టం జరిగింది. కాపాడండి మహోప్రభో అంటూ పలువురు వాట్సప్ ద్వారా పరిస్థితి వివరిస్తూ అధికారులకు తెలపాల్సిందిగా కోరుతూ మీడియాను వేడుకున్నారు. సోమవారం ఉదయం ప్రత్యేకంగా పడవలు తెప్పించి, ఆయా గ్రామాల్లోని బాధితులను సురక్షిత ప్రాం తాలకు తరలించారు. ఆహారం, ఇతర సామాగ్రి పంపించారు. నందిగామ ఏసీపీ డాక్టర్ రవికిరణ్, ఇతర అధికారులు పర్యటించారు.



బెజవాడను ముంచిన బీడీసీ గండ్లు

• బుడమేరు వరద మళ్లింపు కాలువకు రెండు వైపులా 10 చోట్ల భారీ గండ్లు

• విజయవాడను ముంచెత్తిన 35 వేల క్యూసెక్కుల వరద నీరు

8లో..

రిటైనింగ్ వాల్ ఘనత టీడీపీదే!

• తొలి దశ నిర్మాణం 2016లో ప్రారంభం • 2.37 కిలోమీటర్లు 2018లోనే పూర్తి

• వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు, మూడు దశలకు బ్రేక్

• టీడీపీ ఆందోళనలతో ఎట్టకేలకు ఎన్నికలకు ఏడాది ముందు ప్రారంభం



గ్యాస్ వేధిస్తుంటే..

వేళకు తినకపోవడం, తిన్నా అరగకపోవడం చాలా మందికి ఎదురయ్యే సమస్య. వేపుళ్లు, జంక్ ఫుడ్, అధిక నూనెతో వండిన వంటకాలను తినటం వల్ల గ్యాస్ పెరిగి కడుపుబ్బరం సమస్య ఎర్పడుతుంది. దీనికి చిన్న చిట్కాలతో పరిష్కారం లభిస్తుంది. అవేమిటో చూద్దాం..

సమస్య మూలమిది: మనం తిన్న ఆహారం కడుపులోకి వెళ్లిన తరువాత.. జీర్ణం అవుతుంది. ఆ జీర్ణప్రక్రియలో కొన్ని రకాల వాయువులు విడుదలవుతాయి. కొన్ని సార్లు, అవి బయటికి వెళ్లకుండా కడుపులోను, పేవులలోను పేరుకుపోతాయి. అవి చెడువాయువులుగా మారి ఇబ్బంది పెడతాయి. ఆయుర్వేదంలో ఈ సమస్యను ఆర్యానం, ఆటోపం అంటారు. ఈ వాయువులు బయటకు వెళ్లకపోతే ఆ ప్రభావం గుండె.. ఊపిరితిత్తులపై పడుతుంది. గుండె దడ, ఆందోళన, గుండెల్లో నెప్పి మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. ప్రతి రోజు క్రమం తప్పకుండా పల్చటి మజ్జిగ తాగితే ఈ సమస్య చాలా వరకూ పరిష్కారమవుతుంది.

చిట్కాలివే: అరిటి బోద లోపల తెల్లటి పదార్థం ఉంటుంది. దీని రసాన్ని రోజుకు ఒక కప్పు చొప్పున 15



రోజులు తాగితే గ్యాస్ సమస్య తగ్గిపోతుంది.

- అల్లం రసం తీసి దానిని వేడిచేసి తగినంత బెల్లం కలపాలి. ఇలా కలిపిన మిశ్రమాన్ని రోజుకు ఒక స్పూను తాగాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కడుపుబ్బరం తగ్గిపోతుంది.
- గింజలున్న ఎండిన నల్ల ద్రాక్షను తీసుకొని నీళ్లలో ఆరు గంటలు నానబెట్టాలి. ఇలా నానిన ద్రాక్ష రసాన్ని తాగితే గ్యాస్ సమస్య తగ్గుతుంది.
- శొంఠిపొడి, పాత బెల్లంపొడిలను సమ పాళ్లలో కలుపుకోవాలి. ప్రతి రోజూ ఉదయం ఈ మిశ్రమాన్ని ఒక స్పూను తినాలి. ఆ తర్వాత వేడి నీళ్లు తాగాలి. ఇలా తాగితే కడుపులో ఉన్న మలినాలన్నీ తొలగిపోతాయి.
- ధనియాలు, శొంఠిలను సమపాళ్లలో తీసుకొని.. వేడి నీటిలో మరిగించాలి. అలా తయారయిన కషాయాన్ని తాగి నడిస్తే- గ్యాస్ సమస్య తగ్గుతుంది.
- సోంపు, జీలకర్ర, వాములను సమపాళ్లలో తీసుకొని పొడి చేయాలి. ఈ పొడిని ఉదయం, సాయంత్రం ఒక స్పూను చొప్పున వేడి నీళ్లలో వేసుకొని తాగాలి. ఇలా తాగితే వారం రోజుల్లో గ్యాస్ సమస్య తొలగిపోతుంది.

కిడ్స్ డైట్



అమ్మ చేతి గోరుముద్ద!

పిల్లలు తినడానికి మొండికేస్తారు. అయిష్టత ప్రదర్శిస్తారు. బలవంతం చేస్తే ఏడ్చేస్తారు. అలాగని వదిలేస్తే పిల్లలకు పోషకాలు అందేదెలా? ఇలాంటప్పుడు పిల్లలకు బలవర్ధక ఆహారం మీద ఇష్టం పెరిగే చిట్కాలు పాటించాలి!

పిల్లల పోషకాహారం గురించిన అవగాహన తల్లుల్లో పెరగడం అభినందనీయమే! అయితే ఆ ఆహారంలో విటమిన్లు, ఖనిజలవణాలు, మాంసకృత్తులు, పిండిపదార్థాలు ఉండేలా సరి చూసుకోవడమూ అవసరమే! అయితే అవన్నీ ప్రాంతీయపరమైన, సంప్రదాయపూరితమైన, రుతుపరమైన ఆహార పదార్థాలేనా? మనం తినే ఆహారం, నివసించే వాతావరణాలతో మన అనుబంధం కాలక్రమేణా బలహీనపడుతోంది. ఇప్పటికి పదేళ్ల వెనక్కు వెళ్తే ఏ ఇంట్లో చూసినా పప్పు, అన్నంతో కూడిన భోజనమే తినేవాళ్లం. పిల్లలూ వాటినే ఇష్టంగా తినేవాళ్లు. కానీ ఇప్పుడు పోషకాల మీద పెరిగిన అవగాహన మూలంగా, పిండిపదార్థాలు, కొవ్వులను దూరం పెట్టేస్తున్నాం. ఏం కొంటున్నా, లేబుల్ పరీక్షించి, కేలరీలు లెక్కిస్తున్నాం. కానీ ఇలాంటి విపరీతమైన అప్రమత్తత వల్ల ఎక్కువ సందర్భాల్లో విలువైన పోషకాలకు దూరమవుతున్నాం. ఫిట్‌గా ఉండడానికి బదులు లావుగా తయారవుతున్నాం, తేలికగా జబ్బుల బారిన పడుతున్నాం. పోషకాలను బట్టి ఆహారాన్ని ఎంచుకునే ధోరణి వల్ల లాభపడేది ఆహార సంస్థలే! ప్రజల ఆరోగ్యానికి ఈ ధోరణి ఏమాత్రం ప్రయోజనకారి కాదు. కాబట్టి మరీ ముఖ్యంగా పిల్లలకు ఇచ్చే ఆహారం విషయంలో అమ్మమ్మల నాటి పాతవి, ఆరోగ్యకరమైన పద్ధతులనే ఎంచుకోవాలి.

అమ్మమ్మల ఆహారం!

ప్రపంచం మొత్తంలో స్థూలకాయం కలిగిన పిల్లలున్న దేశంగా భారతదేశం రెండవ స్థానంలో ఉంది. అంతమాత్రాన మనం పిల్లలు, వారి ఆహారపుటలవాట్లను అశ్రద్ధ చేస్తున్నామని కాదు. నిజానికి వారి ఆహారం పట్ల మనం అవసరానికి మించిన శ్రద్ధ ప్రదర్శిస్తున్నాం. పోషకాలున్న ఆహారం అది ప్రాంతీయమైనది కాకపోయినా, వెతికి వెతికి తినిపిస్తున్నాం. కానీ మన అమ్మలు, అమ్మమ్మలు ఇలా చేయలేదు. ఏ రుతువులో కాచే కాయలను ఆ రుతువుల్లో తినిపించారు. పొట్టు తీయని ధాన్యాలు, పెరట్లో పండిన కూరగాయలు, పళ్లు అందించారు. అప్పట్లో వంటగది ఇంటి మధ్యలో ఉండేది. ఎప్పుడు అవసరమైతే అప్పుడు వంటింట్లోకి వెళ్లి ఆహారం అందుకుని తినేటందుకే ఈ ఏర్పాటు. పాలు, పెరుగు, కమ్మని వెన్న, నెయ్యి, జున్నులు ప్రతి ఇంట్లో తాజాగా, సిద్ధంగా ఉండేవి. సున్నుండలు, అరిసెలు లాంటి బలవర్ధకమైన చిరుతిళ్లు డబ్బాల్లో నింపి ఉంచేవారు. సెనగపప్పు ఉండలు, వేరుశనగ చెక్కలు, బెల్లం జిలేబీలు...ఇవన్నీ రక్తవృద్ధిని పెంచే చిరుతిళ్లే! వీటిలో ఎటువంటి ప్రిజర్వేటివ్స్, కృత్రిమ రంగులూ ఉండవు. కానీ ఇలాంటి వంటలు వండే బదులు, పాశ్చాత్య ఆహార పద్ధతులను అనుసరిస్తూ మాంసకృత్తుల కోసం సోయా, అవకాడొల మీద, పీచు కోసం ఓట్స్ మీద ఆధారపడుతున్నాం! వీటికంటే మెరుగైన ప్రత్యామ్నాయ, సంప్రదాయ పదార్థాలు ఎన్నో ఉన్నాయి.

పేచీ పెట్టే పిల్లలతో ఇలా...

కొంతమంది పిల్లలు తినడానికి పేచీ పెడతారు. ఆరోగ్యకరమైన ఆకుకూరలు, కూరగాయల పట్ల అయిష్టత ప్రదర్శిస్తారు. ఇలాంటప్పుడు పిల్లలకు ఆ ఆహారం పట్ల ఆసక్తి ఏర్పరిచే ప్రయత్నంచేయాలి. ఇందుకోసం పాలకూరను పెరట్లోనే పెంచాలి. పూల తొట్లలో కొత్తిమీర, పుదీనా, ఆకుకూరల విత్తనాలు చల్లి పిల్లల చేత వాటికి నీళ్లు పోయిస్తూ ఉండాలి. కూరగాయలు, ఆకుకూరలు ఎదిగే క్రమాన్ని పిల్లలు పరిశీలించేలా చేయాలి. అలాగే కూరగాయలు పండించే తోటలకు అరుదుగానైనా పిల్లలను తీసుకెళ్తూ ఉండాలి. పళ్లు, కూరగాయ మొక్కలను పిల్లలు గమనించేలా చేయాలి. ఇలా చేయడం వల్ల ఆ మొక్కల ఉత్పత్తుల పట్ల పిల్లలకు ఆసక్తి పెరుగుతుంది. వాటి వంటలను ఆస్వాదించాలనే కోరిక కూడా పెరుగుతుంది. ఆహారంతో అనుబంధం ఏర్పరచాలంటే పర్యావరణంతోనూ అనుబంధం ఏర్పరచాలి. పెద్దలు ఈ విషయంలో పిల్లలకు మార్గనిర్దేశకులుగా మారాలి. అలాగే బయట భోజనాలకు స్వస్తి చెప్పి, ఇంటి భోజనానికే పెద్దలు కట్టుబడి ఉండాలి. పిల్లలకూ ఆ అలవాటు నేర్పాలి. వంటింట్లో వంటపనిలో నిమగ్నమయ్యే తల్లులను చూసిన పిల్లలు కచ్చితంగా వంటగదిలో తయారయ్యే ఆహారాన్ని ఇష్టపడతారు. అలాగే కుటుంబసభ్యులందరూ నిర్దిష్ట సమయాల్లో కలిసి కూర్చుని భోజనం చేసే కట్టుబాటు అనుసరించాలి. ఆ సమయంలో టివి, సెల్‌ఫోన్ లాంటి వాటికి చోటు ఇవ్వకూడదు.

పిల్లల ఆహారం పసందుగా...

అన్నం, వేరుసెనగపప్పు, నెయ్యి, ఒక పండు, ఇంట్లో తయారైన లడ్డు.. ఇదీ పిల్లలకు అనునిత్యం ఇవ్వవలసిన ఆహారం. వీటితోపాటు కూరగాయలు, ఇంట్లో వండిన ఎటువంటి ఆహారమైనా ఇవ్వవచ్చు. చిరుతిళ్లుగా గుప్పెడు వేరుసెనగపప్పులు, తాజా పండ్లు, అటుకుల ఉప్మా, గోధుమరొట్టె, బెల్లం ముక్క, ఇంట్లో తయారైన సున్నుండలు, లడ్లు... ఇలా పోషకభరితమైన చిరుతిళ్లను పిల్లలకు అలవాటు చేయాలి. 'ఫలానా పాఠం తప్పు లేకుండా రాసి చూపిస్తే, చాక్లెట్లు ఇప్పిస్తా!' లాంటి ఆశ పెట్టే పద్ధతులు మానేయాలి. చాక్లెట్లను వారానికి ఒకసారికే పరిమితం చేయాలి. గోధుమ బియ్యంలో పోషకాలు అధికం. అలాగని వాటిని వండి పెడితే పిల్లలు తినడానికి ఇష్టపడరు. కాబట్టి బియ్యంతోపాటు రెండు గరిటెల గోధుమ బియ్యం కలిపి వండి పెట్టవచ్చు. క్యారట్, క్యాప్సికమ్ లాంటి కూరగాయలను అందమైన ఆకారాల్లో కోసి, ఆకర్షణీయమైన అలంకరణతో వడ్డించి, పిల్లల్లో ఆసక్తినీ రేకెత్తించవచ్చు. వీలైనంత వరకూ భిన్నమైన పోషకాలు అందేలా మూడు, నాలుగు కూరగాయలను కలిపి వండవచ్చు. ఇలా పిల్లలకు నచ్చే, వారు మెచ్చే తరహాలోనే ఆహారం పట్ల వారికి ఇష్టాన్ని రెట్టింపు చేయవచ్చు.



పోషకాల చిరుతిళ్లు ఇవే!

పిల్లలకు జంతికలు, గవ్వలు లాంటి నిల్వ పిండిపదార్థాలనే చిరుతిళ్లుగా ఇవ్వవలసిన అవసరం లేదు. పచ్చి కూరగాయ ముక్కలకు ఉప్పు, నిమ్మరసం, చాట్ మసాలా జోడించి సలాడ్‌గా అందించవచ్చు. మొలకెత్తిన పెసలు, సెనగలు ఒక టీస్పూన్ నూనెలో వేయించి, క్రంచీగా ఉండడం కోసం వేయించిన వేరుసెనగ పప్పులు చల్లి, నిమ్మరసం కలిపి అందించవచ్చు. షియా విత్తనాలు నానబెట్టి, పండ్ల ముక్కలు, తేనె కలిపి తినిపించవచ్చు. కీర దోస లేదా జుకినిలను పొడవుగా తరిగి, ఉప్పు, చిల్లీఫ్లేక్స్, మొక్కజొన్న పిండి కలిపిన మిశ్రమంలో ముంచి, బ్రెడ్ పొడి అద్ది నూనెలో వేయించి అందించవచ్చు. కూరగాయలు కలిపి ఆమ్లెట్ వేసి ఇవ్వొచ్చు. పులిసిన పిండితో రొట్టెలు, చద్ది అన్నంతో దద్దోజనం లాంటివి కూడా ఆరోగ్యకరమే! ఆవిరి మీద ఉడికించిన చికెన్, చేప ముక్కలు లేదా గ్రిల్ చేసినవీ పిల్లలకు అందించవచ్చు. పండ్లముక్కలతో కస్టర్డ్ తయారుచేసి పెట్టవచ్చు.

ఆకలి తెలియనివ్వాలి

సాధారణంగా భోజన వేళకు పిల్లలు కూడా కడుపునిండా తినడం అన్నిసార్లూ వీలుపడకపోవచ్చు. అప్పుడప్పుడూ పిల్లల ఆకలి మందగిస్తూ ఉంటుంది. కాబట్టి తినడానికి పేచీ పెట్టినప్పుడు, బలవంతంగా తినిపించే ప్రయత్నం చేయకూడదు. ఆకలి ఉంటేనే పిల్లలకు ఆహారం అందించాలి. భయపెట్టి, బుజ్జగించి తినిపించడం వల్ల తల్లులు ఆశించే ప్రయోజనం నెరవేరకపోవచ్చు. సాధారణంగా తల్లులు, బడికెళ్లే ఈడు వరకూ పిల్లలకు ముద్దలు చేసి తినిపిస్తూ ఉంటారు. కానీ ఈ పద్ధతి కూడా సరికాదు. నడక వచ్చిన వయసు నుంచే పిల్లలు స్వతంత్రంగా తినే అలవాటు చేయాలి. ప్రతి రోజూ ఒకే సమయానికి, ఒకే ప్రదేశంలో తినే ఏర్పాట్లు ఉండాలి. పదార్థాలు నేల మీద పడిపోతాయనో, పిల్లలు చిందరవందర చేస్తారనో, దుస్తులు పాడైపోతాయనో పిల్లలను సొంతగా ఆహారం తిననివ్వకుండా అడ్డుకోకూడదు. పిల్లల కోసం ప్రత్యేకంగా తయారయ్యే స్పూన్లు, ఫోర్కులు, బౌల్స్, ప్లేట్స్‌నే వాడుకోవడం వల్ల వాటితో పిల్లలకు గాయాలు అవకుండా ఉంటాయి. నేల మీద పడినా పగిలిపోకుండా ఉండే పదార్థాలతో తయారైన పాత్రలు, స్పూన్లనే వాడుకోవాలి.

బ్లడ్ గ్రూప్ డైట్

కార్బ్స్ కావలసిందే!

కార్బ్స్‌ను పూర్తిగా దూరం పెట్టేసే డైట్ ట్రెండ్‌ను విస్తృతంగా అనుసరించేవాళ్లున్నారు. కానీ శక్తిని సమకూర్చే పిండిపదార్థాలను పూర్తిగా మానేస్తే శరీరానికి శక్తి సమకూరేదెలా? మంచి, చెడు పిండిపదార్థాల్లో వేటిని ఏ పరిమాణంలో తీసుకోవాలో అవగాహన ఏర్పరుచుకుని తదనుగుణంగా మసలుకోవాలి.

పిండిపదార్థాలు ప్రధాన పోషకాలు. మనం రోజూ తీసుకునే ఆహారంలో 70% పిండిపదార్థాలే ఉంటాయి. జీర్ణవ్యవస్థ పిండిపదార్థాలను గ్లూకోజ్‌గా మారుస్తుంది. శరీరం ఈ గ్లూకోజ్‌ను కణజాలం, కణాలు, అవయవాల శక్తి కోసం వినియోగిస్తుంది. కాబట్టి శక్తినిచ్చే పిండిపదార్థాలు పూర్తిగా మానేయడం అవివేకం.


పిండిపదార్థాలు లోపిస్తే?

శక్తికి మూలాలైన పిండిపదార్థాలు లోపిస్తే శరీరం పలు లక్షణాల రూపంలో ఆ లోపాన్ని బహిర్గతపరిచే ప్రయత్నం చేస్తుంది. అవేంటంటే...

- నీరసం
- నోటి దుర్వాసన
- మలబద్ధకం
- వాంతులు
- తలనొప్పి
- పోషకలోపం

డి - గ్లూకోజ్

అత్యంత ముఖ్యమైన, కీలకమైన పిండిపదార్థం గ్లూకోజ్. అన్ని జీవరాశులు శక్తి కోసం వాడుకునే సులువైన చక్కెర (మోనోశాఖరైడ్) ఇది. అయితే పిండిపదార్థాలు శరీర బరువును కచ్చితంగా పెంచుతాయి. అవసరం లేని చెడు పిండిపదార్థాలు ఎక్కువగా తీసుకుంటూ, అవసరం ఉన్న మంచి పిండిపదార్థాలను పరిమితంగా తీసుకునేవారికి ఈ సమస్య సహజం. కాబట్టి వాటిలో ఏవి మంచి, ఏవి చెడు? అనే విషయం మీద అవగాహన ఏర్పరుచుకోవాలి.



మంచి పిండిపదార్థాలు (కాంప్లెక్స్ కార్బ్స్)

వీటిలోని రసాయన రూపం, పీచులను జీర్ణం చేసుకోవడానికి శరీరం ఎక్కువ శక్తిని ఖర్చుచేయవలసివస్తుంది. వీటి నుంచి అందే శక్తి శరీరానికి ఎక్కువ సమయంపాటు ఉపయోగపడుతుంది. మంచి పిండిపదార్థాలలో...

- పోషకాలు, పీచు ఎక్కువ
- గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ
- తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండుతుంది
- శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం (మెటబాలిజం) పెరుగుతుంది.

పొట్టు తీయని గోధుమలతో తయారైన బ్రెడ్, రొట్టెలు, తృణధాన్యాలు, ఆకుపచ్చని కూరగాయలు, చిలకడదుంపలు, తాజా పళ్లు ఈ కోవకు చెందినవి.

చెడు పిండిపదార్థాలు (సింపుల్ కార్బొహైడ్రేట్స్)

ఇవన్నీ పొట్టు తీసి, పాలిష్ చేసిన పదార్థాలు. వీటిలో సహజసిద్ధ పోషకాలు, పీచు తక్కువ. చెడు పిండిపదార్థాల్లో...

- పీచు, పోషకాలు అతి స్వల్పం
- గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువ
- క్యాలరీలు కొవ్వుగా మారతాయి
- అత్యధిక గ్లూకోజ్ స్థాయిలు (నీరసం తెప్పిస్తాయి)

చాక్లెట్లు, తీపి పదార్థాలు, తీపి జోడించిన తృణధాన్యాలు, సోడాలు, శీతల పానీయాలు, పొట్టు తీసిన పిండ్లు ఈ కోవకు చెందినవి.

మేలురకం పిండిపదార్థాలు వీటిలో...

ఓట్స్‌తో తయారైన బిస్కెట్లు, నారింజ రసం, యాపిల్, కేరట్లు, టమేటాలు, ఎండుద్రాక్ష, ద్రాక్ష, అరటిపళ్లు.

- **ఓట్‌మీల్:** ఎక్కువ సమయంపాటు శక్తినిచ్చే నిలకడైన పిండిపదార్థం ఇది. నీళ్లు కలిపి తయారుచేసిన ఒక కప్పు ఓట్‌మీల్‌లో 159 క్యాలరీలు ఉంటాయి. 4 గ్రాములు పీచు, 6 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **యాపిల్:** భోజనానికి, భోజనానికి మధ్య తీసుకోవలసిన ఈ అల్పాహార ఫలంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే 4 గ్రాముల పీచు, పెక్టిన్‌లు ఉంటాయి. మాంసకృత్తులు పుష్కలంగా ఉండే వేరుసెనగపప్పుతో తయారయ్యే వెన్నతో కలిపి తీసుకుంటే ప్రయోజనకరం.
- **చిలకడదుంపలు:** ఇది నిజమైన 'సూపర్ ఫుడ్'. కప్పు చిలకడదుంప ముక్కల్లో 7 గ్రాముల పీచు, అత్యధిక విటమిన్ ఎ, సిలు, 4 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **మినుములు:** ఒక కప్పు ఉడకబెట్టిన పొట్టు తీయని మినుముల్లో 15 గ్రాముల పీచు, అంతే పరిమాణంలో మాంసకృత్తులు ఉంటాయి. ఇంత పరిమాణంలో పోషకాలు మరే పదార్థంలోనూ ఉండవు.
- **టమేటాలు:** వీటిలో విటమిన్లు, ఖనిజలవణాలు పుష్కలం. పీచుతో పాటు లైకోపీన్ అనే యాంటీఆక్సిడెంటు కూడా వీటిలో ఉంటాయి.


బొబ్బర్లంక వద్ద వరద నీటిలో అరటి తోటలు


పెనుగంచిప్రోలు మునేటి వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎస్ఐ అర్జున్


శ్రీకాకుళం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

పోటెత్తిన వరద

- జలదిగ్బంధంలో లంక గ్రామాలు
- పొంగిపొర్లుతున్న డ్రెయిన్లు
- ఆందోళనలో తీరప్రాంత ప్రజలు
- నీటమునిగిన వరి పొలాలు
- అప్రమత్తమైన అధికారులు

మోపిదేవి, సెప్టెంబరు 2 : కృష్ణానది వరద ఉధృతి మరింత పెరుగుతుండటంతో జలదిగ్బంధంలో లంక గ్రామాలు చిక్కుకున్నాయి. సోమవారం సాయంత్రానికి వరద గతంలో ఎన్నడూ లేని విధంగా తారాస్థాయికి రావటంతో బొబ్బర్లంక గ్రామం పూర్తిగా వరద నీటిలో చిక్కుకుంది. కృష్ణానది కరకట్ట నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారి కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. కె.కొత్తపాలెం దళితవాడ, గౌడపాలెంలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోగా, కరకట్టపై తాత్కాలిక గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. అధికారులు పాఠశాల, కళ్యాణ మండపాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ అక్కడికి వెళ్లేందుకు ఆసక్తి చూపటం లేదు. మరో రోజు మరింతగా వరద వచ్చే అవకాశం వస్తుందని హెచ్చరికలు చేస్తుండగా, ఇప్పటికే బొబ్బర్లంక వద్ద కృష్ణానది కరకట్ట అంచులకు నీరు చేరాయి. ఉత్తరచిరువోలులంక, కోసూరువారిపాలెం వద్ద ఉన్న పాత కరకట్ట వర్షాలకు గండ్లు పడి ఉండటంతో వరద నీరు చొచ్చుకుని గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉందని గ్రామస్థులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నుంచి ప్రజలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే బుద్దప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ తెలిపారు. అధికారులకు ప్రజలు సహకరించాలని తెలిపారు.

పొంగి పొర్లుతున్న లింగన్న కోడు

కోడూరు : వాయుగుండం ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కోడూరు మండల పరిధిలోని లింగన్నకోడు మురుగు డ్రెన్ పొంగి పొర్లుతుంది. సోమవారం ఉల్లిపాలెం శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయం వెనుక డ్రెన్ గట్టు తెగి పంట పొలాల్లోకి ప్రవహిస్తుంది. వెంటనే అప్రమత్తమైన స్థానిక రైతులు మట్టి మూటలతో గండిని కట్టేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ డ్రెన్ ఉధృతి అధికంగా ఉండటంతో డ్రైనేజీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పెరుగుతున్న వరద ఉధృతి

నాగాయలంక : నాగాయలంకలోని కృష్ణానదికి వరద ప్రవాహం గంట గంటకు పెరగటంతో తీర ప్రాంత గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నాగాయలంకలోని కరకట్ట కింద ఆవాస గృహాలలోకి వరద నీరు రావటంతో రెండు రోజుల క్రితమే ప్రజలను ఖాళీ చేయించి నాగాయలంక జడ్పీ పాఠశాలలోకి ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలోకి అధికారులు తరలించారు. నాగాయలంకలోని ఫుడ్ కోర్టు, సంపద క్రేందంలోకి భారీగా వరద వచ్చి చేరింది. ఏటిమొగ అవుట్ పాల్ స్లూయిస్ వద్ద వరద నీరు ఊట రావటంతో ఇసుక మూటలను వేసి కరకట్టను పటిష్టపర్చారు. ఎదురుమొండి - జింకపాలెం వెళ్లే రహదారి వరద నీటితో కోతకు గురయింది. మండల ప్రత్యేకాధికారి నిత్యానంద్, తహసీల్దార్ ఎం.హరనాథ్ బాబు పరిశీలించారు. నాచుగుంటలో వరద ప్రవాహం ఉప్పుకట్ట మీద నుంచి గ్రామంలోకి రావటంతో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఏసుపురంలోకి వరద నీరు రావటంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న గంజి కాలువ

ఘంటసాల : గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గంజికాలువ ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో డ్రైన్ పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలు నీటిముంపుకు గురయ్యాయి. ఘంటసాల మండల పరిధిలోని కొడాలి, కొత్తపల్లి, ఘంటసాలపాలెం, ఘంటసాల మీదుగా ప్రవహిస్తున్న గంజికాలువ బిరుదుగడ్డ వద్ద గుండేరు డ్రెన్‌లో కలుస్తుంది. గంజికాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క ఘంటసాల - మల్లంపల్లి రోడ్డులోని వంతెనకు అడ్డుగా పేరుకుపోయింది. దీంతో కాలువలో ప్రవహిస్తున్న నీటికి గుర్రపు డెక్క అడ్డంకిగా మారటంతో ఎగువన ఉన్న పంట పొలాలు నీటముంపుకు గురయ్యాయి. ఘంటసాల - చిలకలపూడి రోడ్డు కూడా జలమయం అయింది. గమనించిన అధికారులు ప్రొక్లెయినర్ సహాయంతో సోమవారం తొలగింపు చర్యలు చేపట్టారు.

కృష్ణానదికి వరద ఉధృతి కొనసాగు తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం తెల్లవారు జామునకే వరద నీరు ఉధృతం అవ్వటంతో గమనించిన రెవెన్యూ, పోలీసు అధికారులు శ్రీకాకుళం, పాపవినాశనం, గోగినేనిపాలెం గ్రామాల పరిధిలో ఉన్న ర్యాంప్‌ల వద్ద తమ సిబ్బందిని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశారు. కృష్ణానదిలోకి ఎవరిని వెళ్లకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ● కృష్ణానదికి వరద ఉధృతి నేపథ్యంలో పాపవి నాశనం గ్రామ పరిధిలోని శివ సిద్ధి కుండలిని యోగాశ్రమం వరద ముంపునకు గురైంది. యోగాశ్రమం ప్రాంగణంలో తాత్కాలిక నిర్మాణాలుపూర్తిగా మునిగి పోగా, పక్కా భవనం గ్రౌండ్ ఫ్లోర్ వరద నీటితో నిండిపోయింది.

శాంతించిన మునేరు

కంచికచర్ల / పెనుగంచిప్రోలు : ఉగ్రరూపం దాల్చి తీర గ్రామాల ప్రజలను గజగజ వణికించిన మునేరు ఎట్టకేలకు శాంతించింది. ఎగువ ప్రాంతం తెలంగాణా రాష్ట్రం ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు పడటంతో శనివారం రాత్రి మునేరుకు ఉధృతంగా వరద వచ్చింది. నందిగామ మండలం ఐతవరం వద్ద జాతీయ రహదారిపై విరుచుకుపడటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పలు తీర గ్రామాలను, వేలాది ఎకరాల పంటలను ముంచెత్తింది. రికార్డు స్థాయిలో వత్సవాయి మండలం పోలంపల్లి ఆనకట్ట వద్ద ఇరిగేషన్ అధికారుల లెక్కల ప్రకారం రికార్డు స్థాయి లో ఆదివారం మధ్యాహ్నం 2.50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. సోమవారం ఉదయం నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ఉదయం ఏడు గంటలకు 1.87 లక్షల క్యూసెక్కులున్న వరద, పది గంటలకు 82 వేల క్యూసెక్కులకు, సాయంత్రం నాలుగు గంటలకు లో 30 వేల క్యూసెక్కులకు తగ్గిపోయింది.


నాగాయలంక ఘాట్‌లో వరద ఉధృతి


డ్రెయిన్‌కు అడ్డుపడిన గుర్రపు డెక్క, తూడు

డ్రెయిన్లకు అడ్డంకిగా మారిన గుర్రపు డెక్క

కూచిపూడి : నాలుగు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా మొవ్వ మండలంలో వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీటమునిగాయి. ఐనంపూడి, గేదెల కోడు డ్రెయిన్లు దట్టంగా పేరుకు పోయిన గుర్రపు డెక్క కారణంగా వరద నీరు కిందకు వెళ్లకపోవటం ముంపుకు ప్రధాన కారణమైంది. కాజ వద్ద ఐనంపూడి డ్రెయిన్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను లింగమనేని రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా తొలగింపు చర్యలు చేపట్టారు. అయ్యంకి, చిన్నముత్తేవి, పెదముత్తేవి, కాజ, నిడుమోలు, కోసూరు, మొవ్వ పెదపూడి తదితర గ్రామాల్లో వరి పైరు నీటిపాలైంది. ● మొవ్వ మండలంలో 4500 ఎకరాల్లో వరి పొలాలు నీటమునిగినట్లు వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు. మొవ్వ సబ్ డివిజన్ ఏడిఏ శ్యామల, ఏవో శివప్రసాద్‌లు మండల పరిధిలోని పలు గ్రామాల్లో నీటమునిగిన పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

అర్ధరాత్రి పోటెత్తిన మునేరు

నందిగామ : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఉగ్రరూపం దాల్చిన మునేరు ఆదివారం అర్ధరాత్రి సమయంలో గ్రామాలను ముంచెత్తింది. ఉదయం నుండే ఉధృతంగా ప్రవహించిన మునేరు అర్ధరాత్రి సమయానికి పోటెత్తింది. దీంతో తీరగ్రామాలలోని నీరు చేరాయి. అర్ధరాత్రి సమయంలో ప్రజలు ఇళ్ల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సి వచ్చింది. ఇళ్లలోని దుస్తులు, ఇతర వంట సామాగ్రి పూర్తిగా నీట మునిగాయి. సోమవారం మధ్యాహ్నం వరకూ ఇదే పరిస్థితి కొనసాగింది. సాయంత్రం నుంచి మునేరు శాంతించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నందిగామ ఆర్‌డీఓ రవీంద్రరావు ఎప్పటికప్పుడు సహాయక చర్యలు పర్యవేక్షిస్తూ ప్రజలకు ధైర్యం చెప్పారు.

భవానీ ఐల్యాండ్ వర్షార్పణం

ఆంధ్రజ్యోతి, విజయవాడ/వన్‌టౌన్

కృష్ణానది మహోగ్రరూపంతో రాష్ట్రంలోని అతి ముఖ్యమైన పర్యాటక కేంద్రం భవానీ ఐలాండ్ వర్షార్పణమైంది. భవానీ ఐలాండ్‌కు అభిముఖంగా హరిత బెర్మ్‌పార్క్ కూడా వరద ముంపునకు గురైంది. భవానీఐలాండ్ భారీ విలయానికి గురైంది. గత 20 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ నీటమునగనంతగా భవానీ ఐలాండ్ మునిగిపోయింది. భవానీ ఐల్యాండ్‌లో ఉన్న 20 కాటేజీలు పూర్తిగా నీట మునిగాయి. గతంలో వరదల సమయంలో గ్రౌండ్ ఫ్లోర్‌కు మాత్రమే వరద వచ్చేది. ప్రస్తుతం ఫస్ట్ ఫ్లోర్‌కు కూడా వరద ఎగతన్నింది. దీంతో భవానీఐలాండ్ కృష్ణమ్మ వరద కోరల్లో చిక్కుకుంది. భవానీ ఐలాండ్‌కు అంతులేని నష్టం జరిగింది. భవానీ ఐలాండ్‌లో ఉన్న రోబోటిక్ పార్క్, మిర్రర్ మేజ్, మేజ్ గార్డెన్, రోజ్ గార్డెన్, ఫ్లవర్స్ గార్డెన్, బోట్స్ శాంచూరీ, వీడియో గేమ్స్ ఎరీనా, సెల్ఫీ పాయింట్స్, ఓపెన్ జిమ్, ఓపెన్ మ్యూజిక్ ఏరియా, ఫంక్షన్ హాల్, రెండు రెస్టారెంట్లు, సర్వం నీట మునిగిపోయాయి. వరదను దృష్టిలో పెట్టుకుని ఏపీ టీడీసీ అధికారులు ఖరీదైన ఫర్నిచర్‌ను కాటేజీల ఫస్ట్ ఫ్లోర్‌లోకి చేర్చినప్పటికీ భారీ వరద కారణంగా మొత్తం మునిగిపోయాయి. భవానీఐలాండ్‌లో ట్రీ టాప్ కాటేజీల పిల్లర్స్ అన్నీ కూడా పూర్తిగా మునిగిపోయాయి. ఇంకాస్త వరద పెరిగితే పైన ఉండే హెడ్ కాటేజీలు కూడా మునిగిపోతాయి. ద్వీపంలో ఉన్న జెట్టీలు వరదకు కొట్టుకుపోయాయి. బోట్లను మాత్రం అధికారులు రక్షించుకోగలిగారు. హరిత బరంపార్క్ ప్రాంగణంలోకి వరద నీరు 13 అడుగులకు చేరింది. ఇందులో ఉన్న 30 కాటేజీల్లో 15 కాటేజీలు వరద ముప్పుకు గురయ్యాయి. మరో 15 కాటేజీలకు వరద నీరు చేరింది. బోటింగ్ యూనిట్‌లోకి వరద వచ్చింది. ఫంక్షన్ హాల్‌లోకి వరద నీరు పెద్ద ఎత్తున చేరుకుంది. పార్కింగ్ ఏరియా,లాన్ ఏరియాలో మొత్తం వరద ప్రవహిస్తోంది. దీనివల్ల భవానీపురం, విద్యాధరపురం ప్రాంతాలు ముంపుకు గురై ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. సోమవారం ఉదయం 6.30 గంటలకే బరంపార్క్ నుంచి 65వ నెంబర్ జాతీయ రహదారి మీదకు వరద ఎగతన్నింది. బరంపార్క్‌లోని కార్యాలయాలు పూర్తిగా నీటమునిగాయి. కృష్ణానదిలో వరద నీరు జాతీయ రహదారి పైకి పారుదల కాకుండా ఉండటానికి సంబంధిత శాఖ అధికారులు ముందుగా అప్రమత్తమయ్యారు.

జగ్గయ్యపేట నుంచి బస్సులు నిలిపివేత

నేటి నుంచి కొనసాగనున్న రాకపోకలు



జగ్గయ్యపేట, సెప్టెంబరు 2: జగ్గయ్యపేట ఆర్టీసీ డిపోలో తుఫాన్, వరద ప్రభావంతో బస్సు సర్వీసులు అన్నింటిని రద్దు చేశారు. డిపోకు కీలకమైన విజయవాడ రూట్‌లో నందిగామ వద్ద ఐతవరం వద్ద రోడ్డు బ్లాక్ కావటంతో అటు వైపు సర్వీసులను రెండు రోజులుగా నిలిపివేశారు. జగ్గయ్యపేట నుంచి కోదాడ వైపు ఆంధ్రా, తెలంగాణా సరిహద్దు వద్ద హైవేపై పాలేటి వరద ఉధృతికి సర్వీసు రోడ్డు ధ్వంసం కావటంతో అటు వైపు సర్వీసులు నిలిపివేశారు. వైరా వైపు సర్వీసులు రద్దు అయ్యాయి. మంగళవారం నుంచి సర్వీసులు యథావిధిగా నడుస్తుయాని డీఎం తెలిపారు.

పాలు దొరక్క అవస్థలు

జగ్గయ్యపేటలో వరద ప్రభావం వల్ల ప్యాకెట్ పాలు రాకపోవటం, గ్రామాల నుంచి వచ్చే పాలు రాకపోవటంతో కొందరు వ్యాపారులు భారీగా పెంచి పాలు విక్రయించారు. జగ్గయ్యపేట లో ప్రధాన సరఫరా దారు అయిన విజయపాలు రాకపోవటంతో తెలంగాణా నుంచి వచ్చే ఒక ప్రైవేట్ డెయిరీ పాల వ్యాన్, ప్రైవేటు పాల వ్యాపారుల వద్ద అందుబాటులో ఉన్నాయి. ఒక్కసారిగా పాల కోసం జనం ఎగబడటం తో లీటర్ 100/- వరకు విక్రయించారు. 200మి.లీ పాల ప్యాకెట్‌ను రూ. 15లకు, అరలీటర్ పాల ప్యాకెట్‌లను రూ.45లకు విక్రయించారు. పాల కొరతతో టీ స్టాళ్ల రేట్లు పెంచేశాయి.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

నాగాయలంక, సెప్టెంబరు 2 : నాగాయలంక రేవు మధ్యలో లంగరు వేసిన పడవ వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దానిని తీసకు రావటానికి ఘాట్ నుంచి నలుగురు మత్స్యకారులు పడవలో వెళ్లారు. దానిని పట్టుకునే క్రమంలో ఆ నలుగురు నదిలో పడిపోయి ఈదుతున్నారు. ఇది గుర్తించిన మత్స్యకారులు నాగాయలంక ఘాట్ నుంచి మరో పడవలో మత్స్యకారులు వెళ్లి నదిలో ఈదుకుంటూ వెళ్తున్న నలుగురిని రక్షించి తమ బోట్లులో ఎక్కించుకున్నారు. దీంతో నలుగురు ప్రాణాలతో బయట పడ్డారు. దీంతో పెద్ద ముప్పువ తప్పటంతో మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు.

కొట్టుకుపోయిన బ్రిడ్జి

జగ్గయ్యపేట రూరల్, సెప్టెంబరు 2: గరికపాడు వద్ద పాలేటి నదిపై ఉన్న బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు ఆదివారం రాత్రి వరద నీటికి కొట్టుకుపోయింది. సమాచారం అందుకున్న ఎన్‌హెచ్ఏఐ ఇంజనీరింగ్ బృందం సోమవారం పరిశీలించారు. కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం పక్కనే ఉన్న కొత్త బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దెబ్బతిన్న అప్రోచ్‌ను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పాత బ్రిడ్జిపై భారీ వాహనాలను అనుమతించవద్దని తెలిపారు. ఈ పరిశీలనలో రీజనల్ కో- ఆర్డినేటర్ శివశంకర్, ఆర్‌వో సాయికుమార్, రెసిడెంట్ ఇంజనీర్ మాల్యాద్రి నాయుడు, ఆర్‌వి అసోసియేట్ కన్సల్టెంట్ బృందం పాల్గొన్నారు.

వేములమడలో కోతుల దాడి

కూచిపూడి, సెప్టెంబరు 2 : మొవ్వ మండలం వేములమడ దళితవాడలో కోతుల దాడిలో పలువురికి గాయాలయ్యాయి. వృద్ధులు, పిల్లలపై దాడులు చేసి గాయపరుస్తుండటంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. గాయపడిన వారు మొవ్వ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. గత వారం రోజుల నుంచి కోతులు పలుమార్లు దాడి చేసి గాయపర్చినట్లు గ్రామస్థులు వాపోయారు. సాలి నాంచారమ్మ, కొర్రపాటి కృష్ణమూర్తి తదితరులు కోతుల దాడిలో గాయపడ్డారు.

వినాయక వ్రతకల్పం పుస్తకాల ఆవిష్కరణ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 2 : హిందూ ధర్మ పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వేడుక ఫంక్షన్ హాలులో మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ వినాయక చవితి వ్రత కల్పం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు, సారంగపాణి, చంద్రశేఖర్, పి.వి. ఫణికుమార్, పంతం వెంకట గజేంద్రరావు, వడ్లమన్నాటి మారుతీదివాకర్, వర్రె రాజశేఖర్, సిహెచ్. లక్ష్మీప్రసూన తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త ఆందోళనను జయప్రదం చేయండి

గుడివాడ : పెట్రోలు, డీజిల్, నిత్యావసర ధరలు నిరసిస్తూ ఈ నెల 6వ తేదీన జరిగే కలెక్టర్ వద్ద దేశవ్యాప్త ఆందోళనను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కెవీవీ ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఏలూరు రోడ్డులోని కార్యాలయంలో ఆందోళన గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ప్రతి నియోజకవర్గంలో ఈ నెల 1 నుంచి 6వ తేదీ వరకు నిరసనలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 6వ తేదీ ప్రతి కలెక్టర్ కార్యాలయం నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, అర్హులైన వారందరికి రేషన్ కార్డు ఇవ్వాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని కోరుతూ ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి ప్రకాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలవాలి

నందిగామ రూరల్, సెప్టెంబరు 2: మండలంలోని ఐతవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై వరద నీరు ప్రవహిస్తుండటంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. దీంతో రహదారిపై ఉన్న డ్రైవర్‌లు, ప్రయాణీకులతో పాటు వరద ముంపు ప్రజలకు గ్రామంలోని సొసైటీలో మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు అల్పాహారం, మంచినీటి వసతి కల్పించారు. ● ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదేశాలతో మండలంలోని అంబారుపేట వైజంక్షన్ వద్ద టీడీపీ నాయకులు మండవ పిచ్చయ్య, శ్రీనివాసరావు, సురేష్, రంగ, సతీష్‌ల ఆధ్వర్యంలో ప్రయాణీకులు, వాహన చోదకులకు భోజనం ప్యాకెట్‌లు అందించారు. అన్నపూర్ణా సేవా సమితి ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాలలోని ముంపు (...) అల్పాహారం, భోజన ప్యాకెట్‌లను అందజేశారు. ఐతవరం వద్ద నిలిచిపోయన రాకపోకలను పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం రాత్రికి వరద తగ్గుముఖం పట్టడంతో ట్రైల్ రన్ అనంతరం అత్యవసర వాహనాలను అనుమతిస్తున్నట్లు ఆర్డీవో రవీంద్రరావు తెలిపారు.

కొండ చరియలు విరిగిపడి మృతి చెందిన

యువకుడి మృతదేహం కౌతరం తరలింపు

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 2 : విజయవాడలో ఇటీవల కొండ చరియలు విరిగి పడి ఇళ్ళు కూలిన దుర్ఘటనలో కౌతవరం గ్రామానికి చెందిన యువకుడు పెందుర్తి యశ్వంత్(21) మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కౌతవరానికి చెందిన యేసు ప్రసాద్, విజయలక్ష్మి దంపతుల కుమారుడు యశ్వంత్ విజయవాడలో స్నేహితునితో కలిసి అద్దె ఇంట్లో ఉండి హోటల్ మేనేజ్‌మెంట్ చదువుకొంటున్నాడు. శనివారం రాత్రి ఇంటిపై కొండ చరియలు విరిగి పడి ఇల్లు కూలిపోయింది. దీంతో శిథిలాల కింద పడి యశ్వంత్ మృతి చెందాడు. సోమవారం శిథిలాల నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు పోస్టుమార్టం చేయించి మృతదేహాన్ని కౌతవరం గ్రామంలో తల్లిదండ్రులకు అప్పగించారు. ఎదిగొచ్చిన కొడుకు ఇలా తిరిగిరాని లోకాలకేగిపోవడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. కుమారుని భౌతికకాయాన్ని చూసి గుండలవిసేలా రోదించారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

● జిల్లా కలెక్టర్ బాలాజీ ఆదేశం

తోట్లవల్లూరు, సెప్టెంబరు 2 : వరద బాధితులకు పునరావాస కేంద్రాల్లో నాణ్యమైన భోజనం అందించాలని, నిరంతర విద్యుత్, ఫ్యాన్లు, దోమల మ్యాట్లు అందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. తోట్లవల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం అధికారులతో సమీక్షా జరిపారు. ఎన్ని పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు, ఎంతమందిని తరలించారు, వారికి ఎలాంటి సహాయ చర్యలు చేపట్టారు అని తెలుసుకున్నారు. లంక గ్రామాల నుండి అందరిని పూర్తిగా సహాయ శిబిరాలకు తీసుకు రావాలని సూచించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, తహసీల్దార్ ఎం కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన ఇంటర్నెట్ సేవలు

జగ్గయ్యపేట, సెప్టెంబరు 2: ప్రఖ్యాత మొబైల్ కంపెనీల ఇంటర్నెట్ సేవలు అందక పోవటంతో పట్టణంలో మొబైల్ ఫోన్‌లతో పాటు, బ్యాంకింగ్ సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రధాన సర్వీస్ ప్రొవైడర్ల సిగ్నల్స్ లేకపోవటంతో ఫోన్‌లు మూగనోము పట్టగా, యూనియన్ బ్యాంకులో ఏకంగా నెట్ లేకపోవటంతో సర్వర్ పనిచేయక బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలిగినట్టు బోర్డు ఏర్పాటు చేశారు.

కనిగిరిలంకలో

పడవ బోల్తా : 8 మంది సురక్షితం

తోట్లవల్లూరు, సెప్టెంబరు 2 : తోట్లవల్లూరు మండలం ఐలూరు శివారు కనిగిరిలంక వద్ద సోమవారం వరద ప్రవాహానికి పడవ బోల్తా కొట్టింది. ఈ పడవలో రెవెన్యూ సిబ్బంది ఒకరు, మరో ఏడుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. ములకలపల్లిలంక నుంచి కనిగిరిలంక వెళుతుండగా వరద ఉరవడికి పడవ బోల్తా కొట్టింది. ఒడ్డుకు దగ్గర్లోనే కావటంతో పడవలో ఉన్న 8 మంది చెట్ల కొమ్మలను పట్టుకుని కొట్టుకుపోకుండా కాపాడుకోగలిగారు. ఆ తరువాత సమాచారం అందుకుని అధికారులు వేరే పడవను పంపి చెట్ల కొమ్మలపై ఉన్న 8 మందిని ఒడ్డుకు చేర్చారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	117, 126, 137
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.95

యుద్ధ ప్రాతిపదికన కరకట్ట పటిష్టతకు చర్యలు

● కరకట్టను పరిశీలించిన ఎంపీ బాలశౌరి


కరకట్టను పరిశీలిస్తున్న ఎంపీ, కూటమి నేతలు

కోడూరు, సెప్టెంబరు 2 : కోడూరు మండలం ఉల్లిపాలెం వద్ద కృష్ణానది కరకట్ట బలహీనపడిన నేపథ్యంలో దాదాపు 120 మీటర్లు పొడవునా కర కట్ట బలోపేతం చేసే పనులు చేపట్టారు. ఆదివారం రాత్రి ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ రాత్రి పరిశీలించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఈ పనులను సోమవారం మధ్యాహ్నం మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, మండలి వెంకట్రామ్, శీలం అశ్విని కుమార్, డ్రైనేజీ శాఖ ఈఈ ఆర్.విజయలక్ష్మి, ఇరిగేషన్ డిఈఈ రావెళ్ల రవికిరణ్, తహసీల్దార్ శ్రీను నాయక్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పనులను పరిశీలించారు.

విజయవాడకు 80 మర పడవలు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 2 : రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఆబ్కారీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు మేరకు మచిలీపట్నం నుంచి విజయవాడలో చిక్కుకున్న బాధితులను ఆదుకునేందుకు 80 మర పడవలు తీసుకువెళుతున్నట్లు టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ తెలిపారు. విజయవాడలో బుడమేరు వరద తాకిడికి గురైన బాధితులను ఆదుకునేందుకు మచిలీపట్నం నుంచి పడవల్లో మత్స్యకారులు ఆహార పదార్థాలతో వెళుతున్నారని గోపీచంద్ తెలిపారు.

ముంపు పొలాలను పరిశీలించిన అధికారులు

పామర్రు, సెప్టెంబరు 2 : భారీ వర్షాలకు మండల పరిధిలో ముంపునకు గురైన వరి పంట పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు సోమవారం స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. మండల పరిధిలోని రాపర్ల, పామర్రు, ఉండ్రపూడి, నిమ్మకూరు, నిభానుపూడి తదితర గ్రామాల్లో పంట పొలాలు పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. కెజ్యోతిరమణి, కెశ్రీనివాసరావు బిపద్మజ, డిసుధారాణి జెపద్మావతి మంజువాణి తదితర బృందం పాల్గొన్నారు. **పెదపారుపూడి :** పెదపారుపూడి మండల పరిధిలో గల వెంట్రప్రగడ పెదపారుపూడి గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. **మచిలీపట్నం టౌన్ :** భారీ వర్షాలకు ముంపుకు గురైన వరిపొలాలకు ప్రభు త్వం నష్ట పరిహారం చెల్లించాలని టీడీపీ కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ , మాజీ ఎంపిపి కాగిత వెంకటేశ్వరరావులు డిమాండ్ చేశారు. బం దరు మండలం చిన్నాపురం, పెదయాదర, చినయాదర, సీతామపురం, సుల్తానగరం, ఎస్ఎన్‌గొల్లపాలెం. అరిసేపల్లి గ్రామాల్లో ముంపునకు గురైన పంట పొలాలను టీడీపీ నాయకులు సందర్శించారు.

పోరాట యోధుడు పవన్‌కల్యాణ్


కేకు కట్ చేస్తున్న ఎంపీ బాలశౌరి, బండి రామకృష్ణ, కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 2 : పోరాట యోధుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అందరికీ ఆదర్శమని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం జనసేన నియోజకవర్గ కార్యాలయం వద్ద జరిగిన రక్తదాన శిబిరాన్ని వల్లభనేని బాలశౌరి ప్రారంభించారు. మొక్కలు పంపిణీ చేశారు. బాలశౌరితో పాటు మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి, జనసేననగర అధ్యక్షుడు గడ్డ రాజు, టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, వాలిశెట్టి తిరుమలరావు, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, పి.వి. ఫణికుమార్ కేకు కట్ చేశారు.● సినిమాల్లోనే కాకుండా అన్ని సీట్లు విజయం సాధించి రాజకీయాల్లో కూడా పవన్‌కళ్యాణ్ హీరో అనిపించుకున్నారని సీనియర్ న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్వీట్లు పంచారు.

● గూడూరు మండలం ఆకులమన్నాడులో ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్‌తో పాటు పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కూచిపూడి : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలను కూచిపూడి, పెదపూడి గ్రామాల్లో కూటమి నేతలు సోమవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర, రామిశెట్టి రాజీవ్ ప్రసాద్, వెన్నం సాయితేజ, పామర్తి బాలశ్రీను, పరుచూరి రాజా, తాతా ప్రభాకర్‌రావు, వీరంకి తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం : నెట్టెం


భారీ వర్షాలకు పెనుగంచిప్రోలు చెరువు అలుగు వద్ద తెగిపోయిన రోడ్డును పరిశీలిస్తున్న మాజీ మంత్రి నెట్టెం రఘురామ్

పెనుగంచిప్రోలు, సెప్టెంబరు 2 : తుఫాన్ బాధితులను రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా ఆదుకుంటుందని మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ పేర్కొన్నారు. భారీ వర్షాల వల్ల పెనుగంచిప్రోలు చెరువు అలుగు వద్ద సుబ్బాయిగూడెం క్రాస్ రోడ్డు వద్ద దెబ్బతినప్న రహదారులను నెట్టెం రఘురామ్ స్థానిక దేశం నేతలతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య, పార్టీ నాయకులు కర్ల వెంకట నారాయణ, గజ్జి కృష్ణమూర్తి, కాకాని శ్రీనివాసరావు, జిల్లేపల్లి సుధీర్‌బాబు, నల్లపునేని కొండ, ముండ్లపాటి ప్రభాకర్‌రావు, జిల్లా తెలుగుయువత మాజీ అధ్యక్షులు వెల్ది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఆత్కూరు చెరువు కట్ట వద్ద రహదారికి ఏర్పడిన భారీ గండి

చెరువులకు గండ్లు.. దెబ్బతిన్న రహదారులు

మైలవరంరూరల్, సెప్టెంబరు 2 : పలు చెరువులకు గండ్లు పడటంతో వరద ధాటికి రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. జంగాలపల్లి సమీపంలోని చెరువుకు గండి పడటంతో చంద్రగూడెం-జంగాపల్లి గ్రామాల మధ్య రహదారి వరదకు పూర్తిగా కొట్టుకుపోయింది. చంద్రాల సమీపంలోని చెరువు కట్ట తెగిపోవడంతో వరద నూజివీడు-మైలవరం ఆర్‌అండ్‌బీ రహదారిపై పడింది. వరద ధాటికి ఆర్‌అండ్‌బీ రహదారి పూర్తిగా దెబ్బతింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువు కింద పొలాలు నీటమునిగాయి. కొత్తచెరువు నిండటంతో కట్ట కోతకు గురైంది. వెల్వడం అడ్డరోడ్డు సమీపంలోని చెరువుకు గండిపడి వరద మొత్తం సమీపంలోని పంట పొలాలపై పడటంతో వరి, పత్తి పొలాలు మునిగిపోయాయి. వరి పొలాలు నీటమునిగాయి.

ఇబ్రహీంపట్నం: నిత్యం వాహనాల రణధ్వని ఘోషతో రద్దీగా ఉండే విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారి కాస్త కృష్ణానది వరద బాధితులకు ఆవాసంగా మారిపోయింది. ఏటిపట్టు గ్రామాలతో పల్లపు ప్రాంతాల్లో వరదకు ముంపు బారిన పడి సర్వస్వం కోల్పోయిన వారు 65 జాతీయ రహదారిపైకి చేరుకున్నారు. జాతీయ రహదారిపై ఎక్కడ చూసినా నిరాశ్రయులే.



పూర్తిగా కొట్టుకుపోయిన చంద్రగూడెం-జంగాపల్లి రహదారి



చెరువును తలపిస్తున్న గుండల రహదారి

జలవిలయం

- బుడమేరు వరద మళ్లింపు కాలువకు 10 చోట్ల భారీ గండ్లు
- ఒక వైపు గండ్లు - మరో వైపు రెగ్యులేటర్ గేట్లు ఎత్తడంతో పల్లపు ప్రాంతాలను ముంచెత్తిన వరద
- బెజవాడను చుట్టుముట్టిన సుమారు 35 వేల క్యూసెక్కుల వరద నీరు



జలదిగ్బంధంలో బుడమేరు పరీవాహక ప్రాంతాలు

జి.కొండూరు, సెప్టెంబరు 2 : విజయవాడ పల్లపు ప్రాంతాలు ముంపు బారిన పడేందుకు.. వేల మంది నిరాశ్రయులయ్యేందుకు గండ్లే ప్రధాన కారణం. విజయవాడ దుఃఖదాయనిగా పేరున్న బుడమేరుకు వరద వస్తే దాని పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాలతో పాటు విజయవాడ పల్లపు ప్రాంతాల ప్రజలకు కంటి మీద కునుకుండదు. గడిచిన 40 ఏళ్లలో బుడమేరుకు ఆ స్థాయిలో వరద వచ్చింది లేదు. దీంతో ఇటు అధికారులు, ఇటు ప్రజలు బుడమేరు వరదను లైట్‌గా తీసుకున్నారు. తుఫాన్ కారణంగా రెండ్రోజులు కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహించి బుడమేరుకు 35 వేల క్యూసెక్యుల వరద వచ్చి చేరింది. వరదను బీడీసీ ద్వారా మళ్లించడంతో ఎడమ వైపు ఉన్న కట్టకు కవులూరు - శాంతినగర్ గ్రామాల మధ్య మూడుచోట్ల (వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద నుంచి 3.5 కిలో మీటర్ల నుంచి 4.2 కిలో మీటర్ల మధ్యలో) భారీ గండి పడింది. కుడి వైపు కట్టకు ఏడుకు పైగా గండ్లు పడ్డాయి. సైఫన్లు ఉన్న ప్రతి చోట్ల కుడివైపు కట్టకు భారీ గండ్లు పడ్డాయి. కృష్ణా నదికి చేరాల్సిన వరద మొత్తం విజయవాడ వైపు ఉన్న గండ్ల నుంచి వరదనీరు, వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ 11 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేసిన వరద నీరు కవులూరు, ఈలప్రోలు, పైడూరుపాడు, కొత్తూరు తాడేపల్లి, భవానీపురం, గొల్లపూడి, జక్కంపూడి, రాయనపాడు గ్రామాలతో పాటు విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతాన్ని ముంచెత్తింది.

సైఫన్లు ఉన్న చోటల్లా గండ్లు

బీడీసీకి ఎగువ భాగంలో ఉన్న గ్రామాల్లో ప్రవహించే గుర్రాలవాడు, తొమ్మండ్రు వాగుల వరద బీడీసీ కాలువ కుడివైపు నుంచి ఎడమ వైపుకు దాని కింద నుంచి బయటకు వెళ్లేందుకు మూడు చోట్ల సైఫన్లు ఏర్పాటు చేశారు. సైఫన్లు ఉన్న కుడిపైపు కట్టకు గండ్లు పడ్డాయి. అవి కాక కుడి వైపు మరో నాలుగు చోట్ల గండ్లు పడ్డాయి. ఎడమ వైపు మాత్రం మూడు చోట్ల పెద్ద పెద్ద గండ్లు పడ్డాయి.

బీడీసీకి గండ్లు గత ప్రభుత్వ నిర్లక్ష్యమే

గత వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి రంగాన్ని పూర్తిగా విస్మరించారు. అసలు బుడమేరు అధికారులు కాని తారకరామా అధికారులు కాని వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ గురించి కాని బీడీసీ గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం కట్టల బలోపేతానికి ఒక్క పైసా కూడా విడుదల చేసింది లేదు. టీడీపీ హయాంలో 2016 కట్టలపై జంగిల్ క్లీయర్ చేసి గ్రావెల్‌తో కట్టలను బలోపేతం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాలువ వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. టీడీపీ హయాంలో కట్టలు బలోపేతం చేయకుండా ఉంటే ఎప్పుడో ఈకట్టలు తెగి కవులూరుతో పాటు పలు గ్రామాల కనిపించకుండా పోయేవని పలువురు రైతులంటున్నారు.

1959లో వెలగలేరు హెడ్ రెగ్యులేటర్

గంపలగూడెం నారికంపాడు కొండల్లో బుడమేరుకు ఒక పాయ పుడుతుంది. మరో పాయ రెడ్డిగూడెం మండలం నుంచి పుడుతుంది. ఇలా రెండు పాయలుగా వచ్చే బుడమేరు జి.కొండూరు మండలం చిన్ననందిగామ గ్రామం వద్ద ఏకపాయగా మారి రెడ్డిగూడెం వైపు నుంచి వచ్చే కోతుల వాగును, జి.కొండూరు వైపు నుంచి పులివాగు ఉధృతితో వెలగలేరు వద్ద పోటెత్తుంది. అలా వచ్చే భారీ వరద నుంచి నుంచి విజయవాడ పల్లపు ప్రాంతాలను రక్షించేందుకు వెలగలేరు గ్రామాల మధ్య 8 వేల క్యూసెక్కులు డిచ్ఛార్జ్ చేసేలా హెడ్ రెగ్యులేటర్‌ను డిజైన్ చేసి నిర్మాణం చేశారు. వరద ఉధృతికి బీడీసీ కట్టలు తెగే పరిస్థితి వస్తే రెగ్యులేటర్ గేట్లు ఎత్తి దిగువకు వరదను విడుదల చేస్తారు. దివంగత మాజీమంత్రి చనమోలు వెంకట్రావ్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మరో రెండు వేల క్యూసెక్కుల సామర్థ్యం పెంచి 10 వేల క్యూసెక్కులు డిశ్చార్జ్ అయ్యేలా చేశారు.

అక్రమణల వల్లే ఈ దుస్థితి

వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద నుంచి బుడమేరు కాలువ దిగువ భాగంలో బుడమేరు ఆక్రమణలకు గురయింది. ఇక్కడి నుంచి బుడమేరు విజయవాడ సింగ్‌నగర్ మీదుగా కృష్ణాజిల్లాలోని కొల్లేరు సరస్సులో కలుస్తుంది. అయితే కాలువ అనేక ప్రాంతాల్లో ఆక్రమణలకు గురి కావడం వల్లే దిగువకు విడుదల చేస్తున్న వరద నేరుగా కొల్లేరులో కలవకుండా విజయవాడలో పల్లపు ప్రాంతాలను ముంచెత్తుతోంది. గతంలో సీఎంగా ఉండగా చంద్రబాబు బుడమేరును రెగ్యులేటర్ దిగువ భాగం నుంచి ప్రక్షాళనకు ప్రణాళికలు సిద్ధం చేయించారు. ఈ వరదలను చూసైనా అధికారులు, ఆపాలకులు కళ్ల తెరవకుంటే మరో మారు విజయవాడ పల్లపు ప్రాంతాలకు ముంపు గండం తప్పదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



లింగాల వద్ద మునేరు కాజ్‌వేపై ఐదడుగుల మేర ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

జనజీవనం అస్తవ్యస్తం

వత్సవాయి : గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల జనజీవనం స్తంభించింది. పోలంపల్లి ఆనకట్ట వద్ద 14 అడుగుల నీరు ప్రవహిస్తున్నది. లింగాల కాజ్‌వేపై ఐదడుగుల మేర వరద ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కాజ్‌వే పూర్తిగా నీట మునిగింది. వందలాది వాహనాలు నిలిచిపోయాయి. గ్రామాల్లోని చెరువులకు గండ్లు పడ్డాయి. వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వర్షపు నీరు పంట పొలాల్లో నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.



కర్రల సాయంతో వరద నుంచి బాలింతను ఒడ్డుకు చేరుస్తు..



బుడమేరు వరద నీటిలో గుండల వద్ద ప్రజల అవస్థలు





బురద నుంచి పున్నయ్య మృతదేహాన్ని వెలికితీస్తున్న కుమారులు

గల్లంతైన వారి ఆచూకీ లభ్యం



కృష్ణారెడ్డి

ఎ.కొండూరు/మైలవరం రూరల్ : వాగులో పడి గల్లంతైన వారి ఆచూకీ లభ్యమైంది. ఎ.కొండూరు మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఆర్ల పున్నయ్య(68) గేదల కాసేందుకు వెళ్లి శనివారం సాయంత్రం ఇంటికి వస్తు పెద్దవాగు దాటే ప్రయత్నంలో వరద ఉధృతికి గల్లంతయ్యాడు. ఆదివారం గ్రామస్థులు, కుటుంబసభ్యులు వెతికినా ఫలితం లేదు. మృతుని కుమారులు సోమవారం ఉదయం చెట్ల మధ్యలో చిక్కుకుని బురదలో ఉన్న మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. మృతుడికి భార్య, ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బుడమేరు, పంగిడి చెరువు సమీపంలో వరద నీటిలో కొట్టుకుపోయిన మృతదేహాలు సోమవారం లభ్యమయ్యాయి. అనంతవరానికి చెందిన తుపాకుల వెంకటేశ్వరరావు (65) శనివారం గేదెల మేత కోసం పంగిడి చెరువు సమీపంలోకి వెళ్లి రాత్రికి ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం వెంకటేశ్వరరావు మృతదేహం పంగిడి చెరువులో లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బుడమేరులో కొట్టుకుపోయిన వెల్వడంకు చెందిన శెట్టిపల్లి కృష్ణారెడ్డి(45) మృతదేహం చిన్ననందిగామలోని పంట పొలాల్లో లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రిటైనింగ్ వాల్ ఘనత టీడీపీదే!

- తొలి దశ నిర్మాణం 2016లో ప్రారంభం
- 2.37 కిలోమీటర్లు 2018లోనే పూర్తి
- వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు, మూడు దశలకు బ్రేక్
- టీడీపీ ఆందోళనలతో ఎట్టకేలకు ఎన్నికలకు ఏడాది ముందు పూర్తి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

విజయవాడ కనకదుర్గ వారధి వద్ద ఇరిగేషన్ రిటైనింగ్ వాల్ నిర్మాణంతో కృష్ణలంక, రామలింగేశ్వనగర్ తదితర ప్రాంతాలు వరద ముంపు నుంచి బయటపడ్డాయి. ఈ రిటైనింగ్‌వాల్ ఘనత తమదేనని చెప్పుకునేందుకు వైసీపీ నానా అవస్థలు పడుతోంది. వాస్తవానికి కరకట్ట గోడను టీడీపీ హయాంలోనే సగానికిపైగా పూర్తి చేశారు. మొత్తం 4.7 కిలోమీటర్ల వాల్ నిర్మాణం మూడు ఫేజ్‌లలో నిర్మాణం చేయాల్సి ఉంది. మొదటి ఫేజ్ 2.37 కి.మీ. యనమలకుదురు నుంచి గీతానగర్ కట్ట వరకు రూ.165 కోట్లు, రెండో ఫేజ్ 1.23 కి.మీ. గీతానగర్ కట్ట నుంచి వారధి వరకు రూ.126 కోట్లు, మూడో ఫేజ్ 1.01 కి.మీ వారధి నుంచి పద్మావతి ఘాట్ వరకు రూ.110 కోట్లతో టీడీపీ హయాంలో 2016లోనే అంచనాలు తయారు చేయించారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో నిధులు మంజూరు చేయించి మొదటి దశ (2.37 కి.మీ) నిర్మాణం చేయించింది ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్. ఆ తర్వాత 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రెండో దశ నిర్మాణ పనులను చాలాకాలం ప్రారంభించలేదు. దీంతో టీడీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి. కృష్ణానది ఇసుకతిన్నెలలో 2021లో గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలో భారీ ఆందోళన కార్యక్రమం జరిగింది. దీంతో దిగి వచ్చిన వైసీపీ సర్కార్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఏడాది ముందు హడావిడిగా కరకట్ట పనులు మొదలుపెట్టి పూర్తి చేసింది. పనిలో పనిగా అంచనాలను అదనంగా రూ.50 కోట్లు పెంచి నిర్మాణ పనులు చేపట్టారు. రెండు, మూడో దశ పనులు పూర్తి చేశారు.



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సుజనాచౌదరి, కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు

అధైర్యం వద్దు.. అండగా ఉంటా

- ఎమ్మెల్యే సుజనా చౌదరి

చిట్టినగర్ : విపత్కర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు ధైర్యంగా ఉండాలని, అధైర్యపడవద్దని అండగా ఉంటానని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. పశ్చిమలో నీటమునిగిన ప్రాంతాలలో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. చిట్టినగర్, కె.ఎల్.రావునగర్, పాలఫ్యాక్టరీ ప్రాంతాల్లో ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు ధైర్యంగా ఉండాలని సూచించారు. దురదృష్టవశాత్తు కొన్ని చోట్ల ప్రాణనష్టం సంభవించిందని, ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలన్నారు. మరో 24 గంటల్లో నీటి ప్రవాహం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బాధితులకు ఆహారాన్ని అందించేందుకు కార్యాలయ సిబ్బంది నిరంతరం పాటుపడుతున్నారు. ఎవరు అధైర్యపడవద్దని బాధితులకు భరోసా ఇచ్చారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఎమ్మెల్యేతోపాటు బీజేపీ నగర అధ్యక్షులు సుజనా చౌదరి, కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు జి.వెంకట ప్రసాద్(అన్న) తదితరులు ఉన్నారు.

హైకోర్టు సూచనల ప్రకారమే.. ఆలయ ట్రస్టుబోర్డు నియామకాలు

- దేవదాయ శాఖ జేసీ చంద్రశేఖర్ అజాద్

విజయవాడ, సెప్టెంబరు 2 : ఆలయాల ట్రస్ట్ బోర్డుల నియామకాలు హైకోర్టు సూచనలకు అనుగుణంగానే జరిగాయని, ఎక్కడా నిబంధనలకు విరుద్ధంగా బోర్డుల నియామకాలు జరగలేదని దేవదాయశాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. ఆలయాల బడ్జెట్, ట్రస్ట్ బోర్డు నియామకాలపై 2022 ఆగస్టు 29, 30 తేదీల్లో ప్రచురితమైన కథనాలపై ఆయన వివరణ ఇచ్చారు.

ప్రకాశం జిల్లా మార్కాపురం విష్ణుఆలయంలో అనుమతి లేకుండా ఎలాంటి విరాళాల తీసుకోలేదని వివరించారు. ఆలయాల బడ్జెట్ ప్రతిపాదనలు కూడా సమయానికి అనుగుణంగానే ఆమోదం తెలిపారని, ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగానే ఆలయాలకు బడ్జెట్ కేటాయింపులు జరిగినట్లు తెలిపారు. తాము నిబంధనలకు అనుగుణంగానే విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆ కథనాలను ఆయన ఖండించారు.

పాలకులకు పట్టని మునేటి వంతెన!

- కాగితాలకే పరిమితమైన హైలెవల్ వంతెన
- వరదతో రాకపోకలకు తీవ్ర అంతరాయం



కంచికచర్ల : కీసర వంతెన - ఐతవరం గ్రామాల మధ్య 65వ నెంబరు జాతీయ రహదారిపై హైలెవల్ వంతెన ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. మునేరు ఉగ్రరూపం దాల్చినపుడల్లా జాతీయ రహదారి బంద్ అవుతుండటంతో రోజుల తరబడి వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు, వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ వంతెన విషయమై నేషనల్ హైవే అథారిటీ అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

తెలంగాణా రాష్ట్రం ఉమ్మడి వరంగల్ జిల్లా పాకాల చెరువు నుంచి మునేరు ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి ఖమ్మం జిల్లా మీదుగా ప్రవహిస్తూ, వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద ఎన్‌టీఆర్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు మండలాల మీదుగా ప్రవహిస్తూ మున్నలూరు, ఏటూరు గ్రామాల మధ్య కృష్ణానదిలో కలుస్తున్నది. ఎగువ ప్రాంతం ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసినపుడు మునేరుకు భారీ వరద వస్తున్నది. నందిగామ - విజయవాడ మధ్య 2004లో జాతీయరహదారిని నాలుగులైన్లుగా విస్తరించిన తర్వాత మొదటిసారిగా 2005లో మునేరు ఉగ్రరూపం దాల్చింది. 2.14 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. నందిగామ మండలం ఐతవరం గ్రామం సమీపంలో రోడ్డెక్కటంతో పటిష్ఠంగా నిర్మించిన కొత్త రోడ్డు నామరూపాలు లేకుండా ధ్వంసమైంది. అప్పట్లోనే కీసర - ఐతవరం మధ్య హైలెవల్ వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన తెర మీదకు వచ్చినప్పటికీ, హైవే అథారిటీ అధికారులు పెద్దగా స్పందించలేదు. ఒకటో తేదీన మునేరు ఉగ్రరూపాం దాల్చటంతో జాతీయ రహదారి బంద్ అయింది. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇతర మార్గాల్లో వాహనాలను మళ్లించినప్పటికీ లారీలు, భారీ వాహనాల సిబ్బంది, బస్సుల్లోని ప్రయాణీకులు పలు ఇబ్బందులు పడుతున్నారు.

వరద మధ్యలో మెరక ప్రాంతంలో 40కి పైగా వాహనాలు ఇరుక్కుపోయాయి. అయితే వరద ఉధృతికి ఆరు కార్లు కొట్టుకుపోయాయి. ఇప్పటికైనా కీసర వంతెన - ఐతవరం గ్రామం మధ్య హైలెవల్ వంతెన నిర్మించాల్సి ఉంది. హైవే అధికారులు పట్టించుకోకపోవటం వల్లనే వరద వచ్చినపుడల్లా తీవ్ర నష్టం జరుగుతున్నదని రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, మునేరు వల్ల ట్రాఫిక్ నిలిచిపోకుండ కీసర-ఐతవరం గ్రామాల మధ్య వంతెన లేదా వరద నీరు సాఫీగా వెళ్లేలా ఎక్కువ అండర్‌పాస్‌లతో ఫ్లైఓవర్ నిర్మించాల్సిందిగా ఆయన ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

వరద ముంపులో ఏటి పట్టు గ్రామాలు

- ఇబ్రహీంపట్నం రింగ్‌ను తాకిన కృష్ణమ్మ
- ఆర్టీసీ మొత్తం వరద నీటిలోనే
- పూర్తిగా మునిగిపోయిన బస్సులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 2 : కృష్ణానదికి వస్తున్న వరదతో ఇబ్రహీంపట్నం మండలంలోని ఏటి పట్టు గ్రామాలతో పాటు విజయవాడ - హైదరాబాద్ పక్కన ఉన్న గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. దాములూరు, చిలుకూరు దొనబండ, కొటికలపూడి, మూలపాడు, జూపూడి, కిలేశపురం, గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం గ్రామాలతో పాటు ఫెర్రీ మొత్తం నీట మునిగింది. ఇబ్రహీంపట్నం రింగ్‌కు కేవలం 10 అడుగుల దూరం వరకు వరద వచ్చి ఆగింది. మూలపాడు, కేతనకొండ, పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద జాతీయ రహదారి పైకి వరద నీరు చేరుకుంది. ఫెర్రీతో పాటు పలు పల్లపు ప్రాంతాల్లో లంక గ్రామాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాలలో ఉంచారు. ఇబ్రహీంపట్నం డిపో మొత్తం వరద నీటిలో చిక్కుకుంది. జాతీయ రహదారి దక్షిణం వైపు నుంచి వరద నీరు పలు సైఫన్ల ద్వారా పల్లపు ప్రాంతంలో రోడ్డు మీదకు చేరి ఆర్టీసీ డిపోను ముంచేసింది. దీంతో పలు బస్సులు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి.

పడవ ఎక్కాలంటే రూ. 2వేలు

వరదల్లో చిక్కుకున్న వారిని పడవల్లో ఎక్కించుకొని జాతీయ రహదారిపైకి తీసుకువచ్చేందుకు ఒక్కొక్కరికీ రూ.2 వేలు వసూలు చేస్తున్నారు బోట్ల నిర్వాహకులు. ప్రాణభీతి ఉన్న వారు బోట్ల నిర్వాహకులు అడిగినంత ఇచ్చి జాతీయ రహదారిపైకి వచ్చేస్తున్నారు.



ఫెర్రీ నీట మునగడంతో రోడ్డుపైనే బాధితులు

మేత లేక అల్లాడుతున్న పశువులు

వరద కారణంగా పశుగ్రాసం లేక మూగ జీవాలు అల్లాడిపోతున్నాయి. మూడు రోజులుగా మేత లేక పశువులు విలవిల్లాడుతున్నాయి. ఉన్న ఎండి మేత మొత్తం వరదలకు కొట్టుకుపోగా పచ్చి మేత దొరకని పరిస్థితి నెలకొంది.

పిల్లా జల్లాతో రోడ్ల మీద

వరద కారణంగా ఇబ్రహీంపట్నం మండలంలో వేల సంఖ్యలో జనం నిరాశ్రయులయ్యారు. పిల్ల జెల్లాతో కుటుంబం మొత్తం జాతీయ రహదారిపై బిక్కు బిక్కుమంటూ గడుతుపుతున్నారు.

ప్రాణ నష్టం లేకుండా చేయటమే కర్తవ్యం

- వరద బాధితులతో బీసీ సంక్షేమ మంత్రి సవిత

తోట్లవల్లూరు, సెప్టెంబరు 2 : కనీవిని ఎరుగని రీతిలో విరుచుకుపడిన వరదల నుండి లంక గ్రామాల ప్రజలను ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా పునరావాస కేంద్రాలకు తరలించటమే ప్రథమ కర్తవ్యమని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖా మంత్రి ఎస్.సవిత అన్నారు. తోట్లవల్లూరు, వల్లూరుపాలెం గ్రామాల్లో సోమవారం మంత్రి, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తదితరులతో కలిసి పర్యటించారు. గృహాలు పూర్తగా మునిగిపోయాయని, కట్టుబట్టలతో వచ్చేశామని, తమ పిల్లల పుస్తకాలు కూడా వరదకు అలాగే వదిలేశామని పలువురు పాములలంక మహిళలు మంత్రితో చెప్పి కన్నీరు పెట్టుకున్నారు. దీంతో చలించిన మంత్రి సవిత వారి కన్నీటిని తుడిచి ఎలాంటి భయము వద్దని, ఒక విపత్తు వచ్చిందని, దానిని ధైర్యంగా ఎదుర్కొని నిలబడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా వరదల్లో పర్యటిస్తున్నారని, బాధిత ప్రజలకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నారని మంత్రి అన్నారు. పునరావాస కేంద్రాల్లో బాధితులను పలుకరించటమే కాకుండా రేవుల వద్దకు వెళ్ళి లంకల నుండి వస్తున్న ప్రజలను పలుకరించి మంత్రి ధైర్యం చెప్పారు.



బాధితురాలిని ఓదారుస్తున్న మంత్రి

హిడెన్ కెమెరాల అభియోగంపై విచారణ వేగవంతం

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 2 : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరాల అభియోగంపై విచారణ వేగవంతం చేశారు. ఆదివారం వరకూ జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో సాగిన విచారణ సోమవారం ముగ్గురు డీఐజీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక సీడీఏసీ బృందం సోమవారం బాలికల హాస్టల్‌లో వాష్‌రూమ్స్‌తో పాటు కళాశాల వైఫై సర్వీసెస్, కేంద్ర సర్వర్‌ను గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో జరిగిన నెట్వర్క్ ట్రాన్సాక్షన్లను జల్లెడపట్టారు. ఉదయం 10 గంటల నుంచి 5 గంటల పాటు ఐటి నిపుణులు తనిఖీలు నిర్వహించినట్టు సమాచారం. ఇప్పటికే 10 మంది విద్యార్థులను పోలీసులు విచారణ చేసినట్టు సమాచారం. సోమవారం కళాశాలలో ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్, పిఅండ్ఎల్ ఐజీ పీహెచ్‌డీ రామకృష్ణ, ఏసీబీ, ఎస్ఈబి ఐజి రవి ప్రకాశ్ ఒక బృందంగా, ఎస్పీ గంగాధర్ మరికొందరు బృందంగా దాదాపు 5 గంటల పాటు పలు అంశాలల్లో విచారణ నిర్వహించినట్టు తెలిసింది. ముఖ్యమంత్రి కోరిన మేరకు మంగళవారం న్యూ ఢిల్లీ నుంచి సైబర్ క్రైమ్, ఐటీ నిపుణులు అత్యున్నత స్థాయి బృందం గుడ్లవల్లేరు కళాశాలకు రానుందని సమాచారం.

రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

బెంగుళూరులోని ఓ కేఫ్‌లో వాష్‌రూమ్స్‌లో రహస్య కెమెరాలు పెట్టినట్టు వచ్చిన వార్తలు, ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులోని గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల బాలికల హాస్టల్‌లో వాష్‌రూమ్స్‌లో హిడెన్ కెమేరాల అభియోగాలతో వార్తలు వచ్చిన దృష్ట్యా జాతీయ మానవహక్కుల కమీషన్ (ఎన్‌హెచ్ఆర్సి) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ లలో మహిళల భద్రత, గౌరవం కాపాడే విషయం పై ఎన్‌హెచ్‌ఆసి ఆ రెండు సంఘటనల వార్తలను సుమోటోగా తీసుకొని విచారణకు తీసుకొన్నట్టు సమాచారం.


సైనా నెహ్వాల్

త్వరలో రిటైర్మెంట్‌పై నిర్ణయం

న్యూఢిల్లీ: కొన్నాళ్లుగా ఆటకు దూరమైన భారత వెటరన్ షట్లర్ సైనా నెహ్వాల్ ఈ ఏడాది చివర్లో రిటైర్మెంట్‌పై నిర్ణయం తీసుకుంటానని వెల్లడించింది. కీళ్ల నొప్పుల కారణంగా గతంలో మాదిరి ఎక్కువ గంటలు సాధన చేయలేకపోతున్నానని ఈ మాజీ వరల్డ్ నెంబర్ వన్ తెలిపింది. భారత్‌కు బ్యాడ్మింటన్‌లో తొలి ఒలింపిక్ పతకం (2012 లండన్) అందించిన షట్లర్ సైనానే. 'నా మోకాళ్లు మునుపటిలా లేవు. నాకు కీళ్ల నొప్పులు మొదలయ్యాయి. మోకాళ్లలోని కణజాలం బాగా దెబ్బతింది. ఈ పరిస్థితుల్లో రోజుకు 8-9 గంటలు సాధన చేయడం కష్టంగా తయారైంది. ఈ స్థితిలో ప్రపంచ మేటి షట్లర్లతో ఎలా తలపడగలను? ప్రస్తుతం చేస్తున్న రెండు గంటల సాధన అత్యుత్తమ ప్లేయర్లతో పోటీ పడేందుకు సరిపోదు. త్వరలో రిటైర్మెంట్‌పై నిర్ణయం తీసుకుంటా' అని సైనా తెలిపింది.

గాఫ్, పౌలిని అవుట్


యూఎస్ ఓపెన్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో సంచలనాల జోరు ఆగడంలేదు. ఇప్పటికే హాట్ ఫేవరెట్ అల్కారజ్, పురుషుల సింగిల్స్ నిరుటి విజేత జోకోవిచ్ ఇంటిబాట పట్టగా.. తాజాగా మహిళల డిఫెండింగ్ చాంపియన్ కొకొ గాఫ్, ఐదోసీడ్ జాస్మిన్ పౌలిని కూడా వెనుదిరిగారు. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో అమెరికాకు చెందిన 13వ సీడ్ ఎమ్మా నవారో 6-4, 4-6, 6-3తో తన దేశానికే చెందిన మూడో సీడ్ గాఫ్‌కు షాకిచ్చింది. అయితే ఈ ఓటమి గాఫ్ స్వయంకృతమే. ఏకంగా 19 డబుల్‌ఫాల్ట్‌లు చేసిన కొకొ పరాజయం కొనితెచ్చుకుంది. మరో నాలుగో రౌండ్ పోరులో అన్‌సీడెడ్ కరోలినా ముచోవా (చెక్ రిపబ్లిక్) 6-3, 6-3తో ఇటలీ సంచలనం పౌలినిని చిత్తు చేసింది. ఇతర మ్యాచ్‌ల్లో రెండో సీడ్ సబలెంకా 6-2, 6-4తో మెర్టెన్స్‌పై, ఏడో సీడ్ జాంగ్ 7-6 (2), 4-6, 6-2తో 24వ సీడ్ వెకిక్‌పై విజయంతో క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించారు. పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో 4వ సీడ్ జ్వెరెవ్ 3-6, 6-1, 6-2, 6-2 నకాషిమాని ఓడించగా, జొకోవిచ్‌కు ఝలకిచ్చిన 28వ సీడ్ పాపిరిన్‌కు 6-4, 7-6 (3), 2-6, 6-3తో 20వ సీడ్ టియఫో చెక్ పెట్టి క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. ఇక ఆరో సీడ్ రుబ్లేవ్, ఎనిమిదో సీడ్ రూడ్‌కు కూడా రౌండ్-16లో చుక్కెదురైంది. పురుషుల డబుల్స్‌లో భారత వెటరన్ స్టార్ రోహన్ బోపన్న పోరాటం ముగిసింది. మూడో రౌండ్‌లో రోహన్ బోపన్న/ఎబ్డెన్ జోడీ 1-6, 5-7తో అర్జెంటీనా జంట గొంజాలెజ్/మోంటెనీ ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ఓటమి ముంగిట పాక్

రావల్పిండి: చారిత్రాత్మక టెస్ట్ సిరీస్ క్లీన్‌స్వీప్‌నకు బంగ్లాదేశ్ 143 పరుగుల దూరంలో ఉంది. బంగ్లా పేసర్లు హసన్ మహమూద్ (5/43), నహీద్ రాణా (4/44) నిప్పులు చెరగడంతో.. ఆటకు నాలుగోరోజు రెండో ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ 172 రన్స్‌కే కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోరు 9/2కు 162 రన్స్ మాత్రమే జోడించిన పాక్ మిగతా 8 వికెట్లు చేజార్చుకొంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 12 రన్స్‌తో కలిపి మొత్తం 185 పరుగుల లక్ష్యాన్ని బంగ్లా ముందుంచింది. అనంతరం ఛేదనలో వర్షం కారణంగా సోమవారం ఆట నిలిచేసరికి బంగ్లా వికెట్ నష్టపోకుండా 42 రన్స్ చేసింది. అయితే, ఘోర అవమానం నుంచి తప్పించుకోవాలంటే ఆటకు ఐదో, ఆఖరిరోజు పాక్ 10 వికెట్లు కూల్చాలి. తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 274, బంగ్లా 262 రన్స్ చేశాయి. రెండు టెస్టుల సిరీస్‌లో తొలిమ్యాచ్‌లో బంగ్లా నెగ్గింది.

డేవిస్ కప్ నుంచి నగల్ అవుట్

న్యూఢిల్లీ: భారత అగ్రశ్రేణి టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నగల్ వెన్ను గాయం కారణంగా డేవిస్ కప్ నుంచి తప్పుకున్నాడు. వచ్చే నెల 14 నుంచి స్టాక్‌హోమ్ వేదికగా స్వీడన్ జట్టుతో భారత్ డేవిస్ కప్‌లో తలపడనుంది. ఈ పోరుకు నగల్ దూరమయ్యాడు. 'వెన్నునొప్పితో బాధపడుతున్నా. వచ్చేరెండు వారాలు విశ్రాంతి అవసరం వైద్యులు సూచించారు. అందుకే టోర్నీలో ఆడడం లేదు' అని నగల్ తన సోషల్ మీడియా ఖాతాలో తెలిపాడు.

పసిడి పంట





నితేశ్, సుమిత్‌కు స్వర్ణాలు

బ్యాడ్మింటన్‌లో మనోళ్ల హవా

సుహాస్, తులసిమతికి రజతాలు | డిస్కస్ త్రోలో యోగేశ్‌కు రజతం

పారాలింపిక్స్‌లో పతకాల మోత మోగుతోంది. గత మూడు రోజుల్లో ఏడు మెడల్స్‌తో అదుర్స్ అనిపించిన దివ్యాంగ అథ్లెట్లు.. సోమవారం మరింత విజృంభించారు. ఈ ఒక్కరోజే మరో ఏడు పతకాలతో మురిపించారు. స్టార్ జావెలిన్‌త్రోయర్ సుమిత్ అంటిల్, షట్లర్ నితేశ్ స్వర్ణాల్లో మెరవగా.. మరో షట్లర్ సుహాస్, డిస్కస్ త్రోయర్ యోగేశ్ వరుసగా రెండో పారాగేమ్స్‌లోనూ రజతాలతో ఆకట్టుకున్నారు. అలాగే మహిళా షట్లర్లు తులసీమతి రజతం, ఆర్చర్లు రాకేశ్-శీతల్, మనీష కాంస్యాలతో మురిపించారు. దీంతో మొత్తం 14 పారా మెడల్స్‌తో భారత్ 14వ స్థానంలో కొనసాగుతోంది.


తులసిమతి

పారిస్: భారత అథ్లెట్లు తమ అద్భుత ప్రదర్శనతో పారాలింపిక్స్‌లో పతకాల వరద పారిస్తున్నారు. గేమ్స్ రెండో రోజు నుంచే ఖాతా ఆరంభించిన భారత్ ఆ తర్వాత క్రమం తప్పకుండా పతకాల సంఖ్యను పెంచుకుంటూ వెళుతోంది. తాజాగా సోమవారం దేశానికి మరో ఏడు పతకాలు లభించాయి. ఇందులో షట్లర్లవే నాలుగుండడం విశేషం. జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్, నితేశ్ రూపంలో భారత్‌కు రెండు స్వర్ణాలు దక్కాయి. షట్లర్లు సుహాస్, తులసీమతిలకు రజతం, మనీషకు కాంస్యం దక్కింది. ఇక డిస్కస్‌త్రోలో యోగేశ్ కథునియా కెరీర్‌లో రెండో రజతంతో మురిపించాడు. అలాగే ఆర్చరీలో రాకేశ్-శీతల్ కాంస్యం అందుకున్నారు. తాజాగా భారత్ 3 స్వర్ణాలు, 5 రజతాలు, 6 కాంస్యాలతో 14 పతకాలను ఖాతాలో వేసుకుంది.


సుహాస్


మనీషా

షట్లర్ల పతక జోరు: సోమవారం పోటీల్లో భారత షట్లర్లు పతకాల పండగ చేసుకున్నారు. ముందుగా పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 ఫైనల్లో వరల్డ్ నెంబర్‌వన్ నితేశ్ కుమార్ 21-14, 18-21, 23-21 తేడాతో డానియెల్ బెథెల్ (గ్రేట్ బ్రిటన్)పై గెలిచి స్వర్ణం సాధించాడు. బెథెల్‌పై ఆడిన పది మ్యాచ్‌ల్లో నితేశ్‌కిదే తొలి విజయం. తొలి రెండు గేమ్‌ల్లో ఇరువురు ఆధిక్యం చూపగా.. నిర్ణాయక గేమ్ ఓ దశలో 19-19తో ఉత్కంఠను పెంచింది. చివరకు 23-21తో నితేశ్ మ్యాచ్‌ను ముగించి సంబరాలు చేసుకున్నాడు. ఇక ఏకపక్షంగా సాగిన పురుషుల సింగిల్స్ ఎస్ఎల్4 ఫైనల్లో సుహాస్ యతిరాజ్ 9-21, 13-21 తేడాతో లుకాస్ మజుర్ (ఫ్రాన్స్) చేతిలో ఓడాడు. దీంతో వరుసగా రెండోసారి రజతంతో సంతృప్తిపడాల్సి వచ్చింది. టోక్యో గేమ్స్ ఫైనల్లోనూ వీరిద్దరే తలపడ్డారు. అలాగే మహిళల సింగిల్స్ ఎస్‌యూ5లో స్వర్ణంపై ఆశలు రేపిన తులసీమతి మురుగేశన్ ఫైనల్లో 17-21, 10-21 తేడాతో యాంగ్ క్విక్సియా (చైనా) చేతిలో ఓడి రజతం సాధించింది. ఇదే విభాగం కాంస్య పతక పోరులో మనీష రామదాస్ 21-12, 21-8 తేడాతో క్యాథరిన్ (డెన్మార్క్)పై సులువుగా నెగ్గింది. అయితే మిక్స్‌డ్ డబుల్స్ ఎస్‌హెచ్6 కాంస్య పోరులో శివరాజన్-నిత్యశ్రీ 17-21, 12-21తో సుభాన్-రీనా (ఇండోనేసియా) చేతిలో నిరాశే ఎదురైంది.

రైలు ప్రమాదంలో కాలు కోల్పోయినా..

అరంగేట్ర పారాలింపిక్స్‌లోనే స్వర్ణ పతకం సొంతం చేసుకున్న నితేష్ కుమార్ రాజస్థాన్‌లో జన్మించాడు. ఫుట్‌బాలర్ కావాలనేది అతడి చిన్ననాటి కల. నితేష్ తండ్రి నేవీలో అధికారి. ఆయన బాటలో నడుస్తూ నౌకాదళంలో ప్రవేశించి దేశ సేవ చేయాలని కూడా అనుకున్నాడు. కానీ 2009లో జరిగిన ప్రమాదం కుమార్ కలలను చిదిమేసింది. విశాఖపట్నంలో కదులుతున్న రైలుబోగీ నుంచి జారిపడడంతో ఎడమ కాలును కోల్పోయాడు. దాంతో నెలలపాటు నితేష్ మంచానికే పరిమితమయ్యాడు. ఆ విషాదం నుంచి కోలుకొని చదువును కొనసాగించాడు. పుణెలో కృత్రిమ అవయవ కేంద్రాన్ని సందర్శించడం కుమార్ జీవిత దృక్పథాన్ని మార్చివేసింది. యుద్ధాలలో గాయపడిన అనేకమంది సైనికులను ఆ కేంద్రంలో చూశాక..తన అవయవలోప సవాలును అధిగమించడం కష్టమేమీ కాదని గ్రహించాడు. ఆపై ఏడాదిపాటు కష్టపడి చదివి 2013లో ఐఐటీలో సీటు సాధించాడు. మండిలో చదువుతున్న రోజుల్లో బ్యాడ్మింటన్‌పట్ల కలిగిన ఆసక్తి తదనంతరం అనురక్తిగా మారింది. 2016లో పారా బ్యాడ్మింటన్‌లో ప్రవేశించిన కుమార్ ఫరీదాబాద్‌లో జరిగిన పారా జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో హరియాణా తరపున పోటీపడి కాంస్య పతకం అందుకున్నాడు. ఆ పతకం నితేష్‌లో ఆత్మవిశ్వాసం పెంచింది. 2017లో ఐరిష్ ఇంటర్నేషనల్ పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ దక్కించుకున్నాడు. అదే సంవత్సరం జాతీయ పారా బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో కాంస్యం, డబుల్స్‌లో రజత పతకం కైవసం చేసుకున్నాడు. 2020 జాతీయ చాంపియన్‌షిప్‌లో స్టార్ షట్లర్లు ప్రమోద్, మనోజ్‌లను ఓడించి స్వర్ణ పతకం గెలవడం నితేష్ క్రీడా జీవితంలో హైలైట్. వరల్డ్ చాంపియన్‌షిప్‌లోనూ కుమార్ తిరుగులేని ప్రదర్శన చేశాడు. 2019, 2020 ప్రపంచ పోటీలలో రజతాలు, 2024లో కాంస్య పతకంతో అదరగొట్టాడు. ఆసియా పారా గేమ్స్‌లో ఒక స్వర్ణం, మరో రజతం, రెండు కాంస్య పతకాలు కుమార్ కొల్లగొట్టాడు. 29 ఏళ్ల నితేష్ హరియాణా ప్రభుత్వ క్రీడా యువజన శాఖలో బ్యాడ్మింటన్ సీనియర్ కోచ్‌గా భవిష్య షట్లర్లను తీర్చిదిద్దుతున్నాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

సుమిత్ నయా చరిత్ర



స్టార్ జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్ పారాలింపిక్స్‌లో చరిత్ర సృష్టించాడు. ఎఫ్64 విభాగంలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన తను వరుసగా రెండోసారి విజేతగా నిలిచాడు. అంతేకాకుండా.. టోక్యో గేమ్స్‌లో తాను నెలకొల్పిన వరల్డ్ రికార్డు (68.55మీ.)ను ఏకంగా రెండుసార్లు సవరించాడు. ఈసారి జావెలిన్‌ను 70.59మీ. దూరం విసిరి పారాగేమ్స్‌లో సరికొత్త రికార్డును నెలకొల్పాడు. వాస్తవానికి తన తొలి ప్రయత్నంలోనే 69.11మీ. దూరంతో టోక్యో రికార్డును సవరించాడు. అలాగే భారత్‌కు చెందిన మరో అథ్లెట్ సందీప్ చౌదరి 62.80మీ. దూరంతో నాలుగో స్థానంలో నిలిచాడు.

శీతల్ జోడీ కంచు మోత

మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్‌లో ఆర్చర్లు రాకేశ్ కుమార్, 17 ఏళ్ల శీతల్ దేవి పతకంతో సత్తా చాటారు. ఇద్దరికీ పారాగేమ్స్‌లో ఇదే తొలిపతకం కావడం విశేషం. సెమీస్‌లో ఇరాన్ చేతిలో షూటాఫ్‌లో ఓడిన భారత జోడీ కాంస్య పోరులో మాత్రం ఒత్తిడికి లోనుకాలేదు. ఇటలీ జోడీ సార్తి-బొనాసినాతో సాగిన ఈ మ్యాచ్‌లో శీతల్ జంట 156-155తో గెలిచింది. మనోళ్లు తొలి మూడు సెట్లలో రెండింటిని కోల్పోయినా చివరిదైన నాలుగో సెట్‌లో మాత్రం కచ్చితమైన గురితో బాణాలు వదిలారు. ఇద్దరూ తమ రెండు ప్రయత్నాల్లోనూ పర్ఫెక్ట్10 సాధించి 40 పాయింట్లు సాధించారు. అటు ఇటలీ జోడీ మాత్రం 9,9,10,10తోనే సరిపెట్టుకున్నారు. భారత్ సంబరాల్లో మునిగింది. రెండు చేతులు లేకపోయినా కాళ్లతోనే బాణాలు సంధిస్తూ టీనేజర్ శీతల్ ఇప్పటికే ప్రపంచ క్రీడాభిమానులను ఆకట్టుకుంటున్న విషయం తెలిసిందే. వీరిద్దరూ తమ వ్యక్తిగత కాంపౌండ్ విభాగాల్లో మాత్రం మెడల్స్ అందుకోలేకపోయారు.


యోగేశ్ భేష్

27 ఏళ్ల డిస్కస్ త్రోయర్ యోగేశ్ కథునియా కెరీర్‌లో రెండో రజతం సాధించాడు. సోమవారం జరిగిన పురుషుల డిస్కస్ త్రో ఎఫ్ 56 ఈవెంట్‌లో అతను 42.22 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు. క్లాడినీ బటిస్టా (46.86మీ. బ్రెజిల్)కు స్వర్ణం, జౌనిస్ (41.32మీ. గ్రీస్)కు కాంస్యం దక్కాయి.టోక్యో గేమ్స్‌లోనూ యోగేశ్ సిల్వర్ మెడల్‌తో రాణించాడు.

బిజినెస్

ఎస్‌బీఐలో మరో తెలుగు తేజం

ఎండీగా రామ మోహన రావు నియామకం



న్యూఢిల్లీ: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ)లో కీలక పదవికి మరో తెలుగు తేజం ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్, బాపట్లకు చెందిన రామ మోహన రావు అమర.. బ్యాంక్ కొత్త మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా ఎంపికయ్యారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ), ఆర్థిక సంస్థల కీలక పదవులకు అభ్యర్థులను ఎంపిక చేసే 'ది ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇనిస్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) మొత్తం తొమ్మిది మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి రామ మోహన రావు పేరును ఎంపిక చేసింది. ఈ సిఫారసును కేంద్ర క్యాబినెట్ ఆమోదించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఎస్‌బీఐ ఎండీగా ఉన్న మరో తెలుగు తేజం సీ శ్రీనివాసులు శెట్టి ఇటీవలే ఎస్‌బీఐ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్థానంలో రామ మోహన రావు బ్యాంక్ ఎండీగా బాధ్యతలు స్వీకరించబోతున్నారు. ఇంజనీరింగ్ పట్టభద్రుడైన రావు 1991లో ప్రొబేషనరీ ఆఫీసరుగా ఎస్‌బీఐలో చేరారు. తన 32 సంవత్సరాల సర్వీసులో దేశ, విదేశాల్లోని ఎస్‌బీఐ శాఖల్లో ఆయన అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఈయన ఎస్‌బీఐ డిప్యూటీ ఎండీగా ఉన్నారు. భారత బ్యాంకింగ్ రంగంలో రారాజుగా భావించే ఎస్‌బీఐ చరిత్రలో రెండు కీలక పదవులకు ఇరువురు తెలుగు వారు ఒకేసారి ఎంపిక కావడం ఇదే మొదటిసారి.

రెండేళ్లలో మరో 6 ప్లాంట్లు

- రూ.1,000 కోట్లతో బయోలాజిక్స్ ప్లాంట్
- 2023-24లో రూ.29,000 కోట్ల టర్నోవర్



అరబిందో ఫార్మా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే అరబిందో ఫార్మా జెనరిక్స్ రంగంలో దూసుకుపోతోంది. ఫార్మా రంగంలో అత్యంత కీలకమైన యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ) తయారీ కోసం 1986లో ఏర్పాటైన ఈ కంపెనీ.. ఇతర ఫార్మా కంపెనీల కొనుగోళ్లు, కొత్త ప్లాంట్ల ఏర్పాటు ద్వారా ప్రస్తుతం భారత ఫార్మా రంగంలో మేటి సంస్థగా ఎదిగింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో 350 కోట్ల డాలర్ల (సుమారు రూ.29,300 కోట్లు) టర్నోవర్ నమోదు చేసింది.

భారీ విస్తరణ బాటలో: కంపెనీ ప్రస్తుతం 29 ఉత్పత్తి యూనిట్లతో ఏటా 5,000 కోట్లకు పైగా ఫార్ములేషన్లు, 19,000 టన్నుల ఏపీఐల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది. వీటికి తోడుగా వచ్చే రెండేళ్లలో మరో ఆరు కొత్త ఉత్పత్తి యూనిట్లు ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వీలుగా ప్రత్యేక ఔషధాలపై దృష్టి పెట్టింది. దీనికి తోడు అమెరికాతో సహా ప్రధాన మార్కెట్లపై ప్రత్యేక దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా ఇటీవల ఇండోనేషియాలో ఫైజర్/వయాట్రిస్ కంపెనీల నుంచి 17 బ్రాండ్లను కొనుగోలు చేసి, అక్కడి మార్కెట్‌పై పట్టు సాధించేందుకు కృషి చేస్తోంది. ఇప్పటికే 14 బయోసిమిలర్ ఔషధాల అభివృద్ధి వివిధ దశల్లో ఉంది. ఇవిగాక మరో 14 పెప్టైడ్ ఏపీఐల కోసం డీఎంఎఫ్‌లను అమెరికాలో ఫైల్ చేసింది. కాగా ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) కింద రూ.2,500 కోట్ల పెట్టుబడితో పెన్సిలిన్-జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది.

బయోలాజిక్స్‌లోకి ప్రవేశం

అరబిందో ఫార్మా ఈ మధ్యనే బయోలాజిక్స్ ఔషధాల కాంట్రాక్టు తయారీలోకి ప్రవేశించింది. ఇందుకోసం 'థెరానియమ్ బయోలాజిక్స్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో ప్రత్యేక అనుబంధ కంపెనీని ఏర్పాటు చేసింది. బయోలాజిక్స్ కోసం త్వరలో రూ.1,000 కోట్లతో ఏటా రెండున్నర నుంచి మూడు కోట్ల వయల్స్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్లాంట్ నుంచి కాంట్రాక్టు పద్దతిలో బయోసిమిలర్స్ సరఫరా చేసేందుకు ఎంఎస్‌డీ కంపెనీతో మాస్టర్ సర్వీస్ ఒప్పందం (ఎంఎస్ఏ) కుదుర్చుకుంది. ఈ పెట్టుబడులు తమ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకువెళతాయని అరబిందో ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ కే నిత్యానంద రెడ్డి తెలిపారు.


రీజెన్సీ చేతికి సెగ్నో సిరామిక్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే రీజెన్సీ సిరామిక్స్ కంపెనీ తన వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్లకు చెందిన సెగ్నో సిరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను కొనుగోలు చేసింది. అయితే ఎంత మొత్తానికి ఈ కొనుగోలు చేసిందనేది మాత్రం కంపెనీ వెల్లడించలేదు. ఈ కొనుగోలుతో రీజెన్సీ సిరామిక్స్ కంపెనీకి మరో 36 లక్షల చదరపు మీటర్ల వార్షిక సిరామిక్స్ ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులోకి రానుంది. ఈ కొనుగోలుతో తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఒడిశా రాష్ట్రాల సిరామిక్స్ మార్కెట్లో మరింత పట్టు ఏర్పడుతుందని రీజెన్సీ సిరామిక్స్ భావిస్తోంది. దీనికి తోడు సమీపంలోని చెన్నై, కృష్ణపట్నం రేవుల ద్వారా మంచి ఎగుమతి అవకాశాలు ఏర్పడతాయని ఆశిస్తోంది.

భారత మార్కెట్లోకి క్లారిటీ బెనిఫిట్ సొల్యూషన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికా కేంద్రంగా ఉన్న క్లారిటీ బెనిఫిట్ సొల్యూషన్స్ తన కార్యకలాపాలను భారత్‌కు విస్తరించింది. ఇందుకోసం హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఎన్నేబుల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని కొనుగోలు చేసింది. చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థల ఉద్యోగులకు వివిధ రకాల ప్రయోజనాల సేవలు అందించటంతో క్లారిటీ బెనిఫిట్‌కు అమెరికాలో మంచి పేరుంది. 'మా అభివృద్ధి వ్యూహంలో భారత మార్కెట్లో అందుబాటులో ఉన్న అద్భుత నైపుణ్యాలను వినియోగించుకునేందుకు ఇదొక ప్రధాన ముందడుగు' అని క్లారిటీ బెనిఫిట్ సీఈఓ, వ్యవస్థాపకుడు బిల్ కటుజి తెలిపారు.

మహీంద్రా సీబీజీ యువో టెక్ ప్లస్ ట్రాక్టర్



న్యూఢిల్లీ: మహీంద్రా ట్రాక్టర్స్.. కంప్రెస్డ్ బయోగ్యాస్‌తో (సీబీజీ) పని చేసే యువో టెక్ ప్లస్ ట్రాక్టర్‌ను కేంద్ర రోడ్డు రవాణా, హైవే శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో ఆవిష్కరించింది. సీబీజీతో పని చేసే ఈ ట్రాక్టర్ కాలుష్యం, కర్బన వ్యర్థాలను గణనీయంగా తగ్గించగలుగుతుందని కంపెనీ తెలిపింది. సీఎన్‌జీ అయితే శిలాజ ఇంధనాల నుంచి తయారవుతుందని, దానికి భిన్నంగా సీబీజీ పూర్తిగా హరిత, పునరుత్పాదక ఇంధనాల నుంచి తయారవుతుందని కంపెనీ పేర్కొంది.

హైదరాబాద్ విమానాశ్రయంలో ప్రైవేట్ విమానాల కోసం ప్రత్యేక టెర్మినల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్/శంషాబాద్ రూరల్): హైదరాబాద్, శంషాబాద్‌లో జీఎంఆర్ గ్రూప్ నిర్వహణలోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (ఆర్‌జీఐఏ).. ప్రైవేట్ విమానాల కోసం ప్రత్యేక టెర్మినల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆర్‌జీఐఏ టెర్మినల్ పక్కన 11,234 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సదుపాయాలతో ఈ టెర్మినల్ ఏర్పాటు చేసినట్టు ఆర్‌జీఐఏ తెలిపింది. ప్రైవేట్ ఎంట్రెన్స్, కార్ల పార్కింగ్ కూడా ఈ టెర్మినల్‌లో అందుబాటులో ఉంటాయి. వ్యక్తిగత లేదా వ్యాపార అవసరాల కోసం ప్రైవేట్ విమానాలు, చార్టర్డ్ విమానాల్లో వచ్చే కుబేరులు, వ్యాపార ప్రముఖుల విమానాలు ఈ టెర్మినల్ ద్వారా రాకపోకలు సాగించవచ్చు. హైదరాబాద్ ఇప్పటికే ఫార్మా, ఐటీ రంగాల్లో బాగా అభివృద్ధి చెందింది. ఇటీవల అనేక బహుళ జాతి కంపెనీలు ఇక్కడ తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నాయి. ఈ రంగాలకు చెందిన ప్రముఖుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక టెర్మినల్ ఏర్పాటు చేసినట్టు జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సీఈఓ ప్రదీప్ ఫణిక్కర్ తెలిపారు.

త్వరలో విమానాల్లో వైఫై: ఎయిర్ ఇండియా

ముంబై: టాటా గ్రూప్ నిర్వహణలోని ఎయిర్ ఇండియా ప్రయాణికులకు మరో అదనపు సౌకర్యాన్ని అందుబాటులోకి తేనుంది. తమ విమాన ప్రయాణికుల కోసం త్వరలో వైఫై సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువస్తోంది. ముందుగా ఢిల్లీ నుంచి లండన్‌లోని హీత్రూ విమానాశ్రయానికి నడిచే ఎయిర్‌బస్ ఏ350 విమానాల్లో ఈ సదుపాయం ప్రవేశ పెడతామని తెలిపింది. తరువాత క్రమంగా ఈ సదుపాయాన్ని ఇతర విమాన సర్వీసులకు విస్తరిస్తారు.

రూ.250తో సిప్!

త్వరలోనే అందుబాటులోకి

సెబీ చీఫ్ మాధవి పురి బుచ్



ముంబై: దేశంలో క్రమానుగుత పెట్టుబడులను (సిప్) మరింతగా ప్రోత్సహించడంతో పాటు సామాన్య ప్రజానికానికీ ఈ పథకాలను అందుబాటులోకి తెచ్చేందుకు మ్యూచువల్ ఫండ్ పరిశ్రమతో కలిసి కృషి చేస్తున్నట్లు సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ తెలిపారు. దేశీయ మదుపరులు త్వరలోనే నెలకు రూ.250తో సిప్ చేయగలుగుతారని ఆమె అన్నారు. సీఐఐ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఓ సదస్సులో బుచ్ ఈ విషయాన్ని వెల్లడించారు. కాగా, దేశంలో తొలిసారిగా రూ.250 సిప్ ప్లాన్‌ను ప్రవేశపెట్టేందుకు ఆదిత్య బిర్లా సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్ సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్ సంస్థల పథకాల్లో నెలకు కనీసం సిప్ చేయగలిగే పరిమితి రూ.500గా ఉంది.

త్వరలో సింగిల్ ఫైలింగ్ విధానం: లిస్టెడ్ కంపెనీలకు సమాచార బహిర్గత ప్రక్రియను మరింత సులభతరం చేయనున్నట్లు, సింగిల్ ఫైలింగ్ విధానాన్ని త్వరలోనే అమల్లోకి తేనున్నట్లు బుచ్ తెలిపారు. కొత్త విధానంలో లిస్టెడ్ కంపెనీలు ఏదైనా స్టాక్ ఎక్స్ఛేంజీకి సమాచారం అందిస్తే, ఆ సమాచారం ఇతర ఎక్స్ఛేంజీలోనూ ఆటోమెటిక్‌గా అప్‌లోడ్ అవుతుంది. తద్వారా కంపెనీలు ప్రతి ఎక్స్ఛేంజీలకు విడివిడిగా ఫైలింగ్ చేసే బెడద తప్పనుంది.

రీట్స్‌పై నో కామెంట్స్: రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్ (రీట్స్)పై వ్యాఖ్యానించేందుకు సెబీ చీఫ్ నిరాకరించారు. "ప్రస్తుతం రీట్స్‌పై తానేం మాట్లాడినా పరస్పర విరుద్ధ ప్రయోజన ఆరోపణలు వచ్చే ప్రమాదం ఉంద"న్నారు. రీట్స్ నిబంధనలకు సెబీ ఈ మధ్య జరిపిన సవరణలు మాధవి పురి బుచ్ భర్త ధవల్ బుచ్ భాగస్వామ్యుడిగా ఉన్న కంపెనీకి లబ్ది చేకూర్చేలా ఉన్నాయని హిండెన్‌బర్గ్ ఇటీవల ఆరోపించింది. అయితే, సెబీ ఆ ఆరోపణలను ఖండించింది. కాగా, దేశీయ రీట్స్ విభాగంలో భారీగా పెట్టుబడులు కలిగిన అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్‌కు ధవల్ బుచ్ సీనియర్ సలహాదారుగా ఉన్నారు.

అన్‌స్టాపబుల్ ర్యాలీ

సరికొత్త శిఖరాలకు సూచీలు

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఈ నెలలోనే తగ్గించవచ్చన్న అంచనాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల దన్నుతో దేశీయ ఈక్విటీ సూచీలు సోమవారం సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ ఒక దశలో 359.51 పాయింట్లు వృద్ధి చెంది 82,725.28 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి సూచీ 194.07 పాయింట్ల లాభంతో 82,559.84 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును కూడా నమోదు చేసింది. సెన్సెక్స్ లాభపడటం వరుసగా ఇది పదో రోజు. 2023 సెప్టెంబరు తర్వాత సూచీకిదే సుదీర్ఘ ర్యాలీ. కాగా, నిఫ్టీ 97.75 పాయింట్ల వరకు పెరిగి 25,333.65 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 42.80 పాయింట్ల లాభంతో 25,278.70 వద్ద సరికొత్త గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. సూచీ ర్యాలీ తీయడం వరుసగా ఇది 13వ రోజు. గడిచిన పదమూడు ట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 1,140 పాయింట్లు (4.72 శాతం), గత పది రోజుల్లో సెన్సెక్స్ 2,135.16 పాయింట్లు (2.65 శాతం) వృద్ధి చెందాయి.


టాటా మోటార్స్ నుంచి కర్వ్ పెట్రోల్, డీజిల్ కార్లు


ప్రారంభ ధర రూ.9.99 లక్షలు

న్యూఢిల్లీ: దేశీయ కార్ల దిగ్గజం టాటా మోటార్స్ మిడ్‌సైజ్ ఎస్‌యూవీ కూపే కర్వ్ పెట్రోల్, డీజిల్ వెర్షన్లను మార్కెట్లోకి తెచ్చింది. దీని ప్రారంభ ధర రూ.9.99 లక్షలు. ఆగస్టు నెలలోనే టాటా కర్వ్ విద్యుత్ వెర్షన్‌ను విడుదల చేశారు. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మిడ్‌సైజ్ ఎస్‌యూవీ విభాగంలో దీన్ని ప్రవేశపెడుతున్నామని, మొత్తం ఆటోమొబైల్ పరిశ్రమలో ఈ విభాగం ప్రస్తుతం 16 శాతం వాటా కలిగి ఉందని టాటా మోటార్స్ ప్రయాణికుల వాహన విభాగం ఎండీ శైలేష్ చంద్ర అన్నారు. ఇది చాలా పోటీతో కూడిన విభాగమని, ఈ విభాగంలో ఆలస్యంగా ప్రవేశించిన ఏ కంపెనీ అయినా తమ కారును ప్రత్యేకంగా కనిపించేలా తయారు చేయాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతున్న ఎస్‌యూవీ కూపే బాడీతో కర్వ్‌ను తయారుచేసినట్టు ఆయన తెలిపారు. కర్వ్ రెండు పెట్రోల్, ఒక డీజిల్ వెర్షన్‌లో అందుబాటులో ఉంటుందని చెప్పారు.

జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఐపీఓకు సెబీ బ్రేక్

రూ.4,000 కోట్ల విలువైన జేఎస్‌డబ్ల్యూ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ప్రతిపాదనను క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ప్రక్కన పెట్టింది. ఇందుకు కారణాలను మాత్రం వెల్లడించలేదు. ఈ కంపెనీ ఐపీఓకు అనుమతి కోరుతూ గతనెల 16న సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,770 ▼	66,700 ▼	91,000 ▼
ముంబై	71,511 ▼	65,504 ▼	82,780 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	465	విజయవాడ	495
వరంగల్	467	గోదావరి	495
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	99	విజయవాడ	108
వరంగల్	99	గుంటూరు	105
కరీంనగర్	99	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	87
కర్నూలు	99	నెల్లూరు	87
విశాఖపట్నం	99	అనంతపురం	100
గోదావరి	108		



ముంపునకు గురైన వైఎస్సార్ కాలనీ నుంచి బయటకు వస్తున్న జనం



అజిత్‌సింగ్‌నగర్‌లో నీట మునిగిన రైతుబజారు



విజయవాడలోని గుణదలలో ఇళ్ల చుట్టూ చేరిన నీరు

'నిర్లక్ష్యపు' వరద!

బెజవాడకు ఒకేసారి 'ముప్పేట' కష్టాలు.. కొండ చరియలు, కృష్ణా వరద, బుడమేరు ముంపు!

- బుడమేరు వరదపై అంచనా, జాగ్రత్తలు శూన్యం
- విపత్తు ప్రణాళికను గాలికొదిలేసిన శాఖలు
- అవగాహన, స్పందన లేని జిల్లాస్థాయి అధికారిణి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

అప్పటికే పొంగి ప్రవహిస్తున్న కృష్ణా నది... దీనికి తోడు అతి భారీ వర్షాలు.. అందులోనూ, బుడమేరు పరివాహక ప్రాంతంలో కుండ పోత! ఇలాంటి పరిస్థితుల్లో 'రాబోయే ముప్పు'ను అంచనా వేయలేదు. కనీసం.. వరద ముంచెత్తిన తర్వాతైనా వేగంగా స్పందించలేదు. వెరసి.. ఈ విపత్తును ఎదుర్కోవడంలో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ఘోరంగా విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం మధ్యాహ్నం స్వయంగా రంగంలోకి దిగేదాకా వచ్చేదాకా జిల్లా అధికారుల్లో కదలిక లేకపోవడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. బుడమేరకు ఎంత వరద వస్తుంది, ఏయే ప్రాంతాలు ముంపునకు గురవుతాయి, ఎలాంటి సహాయ చర్యలు తీసుకోవాలనే అవగాహన జిల్లా యంత్రాంగానికి కొరవడింది. దీంతో సహాయ శిబిరాల ఏర్పాటులో, ముంపు బాధితులకు ఆహార సరఫరా విషయంలోనూ ముందస్తుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వరద పరిస్థితిని ముందుగా అంచనా వేసి ఉంటే అవసరమైన బోట్లను అందుబాటులో ఉంచుకోవడం పెద్ద సమస్య అయ్యేది కాదు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉన్న మత్స్యకారుల నుంచి బోట్లను సమీకరించుకోవడం కష్టమేమీ కాదు. తగిన స్థాయిలో బోట్లు ఉంటే వరదలో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం సులభమయ్యేది. ఆఖరుకు మంచినీళ్ల ప్యాకెట్లు, ఆహారం వంటివి సమకూర్చుకోవడంపైనా దృష్టి సారించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆదివారం చంద్రబాబు వచ్చిన తర్వాతే దృష్టి పెట్టారు.

24 గంటల వర్షం అన్నప్పుడే అప్రమత్తమైతే..

24 గంటలు వర్షం పడితే బుడమేరు విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పైగా.. శుక్రవారం ఉదయం నుంచి శనివారం సాయంత్రం దాకా రికార్డు స్థాయిలో కురిసింది. ఇలాంటప్పుడు నగర యంత్రాంగం, జిల్లా యంత్రాంగాలు అప్రమత్తమై ప్రజలను అప్రమత్తం చేయాలి. రెండు రోజుల పాటు ఏకధాటిగా వర్షాలు కురిసినా ఆ పని చేయలేదు. క్షేత్రస్థాయిలో మొక్కుబడిగా పర్యటించారే తప్ప రాబోతున్న ఉపద్రవాన్ని అంచనా వేయటంలో విఫలమయ్యారు. బుడమేరు ఉగ్రరూపం దాల్చిన తర్వాత కూడా యంత్రాంగాలు కార్యచరణలోకి దిగలేదు. దీంతో ప్రజలు ఎక్కడికక్కడ వరదలో చిక్కుకుని డాబాలు, మిద్దెలపై ఎక్కారు. ఆ తర్వాత కంట్రోల్ రూమ్‌లకు, జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫోన్లు చేసి వేడుకున్నా బాధితులను బయటకు తీసుకురాలేని పరిస్థితి ఏర్పడింది. గత యాభై ఏళ్ల చరిత్ర చూస్తే వర్షాకాలంలో విజయవాడలో మూడు రకాల విపత్తులు వస్తుంటాయి. కృష్ణా వరదలు, బుడమేరు వరదలు, కొండచరియలు విరిగిపడటం! ఇప్పుడు ఇవన్నీ ఒకేసారి విరుచుకుపడ్డాయి. ఇలాంటపుడు జిల్లా, నగర యంత్రాంగాలు గరిష్ఠ స్థాయిలో అప్రమత్తం కావాలి. క్షేత్ర స్థాయిలో పూర్తి అవగాహన ఉంటేనే వీటిని ఎదుర్కోవటం సాధ్యమవుతుంది. నగరంలో వచ్చే విపత్తులకు సంబంధించి 2011లో కార్పొరేషన్ విపత్తు ప్రణాళికను రచించింది. విపత్తుల సమయంలో అమలు చేయాల్సిన యాక్షన్ ప్లాన్ ఇది! ఇందులో నగర యంత్రాంగం, జిల్లా యంత్రాంగం - దాని పరిధిలోని శాఖలు అప్పటి పట్టణాభివృద్ధి సంస్థ వీజీటీఎం - ఉడా, పోలీసు వ్యవస్థలన్నీ సంఘటితంగా ఈ ప్రణాళికను అమలు చేయాలి. ఇప్పుడు ఈ ప్రణాళిక ఏమైందో కూడా తెలియని పరిస్థితి. విజయవాడ పోలీసు యంత్రాంగం తీరు మరింత విస్తుగొలిపేలా ఉంది. వరద మొదలుకాగానే జనం సురక్షిత ప్రాంతాలకు బయలుదేరగా.. 'మీరు బయటికి రావొద్దు. ఇళ్లలోనే ఉండండి' అని బారికేడ్లు పెట్టి మరీ అడ్డుకున్నారు. సింగ్ నగర్ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్‌ను, జనాన్ని కూడా నియంత్రించలేకపోయారు. మరోవైపు బయటి నుంచి 'సందర్శకులూ' ఆ ప్రాంతానికి పోటెత్తారు. దీంతో... పడవలను తీసుకొచ్చిన లారీలకూ గంటల తరబడి దారి దొరకలేదు. విజయవాడ కార్పొరేషన్ యంత్రాంగం ఒకప్పుడు ఒంటిచేత్తో ఇలాంటి విపత్తులను ఎదుర్కొనేది. ప్రస్తుతం కార్పొరేషన్ అధికారులు అలంకారప్రాయంగా మారిపోయారు.

హాహాకారాలు...

జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లు పనే చేయలేదు. కంట్రోల్ రూంలకు 2 రోజుల వ్యవధిలో సుమారు 3వేల పైచిలుకు ఫోన్‌కాల్స్ రాగా.. అందులో పదో వంతు మందికి కూడా సాయం అందించలేకపోయారు. చివరికి... ప్రజా ప్రతినిధులు ఫోన్లు చేసి పరిస్థితి వివరిస్తున్నా జిల్లా అధికారులు పట్టించుకోలేదు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విజయవాడ రూరల్ మండలం పరిధిలో వరదలో చిక్కుకున్న వారి గురించి కలెక్టర్‌కు ఫోన్ చేసి బోట్లు పంపితే బాధితులను తాను సురక్షిత ప్రాంతాలకు తీసుకొచ్చి అన్ని ఏర్పాట్లు చేస్తానని చెప్పినా స్పందన లేదు. జిల్లా అధికారిణి తీరుపై సీనియర్ మంత్రి ఒకరు నేరుగా సీఎంకు ఫిర్యాదు చేశారు. ఆమెకు పరిస్థితిపై కనీస అవగాహన లేదని, సరైన రీతిలో స్పందించడం లేదని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించాల్సిన ఆ ఆఫీసర్, అన్నీ పక్కనపెట్టి ఓ మంత్రి వెంటే తిరుగుతుండటం గమనార్హం.

ట్రాక్టర్ మునిగిపోయేంత



వరద ముంపులో ఆటోలు, టిప్పర్లు

ఫైల్స్ భద్రం సారూ...



పాయకాపురంలో పోలీసు స్టేషన్‌లోని ఫైళ్లను సూట్‌కేసుతో మోసుకుపోతున్న దృశ్యం



వరద సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ లక్ష్మీశ

వరద నీటిలో.. పడవల్లో..!

క్షేత్రస్థాయి పర్యటనలో ఐఏఎస్‌లు

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేని రీతిలో ఐఏఎస్ అధికారులు వరద సహాయక చర్యల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. వరద నీటిలో రెస్క్యూ బృందాలతో బోట్లలో తిరుగుతూ బాధితులున్న వీధులకు, ఇళ్ల వద్దకు వెళ్లి సహాయం అందించడంలో తలమునకలై ఉన్నారు. నీట మునిగిన ఇళ్ల నుంచి బాధితులను బయటికి తీసుకొచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలించే విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా పర్యవేక్షిస్తుండగా, అధికారులు ఆ మేరకు క్షేత్రస్థాయిలో బాధితులకు సాయం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తాత్కాలికంగా బస చేసిన చంద్రబాబు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించడమే కాకుండా, రెండు గంటలకు ఒకసారి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. మొత్తం వరద ప్రభావిత ప్రాంతాలను తొమ్మిది విభాగాలుగా చేశారు. ప్రతి విభాగానికీ ఒకరు చొప్పున ఆ తొమ్మిదికి ప్రజల బాధ్యతను అప్పగించారు. వరద సహాయక చర్యల్లో వారిదే కీలక బాధ్యతగా నిర్దేశించారు. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడంతో పాటు ఇళ్లల్లో ఉన్న వారికి ఆహారం, మందులు, మంచినీళ్లు అందించడం వంటిమొత్తం బాధ్యతలు అప్పగించారు. దీంతో పాటు ప్రత్యేక బోట్లలో ఆ ప్రాంతంలో పర్యటించి వరద నీరు బయటకు పంపించే బాధ్యత కూడా సీఎం వారికి అప్పగించారు. వారంతా 2 రోజుల నుంచీ వారు అక్కడే ఉంటూ బాధితులకు అందుబాటులో ఉన్నారు. బాధితులకు అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు బోట్లు సిద్ధం చేసుకున్నారు. వరద నీరు బయటకు పంపించే ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. వరద నీరు ఏ ప్రాంతం నుంచి బయటకు వెళ్తుందో గుర్తించి, అక్కడ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. సెంట్రల్ కంట్రోల్ రూమ్‌కు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ బాధితులకు అండగా ఉంటున్నారు.

వరద బాధితులకు 75 వేల మెడికల్ కిట్లు

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): తుఫాను, భారీ వర్షాలు, వరదల కారణంగా ముంపునకు గురైన విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో దాదాపు 75 వేల అత్యవసర మందుల కిట్ల పంపిణీకి వైద్య ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లూ చేసిందని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 'గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ఆహార పొట్లాలతో పాటు కొన్ని అత్యవసర మెడికల్ కిట్లను హెలికాప్టర్ ద్వారా అధికారులు వరద ప్రభావిత ప్రాంతాలకు పంపించారు. నగరంలో ఏర్పాటు చేసిన 14 మెడికల్ రిలీఫ్ క్యాంపులకు అత్యవసర మందుల కిట్లను అధికారులు చేరవేశారు. మరికొన్ని కిట్లను 10 మొబైల్ మెడికల్ వాహనాల ద్వారా చేరవేశారు. ఏపీఎంఎస్ఐడీసీ నుంచి 50 వేల కిట్లు, డ్రగ్ కంట్రోల్ విభాగం నుంచి 25 వేలకిట్ల పంపిణీకి చర్యలు తీసుకున్నాం. మెడికల్ రిలీఫ్ క్యాంపుల్లో 24 గంటలూ వైద్య సేవలందించేందుకు డాక్టర్లు సిబ్బందితో పాటు సరిపడా మందుల్ని అందుబాటులో ఉంచాం. 10 వేల అత్యవసర మెడికల్ కిట్లను హెలికాప్టర్ ద్వారా, మిగతా 65 వేల కిట్లను ఎంపీఎంఎస్‌డీసీ, డ్రగ్ కంట్రోల్ విభాగం వాహనాల ద్వారా బాధితులకు అందించేందుకు ఏర్పాట్లు చేశాం. బోట్లలో ఫుడ్ ప్యాకెట్లతో పాటు అత్యవసర మందుల కిట్ల పంపిణీకి చర్యలు చేపట్టాం' అని తెలిపారు.



వరద ముంపు ప్రాంతాలలో చిక్కుకుపోయిన గర్భిణులను తరలిస్తున్న సిబ్బంది

ప్రకాశం బ్యారేజీ 'కౌంటర్' కట్

వరద ఉధృతికి కొట్టుకు వచ్చిన బోట్లు

- గేట్లకు సపోర్టుగా ఉండే కౌంటర్ వెయిట్లతో ఢీ
- 64, 69 నంబర్ గేట్ల వద్ద దెబ్బతిన్న దిమ్మెలు
- 69వ గేటు దగ్గర విరిగిపోయిన కౌంటర్ వెయిట్

విజయవాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతికి కొట్టుకొచ్చిన ఇనుప బోట్ల కారణంగా ప్రకాశం బ్యారేజీ గేట్లకు అనుబంధంగా ఉండే కౌంటర్ వెయింట్లు దెబ్బతిన్నాయి. 64వ నంబరు గేటు వద్ద ఉండే వెయిట్ స్వల్పంగా దెబ్బతినగా.. 69వ గేటు వద్ద ఉండేది పూర్తిగా మధ్యకు విరిగిపోయింది. కాంక్రీట్ సిమెంట్ దిమ్మకు లోపల ఉండే ఇనుప చువ్వలు బయటకు వచ్చేశాయి. కృష్ణా నదికి సోమవారం రికార్డు స్థాయిలో వరద వచ్చింది. ఎగువన భవానీపురం, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లి బోట్లకు లంగరేశారు. వరద ఉధృతికి వీటిలో 4 బోట్లు కొట్టుకొచ్చాయి. ఇందులో ఒక బోటు 69వ గేటు వద్ద ఉన్న కౌంటర్ వెయిట్‌ను ఢీ కొట్టడంతో విరిగిపోయి ఇరుక్కుపోయింది. ఈ బోటును ఢీ కొని మరో రెండు బోట్లు ఆగిపోయాయి. మరో బోటు 64వ నంబరు ఖానా వద్ద ఉన్న కౌంటర్ వెయిట్‌ను ఢీ కొట్టడంతో స్వల్పంగా దెబ్బతింది. ఈ బోటూ ఇక్కడ ఇరుక్కుపోయింది. దెబ్బతిన్న కౌంటర్ వెయిట్లను జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్, డ్యామ్ సేఫ్టీ అధికారులు పరిశీలించారు. జలవనరుల శాఖ సలహాదారు, గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడిని ప్రభుత్వం పిలిపించింది. ఆయన రాత్రికల్లా హుటాహుటిన బ్యారేజీకి వచ్చి పరిశీలించారు. ఈ రెండు చోట్ల గేట్లకు నష్టం లేదని నిర్ధారించారు. అనంతరం మాట్లాడుతూ.. కౌంటర్ వెయిట్లను మార్చేసి కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. జలవనరుల శాఖ వర్క్‌షాపులో కొత్త కౌంటర్ వెయిట్లను తయారు చేయించి ఇక్కడికి తీసుకొచ్చి అమర్చుతారన్నారు. దీనికి సంబంధించిన డిజైన్‌ను మంగళవారం మరోమారు పరిశీలించి ఖరారు చేస్తామన్నారు. ప్రస్తుతం గేటు కిందికి దిగడానికి ఇబ్బంది లేదని చెప్పారు. ప్రవాహం 8 లక్షల క్యూసెక్కులకు తగ్గాక ఇరుక్కుపోయిన బోటును తీసేసి.. తర్వాత కౌంటర్ వెయిట్లు ఏర్పాటు చేస్తామని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆయన వెంట నిమ్మల, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు ఉన్నారు.

కాగా.. బ్యారేజీకి ఎగువ, దిగువన సెకనుకు వరద ఆరు మీటర్ల వేగంతో ప్రవహిస్తున్నట్టు చెబుతున్నారు. ఒక్కో ఖానా నుంచి 1.25 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. దీన్ని లెక్కించిన అధికారులు వరద వేగం సెకనుకు ఆరు మీటర్లుగా ఉందని లెక్కించారు.

బ్యారేజీని పరిశీలించిన చంద్రబాబు

ప్రకాశం బ్యారేజీలో వరద పరిస్థితిని సీఎం చంద్రబాబు సోమవారం సాయంత్రం పరిశీలించారు. బ్యారేజీకి ఈ వైపు నుంచి ఆ వైపు మొత్తం నడుచుకుంటూ వెళ్లి ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లోను పరిశీలించారు. 64, 69వ ఖానాల వద్ద దెబ్బతిన్న కౌంటర్ వెయిట్లను చూశారు. అధికారులతో చర్చించారు.





కరకట్ట రక్షణకు ఇసుక బస్తాలను వేస్తున్న స్థానికులు

కృష్ణా కుడి కరకట్టపై గండ్లు!

- రేపల్లె, పల్లెపాలెం వాసులకు ముప్పు ?
- సముద్రానికి అమావాస్య 'పోటు' దెబ్బ

తెనాలి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి పోటెత్తిన వరదతో నదికి కుడివైపు ఉన్న కరకట్టకు గండ్లు పడ్డాయి. దీంతో కట్ట ఏ క్షణమైనా తెగిపోయే ప్రమాదం ఉందని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో గండ్లు పూడ్చేందుకు సిబ్బందిని రంగంలోకి దించి నిరంతరం శ్రమిస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ దిగువన కొల్లిపర మండలం వల్లభాపురం మొదలుకుని సముద్రం అంచునున్న రేపల్లె మండలం లంకెవానిదిబ్బ వరకు కరకట్టను ఆనుకుని ఉన్న గ్రామాల వారికి ముప్పు పొంచి ఉందని అధికారుల సైతం చెబుతున్నారు. గతంలో ఓలేరు దగ్గర పడిన గండికి దగ్గర్లోనే కరకట్ట పైనుంచి నీరు ఉధ్రుతంగా ప్రవహిస్తోంది. కరకట్ట ఆధునికీకరణ పనులు ఇక్కడ జరగకపోవటంతో ప్రయాణానికి వీలు లేని విధంగా కరకట్ట కుంగిపోయింది. దీనికి తోడు కృష్ణానదికి సోమవారం 11.43 లక్షల క్యూసెక్కుల వరద రావటంతో పెద పులివర్రు దగ్గర, పల్లెపాలెం దగ్గర కరకట్ట అంచులకుపైగా నీరు ప్రవహిస్తోంది. దీంతో అప్రమత్తమైన స్థానికులు పొక్లెయిన్, ట్రాక్టర్‌లతో మట్టిని తెచ్చి కట్టపై నుంచి నీరు దిగువకు రాకుండా చూస్తున్నారు. రేపల్లె పట్టణం సహా మరికొన్ని గ్రామాలపై ప్రభావం ఉంటుందన్న ఉద్దేశంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలను అక్కడ నుంచి ఖాళీ చేయించారు. పలు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. సముద్ర తీరాన్ని ఆనుకుని ఉన్న రేపల్లె మండలం లంకెవానిదిబ్బ గ్రామంపైనా కృష్ణా కుడికట్ట గండ్ల ప్రభావం పడింది. రాజుకాల్వ-లంకెవానిదిబ్బ మధ్య కరకట్ట కేవలం నడక దారిగా మారిపోయింది. పక్కనే రొయ్యల చెరువులు ఉండడం, సముద్ర పోటు ప్రభావం కూడా ఉండడంతో కరకట్టకు పలుచోట్ల గండ్లు పడుతున్నాయని గ్రామస్థులు గుర్తించారు. దీంతో అధికారులు హుటాహుటిన స్పందించారు. సోమవారం అమావాస్య ఘడియలు ప్రవేశించటంతో సముద్రం పోటెత్తుతోందని అధికారులు చెబుతున్నారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, గొట్టిపాటి రవికుమార్ క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు.

30 గ్రామాలకు తెగిన లింకులు

కృష్ణా కుడి లంక పరిధిలో ఉన్న 30 గ్రామాల ప్రజలకు ఆదివారం రాత్రి నుంచే బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. సోమవారం ఉదయానికి రెండు వేల మందిని పునరావాస శిబిరాలకు తరలించారు. గ్రామాల్లో కరెంటు సరఫరాను నిలిపివేశారు. జనరేటర్ల ద్వారా విద్యుత్‌ను అందిస్తున్నారు.

గత ప్రభుత్వ పాపాలే శాపాలై!

- కరకట్ట పటిష్టతను పట్టించుకోని జగన్
- వరద ప్రవాహంతో ఎక్కడికక్కడ లీకులు

బాపట్ల-ఆంధ్రజ్యోతి)

గత జగన్ పాలనలో కృష్ణానదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న కరకట్టల పటిష్టానికి ఎలాంటి చర్యలు తీసుకోని ఫలితంగా ప్రజలు ముంపు ముప్పులో చిక్కుకునే పరిస్థితి ఏర్పడింది. పటిష్టత ఎలా ఉన్నా.. కరకట్టల సమీపంలో నిబంధనలను ఉల్లంఘించి యథేచ్ఛగా చేపట్టిన మట్టి తవ్వకాలతో కట్టలు మరింత బలహీనపడ్డాయి. దీంతో ఇప్పుడు పోటెత్తిన వరద నదీ పరివాహక ప్రజల కంటిపై కునుకు లేకుండా చేసింది. 2019 ఎన్నికలకు ముందు ప్రచారంలో భాగంగా కరకట్టలను బలోపేతం చేయడానికి ప్రణాళికలు రూపొందించడంతో పాటు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని జగన్ హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల పాలనలో వాటి పటిష్టానికి ఒక్క రూపాయి విదల్చలేదు. వాటికి కనీస మరమ్మతులు కూడా ఏళ్ల తరబడి చేయకపోవడంతో అవి లీకుల దశకు చేరాయి. కొన్ని చోట్ల గండ్లు పడి మరికొన్ని చోట్ల ప్రమాద స్థితికి చేరుకున్నాయి.



కష్టకాలం

ముంపులోనే విజయవాడ

కనుచూపు మేరలో నీరే....

విజయవాడలో వరద బీభత్సానికి సాక్ష్యమీ చిత్రం. కనుచూపు మేరలో నీరు తప్ప మరేమీ కనిపించని పరిస్థితి.



చంటి బిడ్డ క్షేమంగా...

విజయవాడలోని రాజీవ్ నగర్‌లో కర్రలను ఒక్కటిగా చేసి కట్టి తల్లి, చంటి బిడ్డను తరలిస్తున్న స్థానికులు



వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని ఒడ్డుకు చేరుస్తున్న జనసైనికులు ఓంకార్, పచ్చిపాల శేఖర్ తదితరులు



సింగ్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద వరద నీటి ప్రవాహంలో స్థానికులు



ట్యూబు బోట్లతో రక్షించి...

పాయకాపురంలో ట్యూబులనే బోట్లుగా పిల్లలు, మహిళలను తరలిస్తున్న దృశ్యం



మోకాలి లోతు నీటిలో...

కండ్రికలో మోకాలి లోతు నీటిలో తాగునీరు, ఆహారపు ప్యాకెట్లు, ఇతర నిత్యావసరాలు తెచ్చుకుంటున్న జనం



చీరతో కట్టి...

కండ్రికలో స్కూటీలు కొట్టుకుపోకుండా చీరతో కట్టిన దృశ్యం

(మొదటి పేజీ తరువాయి)

దిగువన ఉన్న రామలింగేశ్వరనగర్ ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. కృష్ణానది వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో ప్రకాశం బ్యారేజీ నుంచి వరద బయటకు వచ్చి బెర్మ్ పార్కును ముంచేసింది. జాతీయరహదారి మీదుగా భవానీపురంలోకి వరద ప్రవేశించడంతో ఆ ప్రాంతంలో మూడు అడుగుల మేర వరద నీరు నిలిచిపోయింది. మరోవైపు రామలింగేశ్వరనగర్ ప్రాంతంలో కృష్ణా నదిలోకి కలిసే ఔట్‌ఫాల్ డ్రైన్ల నుంచి వరద నీరు ఎగతన్నడంతో ఆ ప్రాంతంలో నాలుగు అడుగులుపైగా వరద వచ్చేసింది. మరోవైపు బుడమేరు వరద సోమవారం రెండో రోజూ కొనసాగింది. సహాయక చర్యలు పూర్తిస్థాయిలో అందడం లేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది. చంద్రబాబు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సమస్త యంత్రాంగాన్ని రంగంలోకి దింపి పరుగులు పెట్టిస్తున్నా.. ఇంకా వేలాదిమంది సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

బుడమేరు డైవర్షన్ చానల్ కుదేలు

విజయవాడ దుఃఖదాయనిగా పేరున్న బుడమేరుకు వరద వస్తే దాని పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలతో పాటు విజయవాడ పల్లపు ప్రాంతాల ప్రజలకు కంటి మీద కునుకుండదు. గడిచిన 40 ఏళ్లలో బుడమేరుకు ఈ స్థాయిలో వరద వచ్చింది లేదు. అయితే శని, ఆదివారాల్లో బుడమేరుకు 35 వేల క్యూసెక్కుల మేర భారీ వరద వచ్చి చేరింది. ఇలా వస్తున్న వరదను బుడమేరు డైవర్షన్ చానల్ (బీడీసీ) ద్వారా మళ్లించడంతో ఎడమ వైపు ఉన్న కట్టకు కవులూరు - శాంతినగర్ గ్రామాల మధ్య మూడు చోట్ల గండ్లు పడ్డాయి. కుడి వైపు కట్టకు ఏడు చోట్లకు పైగా గండ్లు పడ్డాయి. దీంతో కృష్ణానదికి చేరాల్సిన వరద మొత్తం విజయవాడ వైపు వచ్చేసింది. డైవర్షన్ చానల్ ద్వారా కృష్ణా నదికి చేరిన బుడమేరు వరద సైతం కృష్ణా వరద ఉధృతితో వెనక్కి తన్నడంతో గండ్ల నుంచి మరింత ఎక్కువగా బుడమేరు వరద విజయవాడను ముంచెత్తింది. మరోవైపు ఊహించని వరద బుడమేరును తాకడంతో వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ 11 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఆ వరద మొత్తం కవులూరు, ఈలప్రోలు, పైడూరుపాడు, కొత్తూరు తాడేపల్లి, భవానీపురం, గొల్లపూడి, జక్కంపూడి, రాయనపాడు గ్రామాలతోపాటు విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతాన్ని ముంచెత్తింది. అధికారుల ప్రణాళిక లోపంతో దిగువ ప్రాంతాలను అప్రమత్తం చేయకపోవడంతో లక్షలాది మంది భారీగా ముంపు ప్రభావానికి గురయ్యారు. గత వైసీపీ ప్రభుత్వంలో బీడీసీ కట్టల బలోపేతానికి ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. అంతకుముందు 2016లో టీడీపీ ప్రభుత్వం.. కట్టలపై జంగిల్ క్లియర్ చేసి గ్రావెల్‌తో కట్టలను బలోపేతం చేశారు. ఆ తర్వాత పట్టించుకున్నది లేదు.

జాతీయ రహదారిపై అవస్థలు..

ఆదివారం మునేరు ఉధృతితో నందిగామ మండలం ఐతవరం వద్ద జాతీయ రహదారిపైకి వరద రావడంతో హైదరాబాద్ నుంచి విజయవాడకు రాకపోకలు స్తంభించాయి. వందలాది వాహనాలు జాతీయ రహదారిపై నిలిచిపోయాయి. సోమవారం సాయంత్రానికి మునేరు శాంతించడంతో రాత్రి నుంచి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. జగ్గయ్యపేట మండలం గరికపాడు వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడ జాతీయరహదారిపై ఉన్న వంతెన అప్రోచ్ రోడ్డు వరద ఉధృతికి కోసుకుపోయింది. హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను, విజయవాడ వైపు వచ్చే వాహనాలను ఇతర మార్గాల్లో మళ్లించినప్పటికీ లారీలు, భారీ వాహనాల సిబ్బంది, బస్సుల్లోని ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. తినడానికి తిండి, కనీసం గొంతు తడుపుకొనేందుకు మంచినీళ్లు సైతం దొరక్క అల్లాడిపోవాల్సి వచ్చింది. వరద మధ్యలో మెరక ప్రాంతంలో 40కి పైగా వాహనాలు ఇరుక్కుపోయాయి. ఆదివారం బయటకు తీసుకురావటానికి వీలుపడలేదు. క్రేన్ సాయంతో జనాలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. వరద ఉధృతికి ఆరుకార్లు కొట్టుకుపోయాయి. అయితే ఎలాంటి ప్రాణనష్టం సంభవించ

ఇబ్రహీంపట్నం రింగ్‌ను తాకిన కృష్ణమ్మ

కృష్ణానదికి వస్తున్న వరదతో ఇబ్రహీంపట్నం మండలంలోని ఏటిపట్టు గ్రామాలతోపాటు విజయవాడ - హైదరాబాద్ పక్కన ఉన్న గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. దాములూరు, చిలుకూరు దొనబండ, కొటికలపూడి, మూలపాడు, జూపూడి, కిలేశపురం, గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. ఫెర్రీ మొత్తం నీట మునిగింది. ఇబ్రహీంపట్నం రింగ్‌కు కేవలం 10 అడుగుల దూరం వరకు వరద వచ్చి ఆగింది. మూలపాడు, కేతనకొండ, పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద జాతీయ రహదారిపైకి వరద నీరు చేరుకుంది. వరద ముంపునకు గురైన ప్రాంతాల నుంచి ప్రజలు జాతీయ రహదారి పైకి చేరుకుని వంటలు చేసుకోవడం కనిపించింది. వందల మంది నిరాశ్రయులతో జాతీయరహదారి నిండిపోయింది.

కన్నీటి విపత్తు!

రాష్ట్ర వ్యాప్తంగా 19 మంది మృతి

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 19 మంది మృతి చెందారు. ఎన్టీఆర్ జిల్లాలో 9 మంది మృత్యువాత పడగా, గుంటూరు జిల్లాలో ఏడుగురు, ప్రకాశం జిల్లాలో ముగ్గురు మరణించారు.

ఎక్కడెక్కడంటే..

- విజయవాడ మొగల్రాజపురంలో కొండచరియలు విరిగిపడి ఐదుగురు, విజయవాడ రూరల్, జీ కొండూరు, రెడ్డిగూడెం, పైడూరుపాడులో ఒక్కొక్కరు చొప్పున మృత్యువాత పడ్డారు.
- గుంటూరు జిల్లా.. పెదకాకాని మండలంలో ఇద్దరు సహా ఒక టీచర్, ఇద్దరు విద్యార్థులు కారులో కొట్టుకుపోయి మృతి చెందారు. ఒక యువకుడు కొండవీటివాగులో పడి ప్రాణాలు కోల్పోయాడు. మంగళగిరిలో వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయారు.
- ప్రకాశం జిల్లాలో ముగ్గురు చిన్నారులు ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డారు. గుంటూరు-నందివెలుగు రోడ్డులో వరదనీటిలో గుర్తుతెలియనివ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు.
- విజయవాడలో 275 రైళ్లు రద్దు అయ్యాయి. 149 రైళ్లను దారి మళ్లించారు.

4.68 లక్షల ఎకరాల్లో పంట మునక

వర్షాలు, వరదలకారణంగా 4,31,355 ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 37,397 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని అధికారులు అంచనా వేశారు. 3,18,220 ఎకరాల్లో వరి, 64,782 ఎకరాల్లో పత్తి, 28,085 ఎకరాల్లో మొక్కజొన్న, 6,477 ఎకరాల్లో మినుము, 6,167 ఎకరాల్లో కంది, 2,610 ఎకరాల్లో పెసర, 1,945 ఎకరాల్లో వేరుశనగ, 5,012 ఎకరాల్లో ఇతర పంటలు ముంపుబారిన పడ్డాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం 20 జిల్లాల్లో 365 మండలాలు వర్షాలు, వరదల ప్రభావానికి గురి కాగా, 2,475 గ్రామాల్లో 2లక్షల మంది రైతులకు నష్టం జరిగినట్లు భావిస్తున్నామని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు.



బోటొచ్చింది... ఎక్కేయండి

పాయకాపురంలో బాధితులను తరలించేందుకు తీసుకొచ్చిన బోటులో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్న స్థానికులు

కలెక్టరేట్‌లోనే సీఎంవో

- బెజవాడ కలెక్టరేట్‌లో చంద్రబాబు
- వరద ప్రాంతాల్లో రోజంతా తిరుగుతూ, విరామంలో కలెక్టరేట్‌లో సమీక్షలు

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తాను కదిలి..యంత్రాంగాన్ని వేగంగా నడిపిస్తూ, వరద సహాయచర్యలను వరుసగా రెండోరోజూ ముఖ్యమంత్రి చంద్రబాబు ముమ్మరం చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌ను తన కార్యాలయంగా మార్చుకున్నారు. యావత్ సీఎం కార్యాలయం కలెక్టరేట్‌లోనే తిష్టవేసింది. రోజంతా వరద ప్రాంతాల్లో పర్యటిస్తూ, బాధితులను ప్రత్యక్షంగా కలుసుకుని ధైర్యం చెప్పడం, మధ్యలో విరామంలో కలెక్టరేట్‌కు చేరుకొని సమీక్షలు నిర్వహించడం.. ఇలా అలుపెరగకుండా చంద్రబాబు పనిచేస్తున్నారు. మంత్రులందరూ విజయవాడ కలెక్టరేట్‌కు వచ్చి వరద బాధితులకు సాయం చేయడంలో నిమగ్నమయ్యారు.

> "విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెండోరోజు కూడా పర్యటించాను. బాధిత ప్రజలకు అందుతున్న సాయాన్ని స్వయంగా పర్యవేక్షించి, వారికి భరోసా అందించాను. కేంద్రం పంపిన పవర్ బోట్లు, రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఏర్పాట్ల ద్వారా సహాయక చర్యల్లో వేగం పెంచాం. ప్రజల భద్రత మా బాధ్యత." - చంద్రబాబు ట్వీట్

అధికారులూ.. అప్రమత్తం!

బుడమేరు వరద బాధితులకు అందుతున్న సాయాన్ని పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం మరోసారి సీఎం చంద్రబాబు సమీక్షించారు. బోట్లలో వెళ్లడానికి అవకాశం లేని ప్రాంతాలకు హెలికాప్టర్ల ద్వారా ఆహారం, నీళ్లు, పాలు అందజేయాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే.. రెండు హెలికాప్టర్లు ద్వారా బుడమేరు ముంపు ప్రాంతాల్లో బాధితులకు ఎన్డీఆర్ఎఫ్ ఆహారం అందించింది.

సెక్యూరిటీ ఇబ్బందులున్నా...

విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ వరద ముంపు ప్రాంతాల్లో బాధితుల్లో ఆత్మస్థైర్యం నింపి వారికి అందిస్తున్న సహాయక చర్యలు పరిశీలించేందుకు ఆదివారం అర్ధరాత్రి ముఖ్యమంత్రి స్వయంగా బాధితులతో మాట్లాడారు. అక్కడ నుంచి బయలుదేరి విజయవాడ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. బాధల్లో ఉన్న ప్రజలకు ధైర్యం చెప్పాలనే అర్ధరాత్రి అయినా వెళ్లానని సీఎం ఈ సందర్భంగా తెలియజేశారు. నిజానికి, సెక్యూరిటీ కారణాల రీత్యా వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించవద్దని చంద్రబాబుకు నిఘా వర్గాలు సూచించాయి. అయినా, ప్రజలు ఇబ్బంది పడుతుంటే వారి దగ్గరకు వెళ్లకుండా ఎలా ఉంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

రెండు గంటలు మాత్రమే పడుకొన్న బాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం రాత్రి కేవలం రెండు గంటలు మాత్రమే పడుకొన్నారు. సోమవారం తెల్లవారుజాము వరకూ ఆయన విజయవాడ నగరం, చుట్టుపక్కల వరద ప్రాంతాల్లో పర్యటించారు. విజయవాడ నగరంలో కొంత భాగం బుడమేరు వరద ముంపునకు తీవ్రంగా ప్రభావితం అయిన బాధితులకు సహాయం అందడం లేదన్న ఫిర్యాదులు బాగా వస్తుండటంతో ఆదివారం అంతా ఆయన దానిపైనే దృష్టి పెట్టారు. ఆదివారం రాత్రి పదకొండు గంటలకు ఆయన ముంపు ప్రాంతాలకు బయలుదేరి వెళ్లారు. కొంత వరకూ రోడ్డు మార్గంలో వెళ్లి ఆతర్వాత పడవలో తిరిగి బాధితులతో మాట్లాడారు. తిరిగి సోమవారం తెల్లవారుజాము నాలుగు గంటలకు చంద్రబాబు విజయవాడ కలెక్టరేట్‌కు చేరుకొన్నారు. సరిగ్గా రెండు గంటలు మాత్రం విశ్రాంతి తీసుకొన్న తర్వాత సోమవారం ఉదయం ఆరు గంటలకు ఆయన లేచి తయారై కలెక్టరేట్‌లో సమీక్షలు ప్రారంభించారు. తిరిగి పదకొండు గంటలకు బయలుదేరి విజయవాడ నగరంలోని ముంపు ప్రాంతాలకు బయలుదేరి వెళ్లారు.

ఇంత వరద చూడలేదు: పయ్యావుల

200 ఏళ్ల చరిత్రలో ఇంత భారీ వర్షం, విజయవాడలో ఇంతటి వరద ప్రభావం లేదని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సీఎం ముందుచూపు వల్లే యుద్ధ ప్రాతిపదికన సహాయచర్యలు చేపట్టేందుకు వీలైందన్నారు.

బుడమేరుపాపం వైసీపీదే: నిమ్మల

సంక్షోభాన్ని నివారించడంలో అనుభవజ్ఞులైన సీఎం ఉండటం వల్ల పెద్ద నష్టాన్ని అరికట్టగలిగామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. బుడమేరుకు గండ్లు పడటం గత ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు.



టబ్బే... తెప్ప...

పాయకాపురంలో నడుం లోతు నీళ్లలో తడుస్తూ.. ఇంటిలో వాడుకునే టబ్బులో పిల్లలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

వరద ప్రాంతాల్లో నేవీ సేవలు



విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం ప్రాంతాల్లో వరద బాధితులకు తూర్పు నౌకాదళం హెలికాప్టర్ ద్వారా సేవలు అందించింది. రెండు హెలికాప్టర్లు, ఒక డార్నియర్ విమానం ద్వారా ఆహార పొట్లాలు, మంచినీటి సీసాలు బాధితులకు అందజేసింది. వివిధ ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకున్న 22 మందిని రక్షించింది.

5లక్షల ఎక్స్‌గ్రేషియా

- మృతుల కుటుంబాలకు సాయం పెంపు.. ఉచితంగా నిత్యావసర వస్తువులు.. సీఎం ఉదారత.. ఉత్తర్వులు జారీ

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా మరణించిన వ్యక్తి కుటుంబానికి ఇచ్చే పరిహారాన్ని ప్రభుత్వం పెంచింది. ఇందుకోసం ఎస్డీఆర్ఎఫ్ నిబంధనలను సవరించింది. గతంలో రూ.4లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వగా, ఈ మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచుతామని సీఎం చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో పరిహారం పెంపుదలపై ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత వర్షాలు, వరదల కారణంగా మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల సాయం అందించనున్నారు. ఇప్పటికే కలెక్టర్లకు విడుదల చేసిన నిధుల నుంచి ఈ మొత్తాన్ని చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే వరద ప్రభావిత ప్రాంతాల్లోని కుటుంబాలకు నిత్యావసర వస్తువుల పంపిణీకి సంబంధించిన ఉత్తర్వులను కూడా ప్రభుత్వం జారీ చేసింది. చేనేత, మత్స్యకార కుటుంబాలకు 50కిలోలు, ఇతరులకు 25కిలోల చొప్పున బియ్యం, కిలో చొప్పున కందిపప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, పంచదార ఉచితంగా ఇవ్వనున్నారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి, కోనసీమ, విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో వరద బాధిత కుటుంబాలకు ఈ సరుకులు పంపిణీ చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.



విజయవాడ రామలింగేశ్వరనగర్‌లో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు



వరద ప్రభావిత ప్రాంతాల్లో పవర్‌బోట్‌లో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వరద బాధితుల సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రి లోకేశ్



వరద ముంపు ప్రాంతంలో మంత్రి అచ్చెన్న

ధైర్యంగా ఉండండి

- బాధితులందరినీ ఆదుకుంటాం.. సాయమందే దాకా బెజవాడలోనే ఉంటా
- చివరి ప్రాంతాల బాధితులకూ సాయం: ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరద నీటిలో చిక్కుకున్న బాధితులు ఎవరూ భయపడాల్సిన పని లేదని, అందరినీ ఆదుకుంటామని, అందరూ ధైర్యంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. బాధితులకు అవసరమైన సహాయక చర్యలన్నీ చేపడుతామని, తాను ఇక్కడే (విజయవాడ) ఉంటానని చెప్పారు. ఆదివారం నుంచి రెండు రోజులుగా విజయవాడలోనే ఉంటూ పగలూ, రాత్రీ నిర్విరామంగా సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ బాధితుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుంటున్నారు. సోమవారం ఉదయమే సింగ్‌నగర్‌లో ముంపు ప్రాంత బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 'బాధితులందరికీ ఆహార ప్యాకెట్లు, పాలు, మంచినీళ్లు, బిస్కెట్లు అన్నీ వెళ్తున్నాయి. చివరి ప్రాంతాల బాధితులకు కూడా అందేలా చర్యలు తీసుకుంటున్నాం. బాధితుల్లో కొంతమంది పేషెంట్లు, చిన్నపిల్లలు, వృద్ధులు ఉన్నారు. వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం ఉంది' అని చంద్రబాబు అన్నారు. పేషెంట్లను ఆస్పత్రులకు తీసుకెళ్లడానికి వాహనాలు రావడం లేదని ఈ సందర్భంగా కొందరు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 'ఒక గంట టైమ్ ఇవ్వండి. అన్నీ స్ట్రీమ్‌లైన్ చేస్తాను. 110 పైగా బోట్లు బాధితుల సహాయక చర్యల్లో పని చేస్తున్నాయి. వర్షం పడుతున్నా ఎక్కడా సహాయక చర్యలను ఆపకుండా కొనసాగిస్తున్నాం. ఎప్పుడూ రానంత వరద వచ్చింది. బాధితులను ఆదుకునేందుకు అన్నివిధాలుగా కష్టపడుతున్నాం' అని చంద్రబాబు హామీ ఇచ్చారు. సోమవారం విజయవాడ కలెక్టరేట్ కేంద్రంగా చంద్రబాబు పర్యవేక్షణ జరిపారు. రామలింగేశ్వర నగర్ ప్రాంతంలో మోకాలి లోతు నీటిలో దిగి నడుచుకొంటూ వెళ్లి బాధితులతో మాట్లాడారు. సితార సెంటర్ ప్రాంతంలో జేసీబీపై మంత్రులతో పాటు ఎక్కి వరద నీరు నిలిచిపోయిన వీధుల్లో తిరిగారు. ప్రకాశం బ్యారేజీని పరిశీలించారు. సహాయక కార్యక్రమాల్లోకి తొలిసారి డ్రోన్లు రంగంలోకి దిగాయి. వరద వల్ల కిందకు రాలేక పై అంతస్థుల్లో ఉన్నవారికి డ్రోన్ల ద్వారా ఆహారం, పాలు, మంచినీళ్లు పంపారు. వరద ముంపు బాధితులకు ప్రభుత్వ పరంగా అందుతున్న సాయంపై చంద్రబాబు ఫోన్ల ద్వారా అభిప్రాయ సేకరణ చేయించారు.

వేగం పెరగాలి!

క్షేత్రస్థాయిలో దయనీయంగా పరిస్థితులు.. విపత్తు స్పందన సిబ్బంది రాకతో మెరుగు

- బోట్లు, పడవల ద్వారా బాధితుల తరలింపు
- అయినా... కొనసాగుతున్న కష్టాలు
- ఆహారం, పాలు, నీళ్ల కోసం ఎదురు చూపులు
- కరెంటు లేక మూగపోయిన సెల్‌ఫోన్లు
- అపార్ట్‌మెంట్లలో తాగునీటి కష్టాలు
- 'ముంపు' నుంచి 70వేల మంది తరలింపు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

ఒకవైపు బుడమేరు దండయాత్ర.. మరోవైపు కృష్ణమ్మ ఉగ్రరూపం! బెజవాడ గజగజలాడుతూనే ఉంది. బుడమేరు వరద ఉధృతి కాస్త ఉపశమించినా... కనీవినీ ఎరుగని స్థాయిలో, పాత రికార్డులను బద్దలు కొడుతూ కృష్ణా నది ఉరకలు వేస్తోంది. అటూ, ఇటూ ముంచెత్తుతున్న వరదతో నగరం విలవిలలాడుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా రంగంలోకి దిగిన తర్వాత సహాయ చర్యలు ఊపందుకున్నాయి. విపత్తు స్పందన సిబ్బంది, భారీ సంఖ్యలో బోట్లు, సహాయ సిబ్బంది, హెలికాప్టర్లు రంగంలోకి దిగడంతో సోమవారం సాయంత్రానికి పరిస్థితి కాస్త గాడిన పడింది. అయితే... వరద తీవ్రత, జరిగిన నష్టానికి ఈ వేగం సరిపోదని, మరింత పెరగాలని క్షేత్రస్థాయి పరిస్థితులను చూస్తే అర్థమవుతోంది.

చీకట్లోనే కష్టాలు...

ఆదివారం ఉదయం మొదలైన వరద కష్టాలు... సోమవారం నాడూ కొనసాగాయి. సుమారు రెండున్నర లక్షల మంది వరదనీటిలో చిక్కుకోగా... వీరిలో 70 వేల మందిని సహాయక శిబిరాలకు తరలించారు. పై అంతస్తుల్లో తలదాచుకునే అవకాశమున్న వారు అక్కడ ఉండటానికే మొగ్గు చూపుతున్నారు. వీరికి ఆహారం, తాగునీరు అందించడంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. వరద నీరు తగ్గకపోవడంతో రెండోరోజూ విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించలేదు. దీంతో సెల్‌ఫోన్లు చార్జింగ్ లేక మూగబోయాయి. అపార్ట్‌మెంట్లలో ఉన్న వారికి దాదాపు అని వసతులు ఉన్నా... కరెంటు లేకపోవడంతో నీటిసరఫరా ఆగిపోయింది.

బోట్ల ద్వారా సహాయం...

సోమవారం ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్‌తోపాటు వివిధ ప్రాంతాల నుంచి 173 బోట్లను తెప్పించారు. వీటి ద్వారా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తీసుకొచ్చారు. సింగ్ నగర్ ఫ్లైఓవర్ మీదకు చేరుకున్న వరద బాధితుల్లో పలువురు పసిపిల్లలను ఎత్తుకుని రావడం కనిపించింది. రెండు రోజులుగా ఆహారం లేక విలవిలలాడిపోయామని బాధితులు వాపోయారు. చంటి బిడ్డల పరిస్థితి తలచుకుని వణికిపోయామని, వరదలో నుంచి బయటపడతామని అనుకోలేదని 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. బాధితుల్లో కొందరు నిండు గర్భిణీలు కూడా ఉన్నారు. ఎటూ కదల్లేక కాళ్లు వాచిపోయి నరకయాతన అనుభవించినట్లు గర్భిణీలు తెలిపారు. ఆహారం అందక, ఆకలితో ఉన్న బాధితులు ఫ్లైఓవర్ మీదకు చేరుకోగానే సహాయ సిబ్బంది అందించిన ఆహారాన్ని తీసుకుని, అక్కడే తిని కడుపునింపుకొన్నారు. పలువురు బాధితులు ముఖ్యమైన వస్తువులు, పుస్తకాలు, దుస్తులతో సింగ్‌నగర్ ఫ్లైఓవర్ మీదకు చేరుకుని... అక్కడి నుంచి తమ బంధువులు, సన్నిహితుల ఇళ్లకు బయలుదేరారు. బుడమేరు ముంపు బాధితులు చాలా మంది సమస్తం వరదలోనే వదిలేసి వచ్చారు. వేల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లు నీటమునిగిపోయాయి.

నీళ్లలోనే చావులు..

సింగ్‌నగర్ మసీదు రోడ్డులో ఆదివారం మధ్యాహ్నం వరద నీరు పెరుగుతుండటంతో ఓ కుటుంబం నాలుగు అడుగుల లోతు నీటిలోనే సురక్షిత ప్రాంతానికి చేరుకునే ప్రయత్నం చేసింది. అదే సమయంలో ఆ కుటుంబానికి చెందిన 60 ఏళ్ల పైబడిన వృద్ధురాలు గుండెపోటుకు గురై మృతి చెందింది. ఆ మృతదేహన్ని నీటిలో ఒడ్డుకు చేర్చడం కష్టమని భావించిన కుటుంబ సభ్యులు, వరద తగ్గాక దహన సంస్కారాలు చేయొచ్చుననే ఉద్దేశంతో... కారుపైన మృతదేహన్ని ఉంచి వారంతా సురక్షిత ప్రాంతానికి చేరుకున్నారు. అయితే, అనూహ్యంగా వరద పెరిగిపోవడంతో మృతదేహం వరద నీటిలో కొట్టుకుపోయింది. సింగ్‌నగర్ పెట్రోల్ బంక్ సమీపంలో ఒక శతాధిక వృద్ధురాలు ఆదివారం సహజ మరణం చెందారు. ఆ మృతదేహన్ని బయటకు తీసుకురాలేక ఖననం చేయలేక ఆ కుటుంబం తీవ్ర మానసిక క్షోభకు గురైంది. సోమవారం ప్రత్యేక అంబులెన్స్‌లో మృతదేహన్ని, వారి కుటుంబ సభ్యుల్ని తరలించారు.

ఆకలిని తట్టుకోలేక..

సోమవారం ముంపు బాధితులను బోట్లలో సింగ్ నగర్ ఫ్లైఓవర్ వద్దకు తీసుకొచ్చిన సమయంలో పలువురు స్పృహ తప్పిపడిపోవడం కనిపించింది. రెండురోజులు తినేందుకు తిండి, తాగేందుకు నీరు లేక వీరు డీహైడ్రేషన్‌కు గురైనట్లు వైద్యులు తెలిపారు. వీరిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

నెల రోజుల పాపను బతికించుకోవాలని..

సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియం దగ్గర నివసిస్తున్న శిరీష అనే మహిళ ఒక నెల రోజుల పసికందుతో రెండురోజులుగా వరద నీటిలోనే ఉండిపోయారు. పాపకు పాలు పడుదామన్నా అవకాశం లేకుండాపోయిందని, తమకూ రెండు రోజులపాటు ఆహారం లేదని, బిడ్డ చనిపోతోందేమోనన్న భయంతో... భర్త సాయంతో ఒక టబ్‌లో చంటిబిడ్డను పెట్టి, దాన్ని నెత్తిమీద పెట్టుకుని సుమారు కిలోమీటరు మేర వరద నీటిలోనే నడుచుకుంటూ సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌కు చేరుకుంది.

బెజవాడ రైల్వే బ్రిడ్జికి డేంజర్ బెల్స్

- బ్రిడ్జి అడుగువరకు వరద నీరు
- బ్రిడ్జిని పరిశీలించిన డీఆర్ఎం పాటిల్
- చివరిగా ఎనిమిదేళ్ల క్రితం మరమ్మతులు

విజయవాడ/వన్‌టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే బ్రిడ్జిని ప్రమాదకరస్థాయిలో వరద తాకుతోంది. గత 15ఏళ్ల చరిత్రలో చూడని విధంగా రైలు పట్టాలకు అడుగున్నర తక్కువ ఎత్తున వరద ప్రవహిస్తోంది. ఎనిమిది సంవత్సరాల కిందట చివరిసారిగా బెజవాడ రైల్వే బ్రిడ్జికి మరమ్మతులు నిర్వహించారు. అడుగున పిల్లర్లకు డ్యామేజీ వాటిల్లకుండా ఉండటానికి అప్పట్లో చర్యలు చేపట్టారు. విజయవాడ డీఆర్ఎం నరేంద్ర.ఎ.పాటిల్ రైల్వే బ్రిడ్జిని సోమవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఇదే ప్రవాహం ఒకటి నుంచి రెండు రోజుల వరకు ఉంటే రైల్వే బ్రిడ్జి దెబ్బతినే అవకాశం ఉందని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని స్వల్ప సంఖ్యలో నడుస్తున్న రైళ్లను రైల్వే బ్రిడ్జిమీద పరిమిత వేగంతో నడపాలని ఆదేశాలు జారీచేశారు. రైల్వే బ్రిడ్జి కింద నీటి ప్రవాహ స్థాయిలను అంచనా వేయడానికి మూడు వంతెనల దగ్గర సిబ్బందిని నియమించారు.

గతంలోనే హెచ్చరికలు..

విజయవాడ రైల్వే బ్రిడ్జిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని గతంలోనే కేంద్ర రైల్వే బ్రిడ్జిల విభాగం హెచ్చరించింది. ఆ తరువాత చాలాకాలానికి రైల్వే అధికారులు బ్రిడ్జి బలోపేత పనులు చేపట్టారు. ఈ క్రమంలో కొత్త బ్రిడ్జిని నిర్మించాలన్న ప్రతిపాదన కూడా వచ్చింది. ప్రస్తుత అవసరాల రీత్యా ఈ బ్రిడ్జి సరిపోతుందని రైల్వే అధికారులు భావించారు. దీంతో కొత్త బ్రిడ్జి ప్రతిపాదన ఆటకెక్కింది.

రికార్డుస్థాయిలో రైళ్ల రద్దు...

విజయవాడ డివిజన్ మీదుగా సాగే 450 రైళ్లలో 436 రైళ్లు వరద ప్రభావానికి గురయ్యాయి. ఖాజీపేట, విజయవాడ సెక్షన్‌లో వరద కారణంగా 275 రైళ్లను రద్దు చేశారు. 149 రైళ్లను దారి మళ్లించారు. మరో 12 రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. ఖాజీపేట, విజయవాడ సెక్షన్‌లో గండ్లు పడి అటువైపు రైల్వే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

విజయవాడలో జగన్ పర్యటన

- ముంపు బాధితులకు పరామర్శ.. వరదలోనూ రాజకీయ విమర్శలు

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో వైసీపీ అధ్యక్షుడు జగన్ పర్యటించారు. సోమవారం సింగ్‌నగర్, రాజ్యలక్ష్మినగర్ ప్రాంతాల్లో బాధితులను పరామర్శించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు వరద ముంపుపై ముందస్తు హెచ్చరికలు చేయలేదని విమర్శించారు. కరకట్టమీద ఉన్న చంద్రబాబు నివాసం ముంపునకు గురికాకుండా ఉండేందుకు బుడమేరు వరదకు కారకులయ్యారని ఆరోపించారు. ప్రకాశం బ్యారేజీకి 11 లక్షల క్యూసెక్కుల వరద రావడం కొత్తేమీ కాదని, 1903, 2009లోనూ వచ్చిందన్నారు. తన హయాంలోనూ ఎనిమిది లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా యాజమాన్య నిర్వహణతో అదుపు చేశామని తెలిపారు. ప్రకాశం బ్యారేజీ గేట్లను ముందస్తుగా ఎత్తివేసి వరదను వదిలేసి ఉంటే విజయవాడకు వరద ముప్పువాటిల్లేది కాదని జగన్ అన్నారు. ఇటీవల అనకాపల్లి జిల్లాలో ఫార్మా కంపెనీ ప్రమాద ఘటన బాధితులను పరామర్శించడానికి వెళ్లినపుడు కూడా జగన్ రాజకీయ విమర్శలు చేయడంతో పాటు తన గురించి లేనిపోని గొప్పలు చెప్పుకొన్నారు.

మహిళ నుంచి ఊహించని ప్రశ్న

జగన్ కేవలం 40 నిమిషాల్లోనే వరద ప్రాంతాల్లో పర్యటనను పూర్తి చేశారు. బాధితుల వద్దకు వెళ్లి సహాయక చర్యలపై జగన్ ఆరా తీయగా... తమకు సహాయం అందుతోందని చెప్పడంతో ఆయన ఏమీ మాట్లాడకుండా నవ్వుతూ వచ్చేశారు. సింగ్‌నగర్, రాజ్యలక్ష్మినగర్‌లో మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ... ప్రభుత్వం వరద బాధితులకు సహాయం అందించడం లేదని ఆరోపించారు. వెంటనే ఒక మహిళ స్పందిస్తూ భుజం లోతు వరకూ నీళ్లొచ్చాయని, ఇంత వరద వస్తే ఎవరైనా ఏం చేయగలుగుతారంటూ జగన్‌ను ప్రశ్నించారు. తమకు ప్రభుత్వం నుంచి సహాయం బాగానే అందుతోందని ఆమె జగన్ ముఖం మీద చెప్పేశారు.

కొసమెరుపు: జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వరదలు వచ్చినపుడు వర్షాలు తగ్గిపోయి, తీవ్రత తగ్గాక పరామర్శకు వెళ్లేవారు. కానీ ప్రతిపక్షనేత కాగానే ఇప్పుడు విజయవాడలో నడుంలోతు నీళ్లలోనూ బాధితులను పరామర్శించడం కొసమెరుపు.

భారీగా రైళ్లు రద్దు

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-విశాఖపట్నం, షాలిమార్-సికింద్రాబాద్, ఎస్ఎంవీటీ బెంగళూరు-హౌరా, ఆదిలాబాద్-నాందేడ్, భువనేశ్వర్- బెంగుళూరు, విశాఖపట్నం-గుంటూరు, విజయవాడ-నర్సాపూర్, విజయవాడ-కాకినాడ, లింగంపల్లి-విశాఖపట్నం, సికింద్రాబాద్-భువనేశ్వర్, హైదరాబాద్-కటక్, హౌరా -సికింద్రాబాద్, హౌరా-బెంగళూరు, టాటానగర్-ఎర్నాకులం, పురులియా-తిరునెల్వేలి, షాలిమార్-చెన్నై సెంట్రల్, హౌరా కన్యాకుమారి, సత్రాగంచి-తాంబరం, హటియా-ఎర్నాకుళం, చెన్నై సెంట్రల్-పురీ, మచిలీపట్నం-షిర్డీ, షాలిమార్-హైదరాబాద్, తిరుపతి-ఆదిలాబాద్, నర్సాపూర్- నాగర్‌పోల్, సికింద్రాబాద్-గుంటూరు, ఎస్ఎంవీటీ బెంగళూరు-దానాపూర్, మచిలీపట్నం-బీదర్, తిరుపతి-కాకినాడ, తిరుపతి-విశాఖపట్నం, హైదరాబాద్-తాంబరం, మహబూబ్‌నగర్-విశాఖపట్నం, సికింద్రాబాద్-మణుగూరు. విశాఖపట్నం-కడప, విశాఖపట్నం-చెన్నై సెంట్రల్, భువనేశ్వర్-సికింద్రాబాద్, సికింద్రాబాద్-షాలిమార్, కడప-విశాఖపట్నం, భువనేశ్వర్-బెంగళూరు, కాజీపేట-డోర్నకల్, విజయవాడ మార్గాల్లో నడిచే రైళ్లను రద్దు చేశారు. తిరుపతి-హిసార్, బెంగళూరు-దానాపూర్, హైదరాబాద్-షాలిమార్, నిజాముద్దీన్-చెన్నై, చండీఘర్-మదురై, న్యూఢిల్లీ-విశాఖపట్నం మార్గాల్లో ఇప్పటికే బయల్దేరిన రైళ్లను దారిమళ్లించారు.

రెండు వందే భారత్‌లు రద్దు..

దక్షిణ మధ్య రైల్వే నిర్వహిస్తున్న నాలుగు వందే భారత్ రైళ్లలో రెండింటిని రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం మార్గంలో రెండు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లను పూర్తిగా రద్దు చేయగా, సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్‌ను 5గంటలు ఆలస్యంగా రీ షెడ్యూలు చేశారు. కాచిగూడ- బెంగళూరు మధ్య వందేభారత్ యథావిధిగా నడుస్తోంది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సోమవారం ఎస్ఎంవీటీ బెంగళూరు-సికింద్రాబాద్ (06565) వన్‌వే ప్రత్యేక రైలును నడిపించారు.



సోమవారం రాత్రి ప్రకాశం బ్యారేజ్ నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ



విజయవాడలో కృష్ణా నదిపై ఉన్న రైలు బ్రిడ్జ్‌ని తాకుతున్నట్టుగా ప్రవహిస్తున్న కృష్ణా నది

ప్రకాశం బ్యారేజీకి రికార్డు వరద

- 11,43,201 క్యూసెక్కుల ప్రవాహం
- నేటికి 9 లక్షలకు తగ్గే చాన్సు
- కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- ఇంకో వారం అప్రమత్తంగా ఉండాలి
- వాతావరణ విభాగం సూచన

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ చరిత్రలోనే రికార్డు స్థాయిలో వరద ముంచెత్తింది. సోమవారం 11,43,201 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి కృష్ణా పరివాహక ప్రాజెక్టులకు వరద కొనసాగుతోంది. శ్రీశైలం జలాశయంలోకి 5,28,673 క్యూసెక్కులు వస్తుంటే.. 5,54,995 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. నాగార్జున సాగర్‌లోకి 4,68,595 క్యూసెక్కుల వరద వస్తుంటే.. కింద పులిచింతలకు 5,40,609 క్యూసెక్కులు విడిచిపెడుతున్నారు. అక్కడి నుంచి వచ్చింది వచ్చినట్లుగా దిగువకు వదిలేస్తున్నారు. పులిచింతల నుంచి వస్తున్న 5,43,433 క్యూసెక్కులతోపాటు.. సమీప వాగులు. కీసర, పాలేరు, బుడమేరు నుంచి భారీగా వస్తున్న వరదతో కలిపి మొత్తం 11,43,201 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కృష్ణా నదీ పరివాహక ప్రాంతాలు మరో వారం రోజులు అప్రమత్తంగా ఉండాలని జాతీయ వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. వరద క్రమంగా తగ్గు ముఖం పడుతోందని.. అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని సూచించింది. బ్యారేజీ వద్ద వరద మంగళవారం 9 లక్షల క్యూసెక్కులు ఉంటుందని అంచనా వేసింది. వచ్చే వారం రోజుల్లో శ్రీశైలంలోకి 5,29,000 క్యూసెక్కులు, నాగార్జున సాగర్‌లోకి 5,47,300 క్యూసెక్కులు, ప్రకాశం బ్యారేజీలోకి 10,76,700 క్యూసెక్కుల వరద రావచ్చని యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్స్ (ఈసీఎండబ్ల్యూఎఫ్) హెచ్చరించింది. ఐఎండీ ఆలమట్టిలో 11,45,00 క్యూసెక్కులు, శ్రీశైలం జలాశయంలో 5,28,300 క్యూసెక్కులు, నాగార్జున సాగర్‌లో 5,47,700 క్యూసెక్కులు, ప్రకాశం బ్యారేజీలో 10,76,800 క్యూసెక్కుల వరద వస్తుందని ఐఎండీ కూడా పేర్కొంది.

కాల పరీక్షకు తట్టుకున్న 'ప్రకాశం'!

- బ్యారేజీ కట్టాక ఇప్పుడే అత్యధిక వరద
- 2009లో 11.10 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- దానికి ముందు 1998లో 9.5 లక్షలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విజయవాడ నగరానికి చెరగని గుర్తుగా నిలిచే ప్రకాశం బ్యారేజీ కాల పరీక్షకు తట్టుకుని నిలబడింది. కృష్ణా నది నుంచి 11,43,201 క్యూసెక్కుల వరద మహోగ్రంగా వచ్చినా చెక్కు చెదరకుండా నిలబడింది. ఈ బ్యారేజి నిర్మాణం తర్వాత ఈ నదిలో ఇంత వరద ప్రవాహం రావడం ఇదే తొలిసారి. కృష్ణా గుంటూరు జిల్లాల మధ్యలో కనకదుర్గ ఆలయానికి చేరువలో కృష్ణా నదికి అడ్డంగా దీనిని నిర్మించారు. దీనిని రెండు దశల్లో కట్టారు. మొదట దీనిని బ్రిటిష్ పాలకులు ఒక ఆనకట్టగా నిర్మించారు. కృష్ణా డెల్టాను వరదల నుంచి రక్షించి ఇరిగేషన్‌కు నీరు ఇవ్వడానికి అప్పట్లో దీనిని చేపట్టారు. సర్ ఆర్థర్ కాటన్ మార్గదర్శకత్వంలో ఇంజనీర్ ఓర్ దీనిని 1852-1855 మధ్య నిర్మించారు. అప్పట్లో దీని నిర్మాణానికి రూ.1.75 కోట్లు వ్యయమైనట్లు అంచనా. సుమారుగా ఐదున్నర లక్షల ఎకరాలు దీని కింద సాగు జరిగేది. ఆనకట్ట నిర్మాణం తర్వాత దిగువ ప్రాంతంలో సాగు విస్తరిస్తూ వచ్చింది. దానికి చాలినంత నీరు కాల్వల ద్వారా అందకపోవడంతో ఆనకట్టను బ్యారేజీగా పునర్నిర్మించారు. దీనివల్ల సుమారు మూడు టీఎంసీల నీటిని ఇక్కడ నిల్వ చేసే అవకాశం ఏర్పడింది. దీని కోసం ఆనకట్ట ఎత్తు 12 అడుగులకు పెంచారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1954- 57 మధ్య కాలంలో ఇది జరిగింది. ఆ సమయంలో అయిన ఖర్చు రూ.2.75 కోట్లు. దీనివల్ల కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల్లో 13 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా పనిచేసిన టంగుటూరి ప్రకాశం పంతులు మరణానంతరం ఈ బ్యారేజీకి ఆయన పేరు పెట్టారు. దీని పటిష్ఠంపై తొలి పరీక్ష 2009 కృష్ణా నది వరదల సమయంలో వచ్చింది. ఆ ఏడాది అక్టోబరు 5న ఈ బ్యారేజీ నుంచి 11.10 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్లింది. ఈ బ్యారేజీ నిర్మాణం తర్వాత ఇంత వరద చూడడం ఇదే ప్రథమం. దానికి ముందు 1998లో 9.5 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. ఈసారి వరద పాత రికార్డులను చెరిపివేసింది. సోమవారం ఉదయం 11,43,201 క్యూసెక్కుల వరద బ్యారేజీ గేట్ల గుండా సముద్రం దిశగా ఉరకలేసింది. ఇరిగేషన్ శాఖ వర్గాల సమాచారం ప్రకారం.. 8 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకొనేలా ఆ కాలంలో దీని నిర్మాణం జరిగింది. కానీ కాల పరీక్షను.. వరద పరీక్షను రెంటినీ తట్టుకుని నిలబడడం విశేషం. బ్యారేజీకి ఉన్న మొత్తం 70 గేట్లను పూర్తిగా ఎత్తివేయడంతో వరద ప్రవాహం సాఫీగా దిగువకు వెళ్లిపోయింది. వరద బాగా ఎక్కువగా ఉండటంతో బ్యారేజీపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. విజయవాడ నుంచి అమరావతికి రాకపోకలు దీని మీదుగానే సాగుతుంటాయి. వాటిని నిలిపివేసి ప్రత్యామ్నాయంగా కనకదుర్గమ్మ వారధి మీదుగా తాడేపల్లి నుంచి అమరావతికి వాహనాలు తిరుగుతున్నాయి.



నిండుకుండను తలపిస్తున్న శ్రీశైలంలోని ప్రాజెక్టు బ్యాక్ వాటర్

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

- నాగార్జున సాగర్‌కు పోటెత్తుతున్న ప్రవాహం

శ్రీశైలం/వీపీ సౌత్, నరసరావుపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి సోమవారం కూడా వరద ప్రవాహం భారీగా కొనసాగింది. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల నుంచి 3,20,805 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 4,479 క్యూసెక్కులు మొత్తం 3,25,284 వరద నీరు వస్తోంది. డ్యాం 10 క్రస్టుగేట్లను ఎత్తి 4,71,730 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 884.10 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 210.5133 టీఎంసీలుగా ఉంది. 26 గేట్లను ఎత్తి 5,40,656 క్యూసెకుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా 586.80 అడుగులకు చేరింది. దిగువన పులిచింతలకు5,43,070 క్యూసెక్కుల వరద వస్తుండగా.. 5,43,433 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు.

టీబీ డ్యాంలో 98 టీఎంసీలు


బళ్లారి సిటీ, సెప్టెంబరు 2: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం గరిష్ఠ నిల్వకు చేరువవుతోంది. డ్యాం గరిష్ఠ నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, సోమవారం ఉదయం 98.101 టీఎంసీలు ఉంది. జలాశయంలోకి 30,031 క్యూసెక్కుల వరద చేరుతోంది. ఔట్‌ఫ్లో 15,237 క్యూసెక్కులు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

పోలవరం, సెప్టెంబరు 2: ఎగువన భారీ వర్షాల ప్రభావంతో ఉప నదులు, కొండ వాగుల జలాలు గోదావరి నదికి చేరుతున్నాయి. గోదావరి నీటిమట్టం సోమవారం పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 5,16,058 క్యూసెక్కుల వరద జలాలను దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే ఎగువన 30.190 మీటర్లు, స్పిల్‌వే దిగువన 21.130 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు ప్రాజెక్టు ఈఈలు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు స్టడీసెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్‌లలో భాగంగా కాంటాక్ట్ తరగతులు, ల్యాబొరేటరీ సెషన్స్, అసైన్‌మెంట్స్, వార్షిక పరీక్షలు ఉంటాయి. ఆలిండియా రేడియో ద్వారా నిర్ణీత సమయాల్లో రేడియో పాఠాలు ప్రసారం చేస్తారు. డిగ్రీ ప్రోగ్రామ్‌లలో రెండు, మూడు సంవత్సరాలు; పీజీలో రెండో సంవత్సరం చదువుతున్నవారు; ఓల్డ్ బ్యాచ్ స్టూడెంట్స్ కూడా తమ ట్యూషన్ ఫీజులు చెల్లించవచ్చు.



అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో డిగ్రీ, పీజీ

డిగ్రీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత రెండేళ్ల ఐటీఐ/ఒకేషనల్ కోర్సులు చేసినవారు, మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఇంగ్లీష్ లేదా తెలుగు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. బీఏ(పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ), బీఎస్సీ(బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ) కోర్సులు ఉర్దూ మీడియంలో కూడా అందుబాటులో ఉన్నాయి.

- బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ పూర్తిచేసినవారు; ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు అర్హులు.

పీజీ ప్రోగ్రామ్‌లు

- కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ(మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్)కోర్సుకు మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన విధంగా సంబంధిత/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: సైకలాజికల్ కౌన్సెలింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఉమెన్ స్టడీస్, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం.

- హ్యూమన్ రైట్స్ ప్రోగ్రామ్‌ను తెలుగు మాధ్యమంలో, మిగిలినవాటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.

విభాగాలు: ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్.

- ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల మాధ్యమంలో, మిగిలిన వాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.braou.ac.in

నిట్ ఆంధ్రలో పీహెచ్‌డీ

పశ్చిమగోదావరి జిల్లా-తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ ఆంధ్ర)- విశ్వేశ్వరాయ స్కీమ్ కింద పీహెచ్‌డీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో 5 సీట్లు, పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో 2 సీట్లు ఉన్నాయి. రిటెన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు.

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

అర్హత: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి అభ్యర్థులు ఇంజనీరింగ్/టెక్నాలజీ/సైన్స్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయిల్లో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. గేట్/నెట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే రీసెర్చ్ ఆర్గనైజేషన్‌లు/అకడమిక్ ఇన్‌స్టిట్యూషన్‌లు/ఇండస్ట్రీలలో కనీసం రెండేళ్ల పనిచేసిన అనుభవం ఉండాలి.

ఫెలోషిప్: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; చివరి మూడేళ్లు నెలకు రూ.43,750లు ఇస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1,20,000 ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **ఈ-మెయిల్:** phdadmissions@nitandhra.ac.in
- **వెబ్‌సైట్:** www.nitandhra.ac.in



జేఎన్‌టీయూఏలో ఐసీపీ సెకండ్ ఫేజ్

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ), స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'బీటెక్ & బీఎస్+ఎంఎస్' ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి సెకండ్ ఫేజ్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. జేఈఈ మెయిన్స్ 2024 ర్యాంక్/ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/ఇతర రాష్ట్రాల ఎంట్రెన్స్ ఎగ్జామ్‌ల స్కోర్లు ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిని అనుసరిస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు

- ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. అభ్యర్థులు మొదటి మూడేళ్లు అనంతపురం జేఎన్‌టీయూఏలో, చివరి మూడేళ్లు స్వీడన్ బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగేళ్ల కోర్సు పూర్తయిన తరవాత ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. సీఎస్ఈ, ఈసీఈ విభాగాలు ఎంచుకోవచ్చు.
- సీఎస్ఈ అభ్యర్థులు జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్(సీఎస్ఈ); స్వీడన్ బీటీహెచ్ నుంచి బీఎస్(కంప్యూటర్ సైన్స్), ఎంఎస్(కంప్యూటర్ సైన్స్/సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్-ఏఐ&ఎంఎల్) చదవాల్సి ఉంటుంది.
- ఈసీఈ అభ్యర్థులు జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్(ఈసీఈ); స్వీడన్ బీటీహెచ్ నుంచి బీఎస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్), ఎంఎస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-మెషిన్ లెర్నింగ్, సెన్సార్స్ అండ్ సిస్టమ్స్) చదవాలి.

మిగిలిన సీట్ల వివరాలు: కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సీఎస్ఈ)లో 7 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)లో 10 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. జేఈఈ మెయిన్స్ 2024 ర్యాంక్/ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/ఇతర రాష్ట్రాల ఎంట్రెన్స్ ఎగ్జామ్‌ల స్కోర్లు ఉండాలి.

- **సెకండ్ ఫేజ్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

జాబ్ కార్నర్

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ఖాళీలు

ప్రభుత్వరంగ సంస్థ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 14

1. ఔట్‌ఫిట్ అసిస్టెంట్- ఫిట్టర్(పైప్, ప్లంబర్): **2 పోస్టులు**
2. మూరింగ్ అండ్ స్కాఫోల్డింగ్ అసిస్టెంట్: **12 పోస్టులు**

అర్హత: పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు ఔట్‌ఫిట్ అసిస్టెంట్ పోస్టుకు మొదటి ఏడాదికి రూ.23,300; రెండో ఏడాది రూ.24,000; మూడో ఏడాది రూ.24,800. మూరింగ్ అండ్ స్కాఫోల్డింగ్ అసిస్టెంట్‌కు మొదటి ఏడాది రూ.22,100; రెండో ఏడాది రూ.22,800; మూడో ఏడాది రూ.23,400.

ఎంపిక విధానం: ఫేజ్-1, 2 రాత పరీక్షలు, పని అనుభవం తదితరాల ఆధారంగా

ఫీజు: రూ.300. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 13

వెబ్‌సైట్: https://cochinshipyard.in/

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో గెస్ట్ ఫ్యాకల్టీ

ములుగులోని సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం... 2024-25 సంవత్సరానికి గాను గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 6

1. గెస్ట్ ఫ్యాకల్టీ(ఎకనామిక్స్): **3 పోస్టులు**
2. గెస్ట్ ఫ్యాకల్టీ(ఇంగ్లీష్): **3 పోస్టులు**

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ(ఎకనామిక్స్/ఇంగ్లీష్)తో పాటు నెట్/జేఆర్ఎఫ్ ఉత్తీర్ణత.

దరఖాస్తు విధానం: ఆసక్తిగల అభ్యర్థులు సీవీతో పాటు స్కాన్ చేసిన సంబంధిత ధ్రువపత్రాలను మెయిల్ ద్వారా పంపాలి.

ఈ - మెయిల్: hr@uohyd.ac.in

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 12

వెబ్‌సైట్: https://ssctu.ac.in/

యూఓహెచ్‌లో ప్రాజెక్ట్ పోస్టులు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 3

1. రీసెర్చ్ అసోసియేట్: **1 పోస్టు**
2. ప్రాజెక్ట్ అసోసియేట్-1: **1 పోస్టు**
3. ఫీల్డ్ వర్కర్: **1 పోస్టు**


అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు ఆర్ఏ పోస్టుకు రూ.54,000. పీఏ పోస్టుకు రూ.31,000. ఫీల్డ్ వర్కర్ పోస్టుకు రూ.18,000.

దరఖాస్తు పంపాల్సిన ఈ-మెయిల్: rks@uohyd.ac.in


దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: సెప్టెంబరు 16

వెబ్‌సైట్: uohyd.ac.in/



విపత్తు నిర్వహణ చట్టం(2005) సవరణ బిల్లు 2024

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



(నిన్నటి దిక్సూచి తరువాయి)

విపత్తు నిర్వహణ చట్ట సవరణ బిల్లు 2024పై విమర్శలు

● **రాజ్యాంగ బద్ధత కొరవడింది; రాష్ట్రాల శాసనాధికార పరిధి అతిక్రమించబడింది:** విపత్తు నిర్వహణ అనే పదం కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాల్లో ఎక్కడా లేదు. పైగా వ్యవసాయరంగంలో ఎదురయ్యే చీడపీడల వంటి రాష్ట్ర జాబితాలోని అంశాలు సైతం విపత్తుల జాబితాలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వం ఉమ్మడి జాబితాలోని 23వ అంశమైన 'సామాజిక భద్రత, సామాజిక బీమా, ఉపాధి, నిరుద్యోగం' అనే విషయాలకు సంబంధించిన ఎంట్రీ ఆధారంగా విపత్తు నిర్వహణ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. ఇది నిర్బంధంగా రాష్ట్రాల శాసనాధికారాల్లోకి చొచ్చుకుని రావడమే. రాజ్యాంగ అతిక్రమణే అని విపక్షాలు వాదిస్తున్నాయి. ఆదేవిధంగా సామాజిక భద్రత కిందకు అన్ని విపత్తు అంశాలనూ చేర్చలేం. కాబట్టి ఈ బిల్లు అసంపూర్ణమని కూడా విపక్షాలు వాదిస్తున్నాయి.

● **అధికారాల మధ్య వ్యాప్తి, గందరగోళం:** ఈ బిల్లు అనేక అధికారాలను వివిధ స్థాయిల్లోని సంస్థలకు దత్తం చేసింది. ఇది అధికారుల విధి నిర్వహణలో గందరగోళం సృష్టించి విపత్తు సహాయక చర్యలకు ఆటంకం కలిగించే అవకాశం ఉంది.

● **విపత్తు నిర్వహణకు సంబంధించి కేంద్రానికి విస్తృత అధికారాలు:** ఈ బిల్లు అనేక అంశాల దృష్ట్యా విపత్తు నిర్వహణలో కేంద్రానికి విస్తృత అధికారాలు దత్తం చేసింది. అనేక నియమాలు రూపొందించే అధికారం కేంద్రానికి కల్పించింది. ఇది రాష్ట్రాల విపత్తు నిర్వహణ చర్యలకు, ప్రణాళికలకు ప్రతిబంధకం. రాష్ట్రాల వారీగా వాటి ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా విపత్తు నిర్వహణ విధానాల, కార్యక్రమాల రూపకల్పన జరగాలి.

అయితే ఈ విమర్శలకు ప్రతిస్పందనగా ప్రభుత్వం 2013 నాటి టాస్క్‌ఫోర్స్ నివేదికను, రెండో పరిపాలన సంస్కరణల సంఘం అభిప్రాయాన్ని ముందుకు తెస్తోంది. టాస్క్‌ఫోర్స్ నివేదికలో 1999 నాటి జె.సి.పంత్ ఆధ్యక్షతన నియమించిన హైపవర్ కమిటీ సూచన ఉటంకించింది. దీని ప్రకారం రాష్ట్రాల జాబితాలో కేవలం రెండు అంశాలు మాత్రమే ఎంట్రీ నంబరు 14(వ్యవసాయం, చీడపీడల నుంచి రక్షణ), ఎంట్రీ నంబరు 17(నీరు, నీటి సరఫరా, నీటిపారుదల, ఎంబార్క్‌మెంట్స్) విపత్తు నిర్వహణ కిందకు వస్తాయి. కాబట్టి దేశవ్యాప్తంగా ఒక సమగ్ర విపత్తు నిర్వహణ ప్రణాళిక తీసుకురావడానికి భారత రాజ్యాంగ షెడ్యూల్ 7లో ఒక ఎంట్రీగా విపత్తు నిర్వహణను చేర్చాల్సి ఉందని అభిప్రాయపడింది.

ఆదేవిధంగా రెండో పరిపాలన సంస్కరణల సంఘం 3వ రిపోర్టు అయిన 'క్రైసిస్ మేనేజ్‌మెంట్ : ఫ్రం డెస్పైర్ టు హోప్' అనే 2006 నాటి నివేదికలో కూడా విపత్తు నిర్వహణ అంశంపై చట్ట అధికారం కేంద్రానిదే అని సూచించింది. ఈ నివేదికలో, రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో గల మూడు జాబితాల్లో ఏ ఒక్క జాబితాలో కూడా 'విపత్తు నిర్వహణ' అనే అంశం పేర్కొనని కారణంగా, అది అవశిష్ట అధికారం కిందకు వస్తుంది. అవశిష్ట అధికారం మేరకు ఏ జాబితాలోనూ పేర్కొనని అంశాలపై చట్టాలు చేసే అధికారం కేవలం కేంద్రప్రభుత్వానికి మాత్రమే ఉంటుందని ఇతిమిద్ధంగా తెలియజేసింది. కాబట్టి ఈ బిల్లు రాజ్యాంగబద్ధమే, రాష్ట్రాల శాసన అధికారాల అతిక్రమణ కాదని కేంద్రప్రభుత్వ వివరణ.

అయితే విపత్తు నిర్వహణకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా, భవిష్యత్తులో అధికార పరిధులపై వివాదాలు తలెత్తకుండా ఉండే నిమిత్తం 'విపత్తు నిర్వహణ' అంశాన్ని రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో చేర్చేందుకు సైతం రాజ్యాంగ సవరణ ఆవశ్యకత ఉంది.




ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

లిటిల్స్

గాడిద నేర్చుకున్న పాఠం

ఒక ఊరిలో రాజు అనే వ్యాపారి దగ్గర ఒక గాడిద ఉండేది. రాజు ప్రతి రోజు నగరంలోని సంతకు వెళ్లి, సరుకులు కొనుగోలు చేసి, ఆ సరుకుల మూటలను గాడిద మీద వేసుకుని తెచ్చి, తన పల్లెలో అమ్మేవాడు.ఒకరోజు రాజు ఉప్పు మూటలను కొని గాడిద వీపు మీద వేసి తిరిగి వస్తుండగా, దారిలోఉన్న ఒక నీటి మడుగును చూసుకోకపోవడం వల్ల, గాడిద మూటలతో సహా ఆ నీళ్లలో పడిపోయింది. నీళ్లలో నుండి లేచాక ఉప్పు చాలా కరిగిపోవడం వల్ల గాడిదకు వీపు మీది బరువు తగ్గి చాలా హాయిగా అనిపించింది. ఆ మర్నాడు కూడా రాజు ఉప్పు మూటలే కొనుగోలు చేయడంతో ఈసారి కావాలనే గాడిద నీటిలో పడిపోయింది. వరుసగా మూడు రోజులు ఇలాగే ఉప్పు మూటలను నీటిలో పడవేస్తూ, తన బరువును తగ్గించుకుంటూ ఉంది.



ఆ రోజు రాజు గాడిద కావాలనే నీటిలో పడిపోయి తనకు నష్టం చేస్తుందని గమనించాడు. దీనికి ఎలాగైనా బుద్ధి చెప్పాలి అనుకున్నాడు. ఆ మర్నాడు కూడా గాడిద సంతకు వెళ్లి, తిరిగి వస్తూ, అలవాటుగా వీపు మీది మూటలను నీళ్లలో పడేసింది. కానీ నీటిలో నుంచి పైకి లేచి చూస్తే, మూటలు అంతకు ముందు కంటే ఇంకా బరువు ఎక్కువై గాడిద కదలలేని పరిస్థితి వచ్చింది. ఎందుకంటే, ఆ రోజు గాడిద బద్ధకానికి సరైన బుద్ధి చెప్పాలని, రాజు దాని వీపు మీద పత్తి మూటలు వేయించాడు. అవి నీటిలో తడిసి ఇంకా ఎక్కువ బరువు అయ్యాయి. ఈ విషయం తెలుసుకుని అలా బుద్ధి తెచ్చుకున్న గాడిద ఆ రోజు నుండి యజమాని చెప్పిన పని చక్కగా చేస్తూ చురుకుగా ఉంది.


7 తేడాలను కనిపెట్టండి



జత ఉన్న బొమ్మ ఏది?



సరైన నీడను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 400

					9		1	
	4		6		5		7	3
			4			8		
8	9							
	7	1				9	5	
							3	6
		7			2			
4	5		3		6		9	
	6		1					

సుడోకు - 399 సమాధానం

2	4	8	6	9	7	1	5	3
9	5	1	3	2	8	4	6	7
6	7	3	4	5	1	9	8	2
7	8	9	2	1	5	6	3	4
4	3	2	8	7	6	5	9	1
1	6	5	9	3	4	2	7	8
5	9	4	1	8	3	7	2	6
8	2	6	7	4	9	3	1	5
3	1	7	5	6	2	8	4	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.